First time in Telugu Literature

గ్రీకు వాఙ్మయం-3

# ఇతిహాసచక్రం
(Epic Cycle)

&



# గ్రీకు వీరులు
(Greek Heroes)

స్వేచ్ఛానువాదం

డాక్టర్ లంకా శివరామప్రసాద్

గ్రీకు వాఙ్మయం-3

# ఇతిహాసచక్రం
(Epic Cycle)

&




# గ్రీకువీరులు
(Greek Heroes)

స్వేచ్ఛానువాదం
డాక్టర్ లంకా శివరామప్రసాద్

# Epic Cycle

Translated by

**Dr. Lanka Siva Rama Prasad**

November 2011

All rights reserved

Translation Copyright @ 2011
by **Dr. Lanka Siva Rama Prasad**

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL
Andhra Pradesh - 506 002, INDIA
Mobile : 9768157958
Email: lankasrprasad@gmail.com

Available at :

**Vishalandhra Book House**
All Branches

Price : ₹ **250 $ 6**

Cover Design & Post Script

**Gannu Suresh, Pabba Raju & P. Prakash**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal. ✆ 0870-2426364

***This book is presented to...***

*"Quality healthcare by compassionate medical professionals, accessible and affordable to all"*



SevenHills HealthCity, Marol Maroshi Rd, Andheri East, Mumbai - 400059.
Ph: 022-6767 6767. Website: www.sevenhillshospital.com



**Dr. Jitendra Das Maganti**
Chairman & Managing Director

**Dr. Jitendra Das Maganti** hails from Andhra Pradesh. Himself a surgeon comes from a renowned political and industrial family started Seven Hills Hospital at Vizag a resounding success in that area. His dream of providing medical care at international standards realized into Seven Hills Hospital, Mumbai, one of the largest hospitals in Asia with 1500 beds and 36 operation theatres and multi specialties under one roof.

## <u>Message from CMD's Desk</u>

"It is indeed a great privilege for me and my team to present SevenHills Hospital, Mumbai.

We bring the tradition and experience of two and a half decades in delivering affordable healthcare services in a patient friendly environment with a strong belief in ethical and transparent medical practice. SevenHills Hospital has established itself as a comprehensive healthcare system in Visakhapatnam, providing multi-specialty tertiary care services to more than 50 million people across six states.

Our facility in Mumbai, is not just a Hospital, it is truly a Health City, with state-of-the-art healthcare delivery system.

We offer a blend of the finest medical and surgical skills, delivered with compassion and a patient-centric approach "within the reach" of everyone."

**- Dr. Jitendra Das Maganti**



**Dr. Velivela Satya Prasad**
Chief Cardio-thoracic Surgeon

**Dr. V. Malathy**
International Medical Coordinator

# Friends Forever

*Those friends thou hast, and*
*their adoption tried*
*grapple them to thy soul*
*with hoops of steel*

***-Shakespeare; Hamlet***

**Dr. Velivela Satya Prasad**

A renowned Cardio-thoracic & Vascular Surgeon who has assisted and performed over 20,000 cardiovascular procedures abroad and at home also performed the first six human cardiac transplantation in the country along with Dr. K.M. Cherian, Chennai is presently working as chief cardiac surgeon at Seven Hills Hospital, Mumbai.

**Dr. V. Malathy**

Specialist in Obstetrics & Gynecology worked as senior medical administrator at AIMS, Kerala – (May 1998 – August 2008), Chief Hospital Administrator for KIMS, Hyderabad (November 2008 – December 2009). Presently
International Medical Coordinator at Seven Hills Hospital, Mumbai.

My friendship with them blossomed into a beautiful relationship that surpassed the boundaries of the mundane world.

# R E S U M E



## Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Web Engineer- Web Designer
Member of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

**AUTHOR:-**

1. Alchemy- Telugu Poetry
2. VaanaMabbula Kanthi khadgam- Telugu Poetry
3. Tea Cuppulo toofan- Telugu Poetry
4. Tangeti junnu- Telugu Poetry
5. Genome- Biotechnology novel in Telugu
6. Satyanveshanalo- Telugu Novel
7. Sankhya Saastram- Numerology in Telugu
8. Swapna Saastram- Dream Analysis in Telugu
9. Dr. Jayadev Cartoons in Telugu
10. Moodu Swapnalu- oka Melakuva- Telugu Poetry
11. How to be Happy- English Anthology
12. In Search of Truth- English Novel
13. Telugu Songs and Poems- English Translation
14. Pothana's Bhagavatham- English translation (Abridged)
15. Sankaracharya's Soundarya Lahari- English Translation
16. Samparayam of Suprasannacharya- English Translation
17. Fire & Snow of Raama Chandramouli- English Translation
18. The Twilight Zone- English Poetry- Cento
19. The Iliad of Homer- Telugu Translation
20. Odyssey- Telugu Translation
21. Shades - English Poetry

# ప్రస్తావన

గ్రీకు వాఙ్మయం మూడవ భాగంగా వెలువడుతున్న ఎపిక్‌సైకిల్ (Epic Cycle - ఇతిహాసచక్రం) పంద్రెండు కావ్యాల సమాహారం. టైటానొమాఖె (మహాకాయుల సంగ్రామం – Titanomachy), థెబన్ సైకిల్ (Theban Cycle = Oedipus, Thebais, Epigony), ట్రోజన్ సైకిల్ (Trozan Cycle = Cypria, Iliad, Aethiopus, Little Iliad, Iliuperesis; Nostoi, Odyssey, Telegony) అన్నీ కలిపి పంద్రెండు కావ్యాలు.

ఆనాటి గ్రీకులకు ద్వాదశ సంఖ్య – పంద్రెండు – 12 ముఖ్యమైన సంఖ్యగా గమనించవచ్చును. 12 దైత్యులు, 12 ఒలింపయన్ దేవతలు, 12 హెర్క్యులస్ ఘనకార్యాలు, ఎపిక్‌సైకిల్‌లోని పన్నెండు కావ్యాలు, 12×2=24 భాగాలున్న ఇలియాడ్, ఒడెస్సీ గ్రంథాలు మనకు ఈ విషయాన్ని చెప్పకనే చెబుతాయి.

ఈ గ్రంథంలో ఎపిక్‌సైకిల్‌లోని పంద్రెండు కావ్యాల సారాంశమే కాక గ్రీకుదేవతల గురించి, ఖ్యాతిగాంచిన గ్రీకువీరుల గురించి సంక్షిప్తంగా వివరించ బడినాయి. హోమర్ విరచిత ఇలియాడ్, ఒడెస్సీలను పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకంలోని వివరణలు ఉపయుక్తం కాగలవు.

మన పురాణేతిహాసాల్లోని అనేక ఘట్టాల ఆనవాళ్లు గ్రీకు వాఙ్మయంలో కనబడడం 'ఎవరు ముందు' అనే సందేహ వాదాన్ని మనముందుకు తీసుకునివచ్చి ఆలోచనల్లో పడవేస్తాయి. ఉదాహరణకు ట్రిప్టొలెమస్ ఆకాశయానం – భాగవతంలోని కర్దముని ఆకాశగమనాన్ని, డ్యుకాలియన్ కాలపు జలప్రళయం – సత్యవ్రతుని నౌకాప్రయాణాన్ని (Noah's ark), ఒడెస్సీ – నలదమయంతుల చరిత్రను, ఎఖిల్లిస్ హీల్ (Achilles Heel) – దుర్యోధనుని దుర్బలమైన తొడభాగాన్ని, ఎఖిల్లిస్ అలక – భారతంలోని కర్ణుని ఆగ్రహాన్ని – ఇలా ఎన్నెన్నో పోలికలు కన్పించి మనలను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతాయి. దైవసర్గం, మానవసర్గంలో కూడ హిందూ దేవతలకు గ్రీకు దేవతలకు సారూప్యాలు కనిపిస్తాయి. రామాయణ భారతాల్ని – ఇలియాడ్, ఒడెస్సీలతో పోల్చిన విమర్శకులు కూడా ఉన్నారని మనకు తెలుసును.

ఈ ఎపిక్‌సైకిల్ (ఇతిహాస చక్రం) కావ్యం చదువరులకు, విశ్లేషకులకు, విమర్శకులకు గ్రీకు వాఙ్మయాన్ని అర్థం చేసుకోవడంలో ఉపకరిస్తుందని సృజనలోకం మనసారా భావిస్తున్నది.

**– డా॥ లంకా శివరామప్రసాద్**

# విషయసూచిక

## ఎపిక్‌సైకిల్



| | | | |
|---|---|---|---|
| 1. | మహాకాయుల చరిత్ర – దైవసృష్టి | ..... | 1 |
| 2. | ఇడిపస్ | ..... | 12 |
| 3. | థెబాయిస్ | ..... | 15 |
| 4. | ఎపిగొని | ..... | 21 |
| 5. | సైప్రియా | ..... | 22 |
| 6. | ఇలియాడ్ | ..... | 25 |
| 7. | ఎథియోపిస్ | ..... | 34 |
| 8. | చిన్న ఇలియాడ్ | ..... | 35 |
| 9. | ట్రాయ్ నగర విధ్వంసం | ..... | 37 |
| 10. | తిరుగుప్రయాణం | ..... | 38 |
| 11. | ఒడెస్సి | ..... | 39 |
| 12. | టెలెగొని | ..... | 45 |


## గ్రీకుదేవతలు



| | | | |
|---|---|---|---|
| ఎ. | అయిదు యుగాలు – హెసియాడ్ | ..... | 48 |
| 1. | ఆదిదేవతలు | ..... | 49 |
| 2. | దైత్యులు (Titans) | ..... | 51 |
| 3. | ద్వాదశ ఒలింపిక్ దేవతలు | ..... | 52 |
| 4. | చిల్లర దేవుళ్లు. | ..... | 57 |


## గ్రీకువీరులు


| | | | |
|---|---|---|---|
| ఎ. | ప్రాచీన గ్రీకు కాలరేఖ | ..... | 60 |
| బి. | మానవసృష్టి | ..... | 61 |
| 1. | ట్రిప్టొలెమస్ | ..... | 64 |
| 2. | పెర్సియస్ | ..... | 65 |
| 3. | జేసన్ | ..... | 67 |
| 4. | థెసియస్ | ..... | 70 |
| 5. | హెరాక్లిస్ | ..... | 74 |
| 6. | ఇడిపస్ | ..... | 78 |
| 7. | ఎఖిల్లిస్ | ..... | 81 |
| 8 | ఒడెసిస్ | ..... | 84 |
| 9. | హెక్టార్ | ..... | 87 |
| 10. | పారిస్ | ..... | 88 |
| 11. | ఎయినీస్ | ..... | 89 |
| 12. | ఏథెన్స్ స్త్రీలు | ..... | 90 |



ILIAD
MAP
Phthia
Achilleus
Lokris
Lesser Aias
Aulis
Sacrifice of Iphigenia
Athens
Troy
Hektor
Priam
Paris
Hekabe
Helen
Ithaka
Odysseus
Penelope
Pylos
Nestor
Argos
Diomedes
Sparta
Helen
Menelaos
Mycenae
Agamemnon
Klytaimestra
Salamis
Greater Aias
Krete
Idomeneus
Lykia
Sarpedon
Glaukos



# హోమర్

## Homer (8th Century B.C.)

పాశ్చాత్య వాఙ్మయంలో ఆదికావ్యాలైన ఇలియాడ్, ఒడెస్సీలకు మూలకర్తగా గుర్తించబడిన హోమర్ పుట్టుపూర్వోత్తరాలు, అనేకమంది ఆదికవుల జీవిత చరిత్రలలానే ఇంకా నిర్ధారణ కాని దశలోనే ఉన్నాయి.

హెరొడోటస్ తనకు నాలుగు వందల సంవత్సరాలకు పూర్వం హోమర్ కాలంగా పేర్కొన్నాడు. ఆ రకంగా హోమర్ క్రీస్తుపూర్వం 850–800 కాలం నాటి వాడుగా చరిత్రకారులు భావిస్తున్నారు. కొన్ని ప్రాచీన గ్రంథాలు అతని కాలాన్ని క్రీస్తుపూర్వం 1194–1184 అంటే సుమారు ట్రోజన్ యుద్ధపు కాలంగా ప్రకటించాయి.

'హోమర్' అనేది గ్రీకు పదమే అయినా అనేకమంది (మార్టిన్‌వెస్ట్) దానిని కవుల వంశపారంపర్య నామంగా అభివర్ణించారు. మనం యవన (Ionian) రాజ్యంగా పేర్కొనే ఆసియామైనర్‌లోని స్మిర్నా (Smyrna) లేదా కియాస్ (Chios) ద్వీపంలో జన్మించిన హోమర్ సైక్లాజిక్ ఐవస్ ద్వీపంలో మరణించాడని ప్రతీతి. అతని నిజనామం మెలెసిజినెస్ (Melisigenes) – మెలిస్ నదీ ప్రాంతంలో పుట్టినవాడు. ఇలియాడ్ రెండవ పుస్తకంలోని ఆ ప్రాంతపు సహజ వర్ణన ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తున్నది. అంతేకాక కియాస్ ద్వీపంలో హోమర్ వారసులు వంశపారంపర్య గాయకుల కూటమిగా (Bardic guild) ఉండేవారని వారు రాజసభల్లో, ఉత్సవాల్లో, దైవపూజల్లో సంచార గాయకులుగా (Wandering ministrel) వ్యవహరించేవారని తెలుసున్నది.

ఈ విషయం మనకు ఆదికవి వాల్మీకి జీవితాన్ని, అతనివద్ద రాముని చరిత్రను నేర్చుకుని గానం చేసిన లవకుశుల సాంప్రదాయాన్ని గుర్తు చేస్తున్నది కదా! రామాయణంలోని ప్రక్షిప్తాలు వాల్మీకిని రామాయణపు కాలానికి చేర్చినట్లు హోమర్ తరువాత తరం వాళ్లు హోమర్‌ను ట్రోజన్ యుద్ధకాలానికి చేర్చి ఉండవచ్చును.

హోమర్ పదానికి అర్థం (Homeros=hostage, surety-he who accompanies; he who is forced to follow) – బందీ, అనుసరించి వెళ్లవలసినవాడు లేదా అంధుడు. ఒడెస్సీలోని డెమొడోకస్ అనే గాయకుడు కూడా అంధుడే!

హోమర్‌ను గ్రీకు ఆల్ఫాబెట్ – అక్షరమాలను కనుక్కున్నవాడుగా కొందరు పేర్కొంటారు. ఆరుగణాలున్న పాదాలతో (గణానికి మూడక్షరాలు= Dactylic) (ఆరు గణాలు = Hexameter) - dum-da-da rhythm with six dums to the line – వ్రాయబడిన ఇలియాడ్ (15000 lines), ఒడెస్సీ(12110 lines)లే కాక ఎపిక్‌సైకిల్‌లోని మిగిలిన భాగాలు, హోమర్ స్తోత్రాలు, బాట్రకోమయోమాఖియా = కప్ప–ఎలుక యుద్ధం, మార్గైట్స్, ఒయుఖేలియా ముట్టడి (The Capture of oechalia), ఫొకాయిస్ గ్రంథాలు అతని రచనలుగా చెప్పబడుతున్నాయి. క్రీస్తుపూర్వం 3వ శతాబ్దినాటికే హోమర్‌కు దేవాలయాలు నిర్మించి ఆరాధించినారు.



# 1. మహాకాయుల చరిత్ర
## (Titanomachy or War of the Titans)
## Epic Cycle-1

గ్రీకు ఇతిహాసంలోని 'మహాకాయుల సంగ్రామం' (Titanomachy) పదేళ్లపాటు దేవతలలోని రెండు పక్షాల మధ్య థెస్సాలేలో జరిగిన అనేక యుద్ధాల్ని వర్ణిస్తుంది. మానవులింకా పుట్టని ఆ యుగాన ఒథిరిస్, ఒలింపస్ పర్వతాలలో జరిగిన సంఘటనల సమాహారం ఈ చరిత్ర. హెసియాడ్ (Hesiod) రచించిన థియోగోని (Theogony); అంధకవి థమ్రిస్ (Thamyris) కర్తగా భావించబడ్తున్న టిటానోమాఖియా (మహాకాయుల సంగ్రామం); ఆర్ఫియస్ (Orpheus) పద్యాలలో ఈ మహాకాయుల చరిత్ర, ప్రసక్తి వర్ణితమైనది.

ఇటువంటి వర్ణనలు రామాయణ మహాభారతాది ఆదికావ్యాలలో, స్కాండినేవియన్, బాబిలోనియన్, హిట్టైట్, యుగ్రాటిక్ ఇతిహాసాలలో ప్రధానమైన ఘట్టాలుగా కానవస్తాయి.

మహాకాయులలో పిన్నవయస్కుడు క్రోనస్ (Cronus-కాలం) తన తల్లి గెయా (Gaia=earth=భూదేవి) సాయంతో తండ్రి యురేనస్ (Uranus= Heavens= ఆకాశం) పై జరిపిన యుద్ధంతో మహాకాయుల సంగ్రామం మొదలవుతుంది.

తనను ఎదిరించిన పుత్రులు శతబాహువులైన హెకటాన్‌ఖైర్స్ (Hecaton-chires) మరియు ఒంటికన్ను సైక్లాప్స్ (Cyclops) ను యురేనస్, టార్టారస్ (Tartarus) పాతాళ బిలంలో బంధించి కాపలాగా కాంపె (Campe) మహాసర్పాన్ని ఉంచగా ఆగ్రహం చెందిన గైయా ఒక ఘనమైన, శక్తివంతమైన స్ఫటికపు కొడవలి (Sickel) ని సృష్టించి తన కుమారులకిచ్చి తండ్రిని వంధ్యుడిగా చేయమని కోరుతుంది. కనిష్ఠుడు క్రోనస్ ఒక్కడే దానికి అంగీకరించగా తల్లి అతడికి ఆ ఆయుధాన్నిచ్చి అదనుకోసం వేచియుండగా, ఒకనాడు యురేనస్, గైయాతో సమాగానికి వచ్చినప్పుడు, క్రోనాస్ ఆతనిపై లంఘించి పదునైన కొడవలితో తండ్రి వృషణ విచ్ఛేదన చేసి వాటిని సముద్రంలో పారవేస్తాడు. ఆ సమయంలో నేలపైకి చిందిన రక్తం నుంచి జైగాంటెస్, ఎరినిస్, మెలియే; సముద్రంలో పడిన జననేంద్రియాల నుంచి ఎఫ్రొడైట్ జన్మిస్తారు.

తండ్రిని అలా సింహాసనం నుంచి తొలగదోసి తానే అధినాయకుడైనా క్రోనస్ (Cronus)కు తన పుత్రులు తనకు కూడ తనలానే కీడు చేయగలరన్న అనుమానం కలిగింది. సంప్రదాయం ప్రకారం సోదరి రియా (Rhea)ను వివాహమాడి

తద్వారా కలిగిన సంతానాన్ని వెనువెంటనే మింగివేయసాగాడు. హెస్టియా, హేడ్స్, డిమిటర్, పాజిడాన్, హెరా దేవతలను క్రోనస్ పుట్టీపుట్టగానే మింగివేసాడు. జ్యూస్ (Zeus) గర్భంలో ఉన్నప్పుడు రియాదేవత, తన తల్లిదండ్రులు యురేనస్, గైయాలిచ్చిన సలహా పాటించి జ్యూస్ పుట్టగానే అతనిని క్రెటె ద్వీపంలోని ఇడా (Ida) పర్వత గుహలో దాచి వస్త్రంలో చుట్టిన రాతిబొమ్మను తన బిడ్డగా క్రోనస్‌కు ఇచ్చింది. అతడు క్షణం సంకోచించకుండా దానిని మింగివేసి సంతుష్టుడైనాడు. ఆ శిల బొడ్రాయి (Omphalous stone) (బొడ్రాయి)గా ప్రసిద్ధికెక్కింది.

జ్యూస్ క్రెటె ద్వీప గుహలలో ఎడమాంథియా అప్సరస పెంపకంలో, అమాల్థియా గొర్రెపాలు త్రాగుతూ, కౌరెటెస్ (Kouretes) నర్తకుల పర్యవేక్షణలో క్రొనాస్ కంటపడకుండా దినదినాభివృద్ధి చెందసాగినాడు. యుక్తవయస్సుకు రాగానే తన సహచరి మెటిస్ (Metis) ఇచ్చిన వమన కషాయాన్ని తండ్రి కోనస్‌తో త్రాగించాడు. క్రొనాస్‌కు వాంతులై వరుసగా ముందుగా బొడ్రాయి, హెరా, పాజిడాన్, డిమిటర్, హేడ్స్, హెస్టియా, ఒంటికన్ను సైక్లాప్స్, శతబాహువుల హెకటాన్ ఖైర్‌లు ఒకరొకరుగా బయటపడ్డారు.

జ్యూస్ తన సోదరీ సోదరులు, జైగాంటెస్, హెకటాన్ ఖైర్‌లు, సైక్లాప్స్‌ల సాయంతో తండ్రి క్రోనాస్‌పై యుద్ధాన్ని ప్రకటించాడు. సైక్లాప్స్ కృతజ్ఞతతో జ్యూస్‌కు పిడుగుల్ని ఆయుధాలుగా సమర్పించినారు. ఇది రెండవ దేవాసుర యుద్ధం.

దైత్యులు (Titans)........................పంద్రెండుగురు

| | |
|---|---|
| 1. సముద్రాధీశుడు (Oceanus); | 2. టెథిస్ (Tethys); |
| 3. హైపరియాన్ (Hyperion) | 4. థెయియా (Theia) |
| 5. కోయియస్ (Coeus) | 6. ఫొయిబె (Phoebe) |
| 7. క్రోనస్ (Cronus) | 8. రియా (Rhea) |
| 9. నెమొసినె (Mnemosyne) | 10. థెమిస్ (Themis) |
| 11. క్రియస్ (Crius) | 12. లాపిటస్ (Lapetus) |

ఓసియానస్ సముద్రాధీశుని కుమారులు – ఓసినీడ్లు, పొటామాయి

హైపరియాన్ పుత్రులు – ఇవాస్ (Eos); హెలియాస్ (Helios); సెలెనె (Selene)

కొయిస్ కుమార్తెలు – లెటొ (Leto); ఏస్టెరియా (Asteria)

లాపిటస్ పుత్రులు – అట్లాస్ (Atlas); ప్రొమెథియస్ (Prometheus) ఎపిమెథియస్ (Epimetheus); మెనొఒషస్ (Menoetius)

క్రియస్ కుమారులు – ఎస్ట్రేయస్ (Astraeus); పల్లాస్ (Pallas); పెర్సియస్ (Perseus).

## గ్రీకు దేవుళ్లు (పురుషులు)

1) యురేనస్ (Uranus) (ఆకాశదేవత) – గ్రీకు దేవతలలో ఆద్యుడు, భూభర్త

2) ఓసియేనస్ (Oceanus) (సముద్రుడు) – యురేనస్ పుత్రుడు; టెథిస్ భర్త; స్టిక్స్, రోడెల తండ్రి.

3) కోయియిస్ (Coeus) (ఊర్ధ్వలోకపు ఇరుసు అధిదేవత) – ఫొబె భర్త; లెటొ, ఏస్టిరియాల తండ్రి.

4) క్రియస్ (Crius) (దక్షిణాధిపతి) – యురెబియా భర్త; పెర్సెస్, పల్లాస్, ఆస్ట్రెయాల తండ్రి

5) పెర్సియస్ (Perseus) (విధ్వంసాధిపతి) – ఏస్టరియా భర్త; హెకాటె తండ్రి

6) పల్లాస్ (Pallas) (యుద్ధతంత్రాధిదేవత)

7) ఏస్టరియోస్ (Asterios) (నక్షత్రదేవత) – క్రియస్, యురెబియాల కుమారుడు, ఈతని భార్య – ఇవాస్ (Eos); పిల్లలు – ఇనాస్థరస్ (వీనస్); నోటస్ (పడమటి గాలి); జెఫిరస్ (దక్షిణపు గాలి); యూరస్ (తూర్పుగాలి), ఫీటన్ (జూపిటర్–బృహస్పతి); స్టిల్బాన్ (మెర్క్యురి); ఫైనాన్ (శాటరన్); పైరోయిస్ (మార్స్); బోరియాస్ (ఉత్తరపుగాలి);

8) హైపరియాన్ (Hyperion) (కాంతిదేవత); థియా భర్త; సెలెనె, హెలియాస్, ఇవాస్‌ల తండ్రి.

9) హెలియాస్ (Helios) (సూర్యుడు) – రోడె భర్త; సిర్సెమంత్రగత్తె; లాంపెటియా, ఎసిఫెల తండ్రి.

10) లాపెటస్ (Lapetos) (మనువు)– అప్సరస సిల్మెనె భర్త; మానవ తెగకు, అట్లాస్, ప్రొమెథియస్, ఎపిమెథియస్, మొనొయిషస్‌ల పూర్వీకుడు.

11) అట్లాస్ (Atlas) (సహనదేవుడు); ఎత్రా భర్త; ప్లీయడిస్, మైయా, హ్యాస్; హ్యాడ్స్, హెస్మరైడ్స్, హెస్పెరస్‌ల జనకుడు.

12) ప్రొమెథియస్ (Prometheus) (అగ్నిదేవత; ముందుచూపునిచ్చేవాడు) – మానవ తెగ సృష్టికర్త.

13) ఎపిమెథియస్ (Epimetheus) (పర్యవసాన ఆలోచనాధిదేవత) – పండోరా భర్త

14) మెనాయిషస్ (Menoiteus) (తీవ్రాగ్రహానికి, ఆలోచనారహిత క్రియకు అధిదేవత)

15) లెలాంటస్ (Lelantus) (వాయుదేవత)

16) మెలిస్సెస్ (Mellissus) (మధువు/తేనె దేవత)

17) ఒలెంబ్రాస్ (Olembros) (జ్యూస్, చిన్ననాటి గురువు) – తరువాత పరిణామాల్లో జ్యూస్ చేతిలో మరణిస్తాడు.

18) టైటాన్ (Titan) (జ్యోతిషాధిదేవత) – మానవ తెగకు ఉపాధ్యాయుడు.

19) ఓఫియాన్ (Ophion) (గైయా, యురేనస్‌ల ప్రథమ సంతానం)

## గ్రీకు దేవుళ్లు (స్త్రీ)

1) గైయా (Gaia) – టైటాన్ల తల్లి; భూమాత

2) టెధిస్ (Tethys) – ఓసియేనస్ భార్య; యురేనస్ కుమార్తె

3) స్టిక్స్ (Styx) – పల్లాస్ భార్య; నది (తనలో స్నానమాచరించిన వాళ్లకు అమరత్వాన్నిచ్చే నది)

4) రోడె (Rhode) – హెలియాస్ భార్య

5) ఫొబె (Phoebe) – కొయియిస్ భార్య; యురేనస్ కుమార్తె

6) ఎస్టరియా (Asteria) – జ్యోతిషాధిదేవత; పెర్సెస్ భార్య.

7) లెటొ (Leto) – అనంగదేవత; జ్యూస్ వల్ల ఆర్టెమిస్, అపోలోల తల్లి.

8) సెలెన్ (Selene) – చందమామ

9) ఇవస్ (Eos) – అరుణదేవత – ఎస్ట్రయోస్ భార్య

10) మెటిస్ (Metis) – జ్ఞానదేవత – హైపరియాన్ భార్య

11) నెమొసినె (Mnemosyne) – జ్ఞాపక అధిదేవత – మ్యూజ్‌ల తల్లి

12) థెయా (Theia) – దృష్టిదేవత – హైపరియాన్ భార్య

13) థెమిస్ (Themis) – న్యాయాధిపతి, విధి, కాల, టైఖె, నెమొసిస్‌ల మాత

14) డయోనె (Dione) – జోస్యదేవత – డెల్ఫిప్రాంతవాసి

15) యురెనోమె (Eurynome) – ఒఫియాన్ భార్య; ఘడియల, గంటల తల్లి

16) రియా (Rhea) – క్రోనస్ భార్య; ఆరుగురు ఒలింపియన్ల తల్లి

17) హెకాటె (Hecate) – మాయమంత్రాధిదేవత; పెర్సియస్ తల్లి.

## థియోగొని - Theogony (దేవతల జననం)

హెసియాడ్ (Hesiod) క్రీస్తుపూర్వ 700 సంవత్సరాల నాడు రచించిన మహాకావ్యమిది.

సకల కళాధిదేవతలైన ముగ్గురు మ్యూజెస్ - (Muses) లు ప్రత్యక్షమై రాజులకు ప్రసాదించే రాజదండాన్ని, ఆజ్ఞాస్వరాన్ని తనకివ్వగా తాను కవిరాజుగా ఈ వృత్తాంతాన్ని కావ్యంగా మలిచానని హెసియాడ్ తన ముందుమాటగా ప్రస్తావిస్తాడు.

### మొదటి తరం :

అక్కడ శూన్యాన్ని ఆవరించిన గందరగోళపరిస్థితి (Chaos) ఉన్నది. దానినుండి ఎరాస్ (Eros), గైయా (Earth) జనించినారు. తరువాత పాతాళలోకం (Tartarus), కోరిక (Desire) పుట్టెను, ఆ అపసవ్య స్థితి నుంచి (Chaos) పుట్టిన ఎరిబాస్ (చీకటి), నిక్స్ (Nyx–రాత్రి) సమాగమించగా ఈథర్ (Aither) – ప్రకాశము; హెమెరా (Hemera–పగలు) ఉద్భవించినవి. భూమి నుంచి ఆకాశం Ouranous= Uranus=Sky); పర్వతాలు (Ourea-Mountains) సముద్రం (Pontus=Sea) రూపందు కున్నవి.

భూమ్యాకాశాల (Gaia=Uranus) కలయిక వల్ల పంద్రెండుగురు టైటాన్లుగా పిలువబడే దైత్యులు ఉద్భవించినారు. వారు

1) ఓసెనాస్ 2) కోయస్ 3) క్రియస్ 4) హైపరియాన్
5) లాపెటాస్ 6) థెయియా 7) రియా 8) థెమిస్
9) నెమొసినె 10) ఫొబె 11) టెథిస్ 12) క్రోనాస్

ముగ్గురు ఒంటికన్ను సైక్లాప్స్
1) బ్రొంటెస్ (Brontes), 2) స్టెరోప్స్ (Steropes) 3) ఆర్గెస్ (Arges)

ముగ్గురు శతబాహులు – వంద చేతుల హెకటాన్‌ఖైర్‌లు (Hecatonchires)
1) కొట్టోస్ (Kottos), 2) బ్రయారియాస్ (Briareos), 3) గైగ్స్ (Gyges)

వీరంతా స్వర్ణయుగపు మొదటి తరం దేవతలు.

### రెండవ తరం :

తన పిల్లల అల్లరికి విసిగిన యురేనస్, వారిని (హెకటాన్‌ఖైర్స్, సైక్లాప్స్)

టార్టారస్ పాతాళగృహంలో బంధించి కాపలాగా కాంపె (Campe) మహాసర్పాన్ని నియమిస్తాడు. దానికి ఆగ్రహం చెందిన గైయా తన కుమారుల సాయం కోరగా, ముందుకు వచ్చిన క్రోనాస్‌కు మహాశక్తివంతమైన కొడవలినిస్తుంది. రాత్రి తల్లి పొందుకై వచ్చిన తండ్రి వృషణాలను కోసి వాటిని సముద్రంలో పడవేస్తాడు క్రోనాస్. నేలపై చిందిన రక్తం నుంచి ఎరినైస్ (Erinyes-The furies); జెయింట్స్ (Giants); మొలియె (Moliai), సముద్రంలో పడిన వృషణాల నుంచి వెలువడిన శుక్లపు నురగ నుంచి ఎఫ్రొడైట్ (ప్రేమదేవత) ఉద్భవించారు.

చీకటి, రాత్రి (Erebos-Nyx) కలయికలో పుట్టినవారు–

1) మొరాస్ - (Moros= Doom–విషాదం)
2) స్వప్నాలు (Oneiro=Dreams)
3) గమ్యం (Ker, Keres - destinies)
4) మోసం (Apate=Deceit)
5) నింద (Momos=Blame)
6) ప్రేమ (Philotes=Love)
7) వృద్ధాప్యం (Geras=Old age)
8) మృత్యువు (Thanatos=Death)
9) మొయిరాయి (Moirai=Fates – అదృష్టదేవతలు)
10) నెమెసిస్ (Nemesis = Retribution)
11) రాత్రి పుత్రికలు (Hesperides = Daughters of Night)
12) నిద్ర (Hypnos - Sleep)
13) కష్టాలు (Oizys = Hardship)
14) విరోధం (Eris=Descord)

ఎరిస్ (Eris) = విరోధం = Discord) నుంచి

1) బాధ (Ponos=Pain) 2) యుద్ధాలు Hysmine=Battles);
3) తగవులు (Neikeria=Quarrels); 4) హత్యలు (Phonoi=Murders)
5) మైకం (Lethe=obivion); 6) పోట్లాట (Makhai=fight)
7) అబద్ధాలు (Pseudologos=lies);
8) తగాదాలు (Amphilogia=Disputes)
9) కరవు (Limos=Famine);
10) మూకుమ్మడి హత్యలు (Androktasia=Manslaughters)
11) వినాశనం (Ate-ruin) 12) అరాచకం (Dysnomia=anarchy)

13) వ్యాధులు (Algea=illness); 14) ప్రమాణాలు (Horkos=oaths)
15) కట్టుకథలు (logoi-stories).... జనించినాయి.

యురేనస్ వృషణ విచ్ఛేదానంతరం భూమి (Gaia) పొంటాస్ (సముద్రం)తో కలవగా అనేకులు సముద్ర దేవతలుద్భవించినారు. వారిలో ముఖ్యులు...

1) నెరియస్ (Nereus=old man of the sea) = ఈతడు ఓసియానస్, టెథిస్‌ల కుమార్తె డోరిస్ (Doris)ను పెండ్లియాడగా వీరికి యాభైమంది సముద్ర కన్యలు (Nereids) జన్మించినారు.

2) థౌమాస్ (Thaumas) – డోరిస్ సోదరి ఎలక్ట్రాను (Electra) పరిణయమాడగా వారికి ఇంద్రధనుస్సు (Iris=Rainbow), ముగ్గురు హార్పిస్ (Harpies) సంతానంగా కలిగినారు.

3) ఫోర్కైస్, కెటోలు కవలలు. వారి కలయికలో గ్రెయె (graiae), గోర్గాన్లు (Gorgons); ఎఖిడ్నా (Echidna); ఓఫియాన్ (Ophion)లు జనించినారు.

గొర్గాన్లలో ఒకరైన మెడుసా (Medusa) పొజిడాన్ (Poseidon) తో కలవగా పెగాసెస్ రెక్కలగుర్రం (Winged horse-pegasus); మహాకాయుడు క్రిసావర్ (Chrysaor) జన్మించారు. క్రిసావర్, కాల్లిర్‌హోల సంతానం – మూడు తలల గెర్యాన్ (Geryon).

- గైయా – టార్టారస్‌ల సంతానం టైఫోయిస్ (Typhoeus).
- టైఫోయిస్, ఎఖిడ్నాలు పెళ్లాడగా వారికి ఆర్థాస్ (Orthos), కెర్బెరాస్ (Kerberos); హైడ్రా (Hydra); కిమెరా (Chimera)లు పుట్టినారు.
- ఆర్థాస్, కిమెరా లేక ఎఖిడ్నాల కలయికలో స్ఫింక్స్ (Sphynx); నిమియన్ సింహం (Nemean lion) లు జనించినారు.
- టైటాన్లయిన ఓసెనాస్, టెథిస్‌ల ప్రణయఫలంగా మూడువేల నదులు, త్రిసహస్ర అప్సరసలు (Oceanid nymphs) జన్మించారు.
- థైయా, హైపరియాన్లకు 1) హెలియాస్ (Sun=సూర్యుడు), 2) సెలెనె Moon=చంద్రుడు), 3) ఇవస్ (Eos=dawn–సంధ్య).
- ఇవస్, ఏస్ట్రయిస్‌లకు 1) జెఫిరాస్, 2) బొరియాస్ 3) నోటోస్, 4) ఇస్ఫరాస్ 5) హెస్పెరాస్ 6) ఫాస్ఫరాస్, 7) అసంఖ్యాక నక్షత్రాలు (ఫీనాన్, ఫీథాన్, పైరోయిస్, స్టిల్బాన్) కలిగినారు.
- పల్లాస్, స్టిక్స్‌లకు – 1) తెగువ (Zelos-zeal), 2) విజయం (Nike=Victory)

3) బలం (Cratos=Strength), 4) శక్తి (Bia=force)

- కోయిస్, ఫొబెలకు లెటొ, ఏస్టరియాలు
- ఏస్టరియా, పెర్సెస్‌లకు హెకాటె (Hecate)
- లాపెటాస్, క్లైమెన్ అప్సరసల సంతానంగా అట్లాస్, మెనొయిషస్, ప్రొమెథియస్, ఎపిమెథియస్‌లు జన్మించినారు.

## మూడవతరం :

క్రోనాస్ విశ్వంపై తన ఆధిపత్యాన్ని స్థిరపరుచుకోగానే తల్లిదండ్రులైన భూమ్యాకాశ దేవతలు (Gaia+Uranos) నీకూ తమకు పట్టిన గతే పుత్రుల వల్ల కలుగుతుందని హెచ్చరించినారు. రియాదేవతను పరిణయమాడిన క్రోనాస్ ముందు జాగ్రత్తగా తన సంతానాన్ని తానే మింగివేయసాగాడు. హెస్టియా, డిమేటర్, హెరా, హేడ్స్, పొజిడాన్లను కబళించడం చూసిన రియా తమ తల్లిదండ్రుల సలహా పాటించి జ్యూస్‌ను ప్రసవించాక అతని స్థానంలో వస్త్రాలతో ఓ రాతిని చుట్టి క్రోనాస్‌కు అప్పగించగా అతడు దానిని యథావిధిగా మింగేసాడు. క్రెటెలోని ఇడా పర్వతపు కొండగుహలలో దాచిన 'జ్యూస్' (Zeus)ను క్రోనాస్ కంటపడనీకుండా, భూమ్యాకాశాల సరిహద్దునున్న మహావృక్షపు చివర్లలో ఉంచి రక్షణగా సదా సందడిగా ఉండే కౌరెటెస్ నర్తకులను నియమించింది – రియా (Rhea).

జ్యూస్ దినదిన ప్రవర్ధమానుడై, మెటిస్ దేవత ఇచ్చిన కషాయాన్ని క్రోనస్‌తో తాగించగా కడుపు నుండి అంతకుముందు మింగబడ్డ సోదరులు బయటపడ్డారు.

- టైటాన్లు, జయంట్లు ఒక పక్షంగా (Titans & Giants) ఒలంపిక్ దేవతలు, సైక్లాప్స్, ఎపిమెథియస్, ప్రొమెథియస్‌లు మరో పక్షంగా, (ఓసెనాస్ ఒక్కడు తటస్థంగా ఉండగా) పదేళ్లపాటు విశ్వాధిపత్యానికి భీకర పోరాటాలు సాగినవి.
- శతబాహువులైన హెకటాన్ ఖైర్‌లను, ఒంటికన్ను సైక్లాప్స్‌ను తన పక్షాన నిలిపి, వారు తన కొసగిన పిడుగు (Thenderbolts) ఆయుధాలతో భూమ్యాకాశాలను దద్దరిల్లజేసి జ్యూస్ శతృపక్షాన్ని పాతాళలోకానికి పారదోలినాడు.
- టైటాన్లు ఓడిపోయినందుకు కోపించిన గైయా (భూమి) – గైయా, టార్టారస్‌ల పుత్రుడైన టైఫోయిస్ (Typhoeus)ను జ్యూస్‌పైకి ఉసికొల్పగా అతడినీ ఓడించి జ్యూస్ కీర్తి పొందినాడు.
- తనకు సాయం చేసినందుకు గాను ప్రొమెథియస్‌ను పాతాళవాసం నుంచి తప్పించినా, మానవులకు అగ్నిని అందించినందుకు శిక్షగా ప్రొమెథియస్‌ను

కొండకొమ్ముకు శృంఖలాబద్ధుని గావించి,భయంకరమైన గ్రద్ద, అతని కాలేయాన్ని ప్రతిరోజూ తినేలా శిక్ష విధిస్తాడు జ్యూస్ దేవనాథుడు. చివరకు హెరాక్లిస్ సాహసం వల్ల ప్రొమెథియస్ విముక్తుడవుతాడు.

- జ్యూస్ మనసుబడ్డ థెటిస్ అనే సాగర అప్సరస కన్యకు కలిగే కుమారుడు తన తండ్రికన్నా గొప్పవాడవుతాడని గ్రహించిన జ్యూస్ దేవనాధుడు ఆమెను పెలియస్ (Peleus)కు ఇచ్చి పెళ్లిచేయగా వారికి ఎఖిల్లిస్ జన్మిస్తాడు.

- థెటిస్, పెలియస్‌ల వివాహానికి పిలవకుండా హాజరైన ఎరిస్ (Eris) తనను ఆహ్వానించనందుకు ఆగ్రహించి ఒక బంగారు ఆపిల్ పండుపై (For the fairest) 'అందరికంటే అందాలరాశికి ఈ బహుమతి' – అని వ్రాసి ముగ్గురు దేవతలు (హెరా, ఎఫ్రొడైట్, ఎథెనా)ల మధ్యకు విసిరి ఆ ముగ్గుర్ని అందాలపోటీ ముగ్గులోకి దింపుతుంది. వాళ్లు జ్యూస్ దేవుణ్ణి మధ్యవర్తిగా ఉండమంటే, తప్పించుకోవడానికి అతడు... ట్రోజన్ రాకుమారుడు పారిస్ తగిన వాడని చెప్పి వాళ్లను అతని దగ్గరకు పంపుతాడు.

  ముగ్గురు దేవతలు పారిస్‌కు తమ అందాలతోపాటు ఆశలనూ విరజిమ్మినా, పారిస్ – తనకు భూలోకంలోని అందాల రాశిని తన వశం చేస్తానన్న ఎఫ్రొడైట్ వాగ్దానానికి లోబడి – ఆమెను మిక్కిలి సౌందర్యవతిగా నిర్ణయిస్తాడు.

- ప్రొమెథియస్ మానవులకు అనుకూలంగా, దేవతలకు వ్యతిరేకంగా చేసిన మరోనిర్ణయం – బలుల్లో, హవిస్సులలో మాంసభాగాన్ని మానవులకు, చర్మాన్ని, ఎముకలను అగ్నిలో వేల్చి దేవతల భాగంగా సమర్పించే విధి విధానాల్ని నిర్దేశించడం.

- అందుకు ప్రతీకారంగా జ్యూస్ దేవుడు... విశ్వకర్మ–హెఫెస్టాస్, ఎథెనాల సాయంతో పండోరా (Pandora) అనే స్త్రీని సృష్టించి ఆమె చేతికి ఒక బంగారు పేటికనిచ్చి దారిలో తెరవవద్దని నియమాల నేర్పరచి ఆమెను భూలోకానికి పంపుతాడు. కుతూహలంతో ఆమె మార్గమధ్యంలో పేటిక మూతను తెరవగానే 'వ్యాధులు, మృత్యువు' బయల్పడగా, పండోరా వెంటనే పేటికను మూసివేస్తుంది. పెట్టెలో మిగిలిన 'ఆశ' ప్రొమెథియస్ వచ్చి మూత తెరచిన అనంతరం బయటకు వస్తుంది. ఈ 'ఆశ'తోనే మానవులు జీవనం గడుపుతుంటారు.

- జ్యూస్ దేవుడు ఏడుగురు దేవతలను వివాహమాడ్తాడు. మొదటిగా సముద్ర దేవత మెటిస్ (Metis)ను పరిణయమాడినా వచ్చే సంతానం తన అడుగుజాడలలో నడిచి తనకే ఎసరు పెడ్తారని భయపడి మెటిస్‌ను

మింగివేస్తాడు. ఆమె శక్తితో జనించిన 'ఎథెనా' తన సహజ శిరస్త్రాణం, ఆయుధాలతో జ్యూస్ దేవుని తలలో పెరిగి, శిరోభారాన్ని తీవ్రంగా కలిగించగా – జ్యూస్ తలబద్దలై ఎథెనా బయట పడ్తుంది.

– జ్యూస్ రెండవ భార్య థెమిస్ (Themis) – ఆమె సంతానం

- మూడు జాములు (Horae=Hours) –
  1) యునోమియా (Eunomia= order)
  2) డైక్ (Dike=Justice),
  3) ఎయిరినె (Eirene=peace)

- ముగ్గురు మొయిరాయి (Moirae=fates)
  1) క్లాతో Clotho=Spinner)
  2) లాఖిసిస్ (Lachesis=Allotter)
  3) ఎట్రొపాస్ (Atropos = unturned)

- టైఖె (Tyche)

– జ్యూస్ మూడవ భార్య – యూరినోమ్ (Eurynome)
ఆమె సంతానం ముగ్గ ఛారైట్లు (Charites=Graces)

– జ్యూస్ నాల్గవ భార్య డిమిటర్ (Demeter); ఈమె కుమార్తె పెర్సెఫోన్ (Persephone). పెర్సెఫోన్, హేడ్స్ దేవుని సంతానం మెలెనొ (Melenoe) – భూతాధిదేవత; జాగ్రియస్ (Zagreus) వింత ఘటనల దేవత; మకారియా (Macaria-మరణానంతర జీవనాధిదేవత)

– జ్యూస్ ఐదవ భార్య నెమొసినె (Mnemosine) – ఆమె సంతానం నవ మ్యూజ్‌లు (Nine Muses) 1) క్లియొ 2) యుటెర్పె, 3) థాలియా, 4) మెల్పొమెనె, 5) టెర్ప్సిఖోర్, 6) ఎరాటొ, 7) పాలిమ్నియా 8) యురామ్నియా 9) కాలియోపె

– జ్యూస్ ఆరవ భార్య – లెటొ (Leto). ఆమె సంతానం అపోలో (Apollo), మరియు ఆర్టెమిస్ (Artemis).

– జ్యూస్ ఏడవ భార్య – దేవతలరాణి – హెరా (Hera). ఈమె సంతానం – హెబె (Hebe); ఏర్స్ (Ares), ఎన్యో (Enyo), హెఫాస్టియాస్ (Hephastios), ఈలిథెయియా (Eileithyia).

– జ్యూస్ అక్రమ సంతానం :

సెమెలె (Semele) ద్వారా డయోనెసెస్ (Dionysus); ఆల్కెమెనె (Alkamene); ఆల్కమెనె, హెబెల సంతానం హెరాక్లిస్.

పాజిడాన్ (Poseidon), ఎంఫిట్రైట్ (Amphitrite) ల సంతానం ట్రిటాన్ (Triton).

ఏర్స్, ఎఫ్రొడైట్‌ల పిల్లలు

1) భయం (Phobos=Fear)

2) పిరికితనం (Deimos-Cowardice)

3) హార్మోనియా (Harmonia=Harmonia). హార్మోనియా, కాడ్మస్‌ల సంతానం ఇనో (ino) సముద్రదేవత;

4) సెమెలె (Semele) – డయొనెసెస్ తల్లి

5) అక్వా (Aquac)– ఏక్టయాన్ మాతృమూర్తి.

6) పాలిడోరస్ (Polydorus)

7) ఆటోనో (Autonoe)

హెలియాస్ (Helios), పెర్సిస్‌ల కుమార్తె కిర్కె=సిర్సె (Circe) మంత్రగత్తె.

సిర్సె, పాజిడాన్‌ల సంతానం ఫౌనాస్ (Phaunos) – అరణ్యదేవత.

సిర్సె, డయొనెసెస్‌ల కలయిక వలన కోమోస్ (Comos – పండగల దేవత)

సిర్సె, ఒడెసిస్‌ల సంతానం – ఎగ్రియస్ (Agrius)

ఒడెసిస్, కాలిప్సోల సంతానం – టెలిగోనస్, టెలిడోమస్, లాటినస్, నాసిథూస్, నాసినస్ (Telegonus, Teledomus, Latinus, Nosithoos, Nasianouss)

## <u>(Gigantomachy)</u>

(Greek-Giagas=giants = మహాకాయులు; Makhe=Battle=యుద్ధం)

జ్యూస్ (Zeus) ఒలింపస్ దేవతలపక్షాన, ఆల్సియోనియస్ (Alcyoneus), కేయాస్ (Chaos)లు మహాకాయుల పక్షాన నాయకత్వం వహించగా దేవాసుర సంగ్రామం మొదలైంది.

హెరా జోస్యం ప్రకారం మానవమాత్రుడైన హెరాక్లిస్ సాయంతోనే దేవతల విజయం సాధ్యపడుతుందని గ్రహించిన దేవతలు మానవస్త్రీ కుమారుడైన హెరాక్లిస్ సాయాన్ని అంగీకరిస్తారు.

అల్సియోనియస్‌ను అతని [redacted] ఓడించడం కుదరని తెలుసుకున్న హెరాక్లిస్ అతనిని పల్లెనె (Pallene) సరిహద్దులు దాటించి అక్కడ చంపివేస్తాడు. అంతటితో దేవాసుర సంగ్రామం ముగియగా, జ్యూస్ దేవతలకు మానవులకు

# 2. ఇడిపస్ చరిత్ర
## (Oedipus - Epic Cycle-2)

థెబెస్ నగరాన్ని పరిపాలిస్తున్న లెయస్ (Laius) రాజు, జొకాస్టా (Jocasta) రాణిల సంతానం ఇడిపస్ (Oedipus). సంతానార్థులై డెల్ఫిలోని అపోలో దేవాలయంలో దేవవాక్యాన్ని (Oracle) అర్థించగా భవిష్యవాణి వారికి కలిగే కుమారుడు పెద్దవాడై తండ్రిని చంపి తల్లిని పెళ్లాడుతాడని జోస్యం చెబుతుంది.

కొడుకు పుట్టగానే లెయస్ రాజు, పసివాడి మడమలను లోహపు తీగలతో బంధించి పర్వతాలపై పడవేయమని భటుడికిచ్చి పంపుతాడు. జాలిపడ్డ భటుడు బాలుణ్ణి కోరింథ్‌కు చెందిన గొర్రెల కాపరికివ్వగా చేతులు మారి ఆ బాలుడు మరో గొర్రెలకాపరి పాలిబస్ ఇంట పెరుగుతాడు. ఇనుప గొలుసుల వత్తిడికి పాదాలు ఉబ్బడం వల్ల అతడ్ని ఇడిపస్ (ఉబ్బపాదాలవాడు) అని ప్రజలు పిలిచేవారు.

చానా ఏళ్లు గడిచాయి. ఒకరోజు ఓ తాగుబోతు హేళనగా "నీ తండ్రి పాలిబస్ (Polybus) కాదు. నీవు వాళ్లకు పెంపుడు బిడ్డవి" అని వాగుతాడు. అతని తల్లిదండ్రులు దానిని ఖండించినా అనుమానం తీరక అతడు డెల్ఫిలోని అపోలో దేవాలయంలోనే భవిష్యవాణిని నిజం తెలపమని ప్రార్థిస్తాడు. భవిష్యవాణి తల్లిదండ్రుల పేరుచెప్పదు కాని ఆతడి జాతకంలో తండ్రిని చంపి తల్లిని పెళ్లాడే స్థితి వస్తుందని తెలుపుతుంది. ఆ పరిస్థితిని రానీకుండా చేయడానికి కోరింథ్‌లోని పెంపుడు తల్లిదండ్రులను వదిలి థెబెస్ నగరం వేపు ప్రయాణం సాగిస్తాడు ఇడిపస్.

మార్గమధ్యంలో మూడు రహదారుల కూడలి డావిలియా (Davilia) వద్ద తారసపడ్డ రథికుడితో ఎవరు ముందు వెళ్లాలన్న విషయంపై కొట్లాట జరుగగా ఆత్మరక్షణలో ఇడిపస్ తనతో తలపడిన వ్యక్తిని చంపేస్తాడు. అది చూసిన ఏకైక సాక్షి రథికుని పరిచారకుడు సంఘటనా స్థలం నుంచి పారిపోతాడు. ఆ చనిపోయిన వ్యక్తి ఎవరో కాదు – అతడు లెయస్ (Laius) రాజు – ఇడిపస్‌కు జన్మనిచ్చిన తండ్రి – అలా జోస్యంలో మొదటిభాగం పూర్తవుతుంది.

థెబెస్‌కు వెళ్లేదారిలో ఒక విచిత్ర మృగం – స్ఫింక్స్ (Sphinx) దారినపోయే వాళ్లను ఆపి ఓ చిక్కుప్రశ్న వేసేది. సమాధానం చెప్పలేనివాళ్లని చంపి తినేసేది. ఆ ప్రశ్న ఏమిటంటే "ఏది ఉదయాన నాలుగుకాళ్లతో, మధ్యాహ్నం రెండుకాళ్లతో, సాయంకాలం మూడుకాళ్లతో నడుస్తుంది, చెప్పు?" ఇడిపస్ సరైన సమాధానం ఇచ్చాడు "మనిషి – పసిపాపగా నాలుగు కాళ్లతో, తరువాత రెండు కాళ్లతో, వృద్ధాప్యాన మూడుకాళ్లతో చేతికర్ర ఊతంతో నడుస్తాడు" ఆ మాట వినగానే స్ఫింక్స్ సముద్రంలో పడి చచ్చిపోయింది.

థెబెస్ ప్రజల పీడ విరగడయ్యింది. రాజులేక అరాచకం ఉన్న థెబెస్ ప్రజలు ఇడిపస్‌ను రాజుగా ఎన్నుకొన్నారు. అతనికి కానుకగా జోకాస్టా రాణినిచ్చి వివాహం చేసారు. వారికి నలుగురు పిల్లలు కలిగారు. ఇద్దరు మగపిల్లలు – ఎటియోక్లిస్ (Eteocles), పాలినైసెస్ (Polynices); ఇద్దరు ఆడపిల్లలు – ఏంటిగొనె (Antigone); ఇస్మెనె (Ismene).

అలా కొన్నేళ్లు గడిచాయి. అకస్మాత్తుగా థెబెస్ నగరానికి ఓ అంతుపట్టని పీడ దాపురించింది. పంటలు గింజలు నివ్వవు. స్త్రీలు వంధ్యలుగా మిగిలిపోతున్నారు. ఇడిపస్ ఈ పరిస్థితిని చక్కదిద్దుతానని ప్రజలకు మాటిచ్చి లెయస్ సోదరుడు క్రియాన్ (Creon)ను డెల్ఫిలోని అపోలో దేవాలయానికి పంపుతాడు. తిరిగివచ్చిన క్రియాన్ లెయస్ హంతకుడ్ని పట్టి దేశ బహిష్కారం గాని, మరణదండన విధిస్తేనే గాని ఈ పీడ తొలగదని తెలుపుతాడు. హంతకుడి జాడ తెలుసుకోడానికి అంధుడైన ప్రవక్త టిరెసియాస్ (Tiresias) సాయం కోరతాడు ఇడిపస్. టిరెసియాస్ ఆ విషయం తెలుసుకోరాదని ఎంత చెప్పినా వినక ఇడిపస్ తన మాటలతో ప్రవక్తకు ఆగ్రహం తెప్పిస్తాడు.

ఆతడు ఇడిపస్‌ను అసలు హంతకుడిగా పేర్కొనగా, ఇడిపస్ దానిని క్రియాన్ – టిరెసియాస్‌ల కుట్రగా భావించి వాగ్వాదానికి దిగుతాడు. ఇంతలో అటుగా వచ్చిన జోకాస్టా తన తొలి పుత్రుని జనన వృత్తాంతాన్ని తెలుపుతుంది. అతడు కొండలలో మరణించాడని చెప్పి ఇడిపస్‌ను శాంతపరుస్తుంది. అయినా తను చంపిన వ్యక్తి లెయస్ రాజుగా అనుమానపడి ఇడిపస్ వ్యాకుల మనస్కుడవుతాడు. ఇంతలో కోరింథ్ నుంచి వచ్చిన దూత ఇడిపస్ తండ్రి పాలిబస్ మరణవార్త నందిస్తాడు. దానితోపాటు ఇడిపస్ పాలిబస్ యొక్క పెంపుడు కొడుకనే నిజాన్ని వెల్లడి చేస్తాడు.

జొకాస్టా శతవిధాల ప్రయత్నిస్తుంది. ఇడిపస్‌ను లెయస్‌రాజు హంతకుడి జాడ కోసం వెదకడం ఆపమని బ్రతిమిలాడ్తుంది. బహుశా బానిస కుమారుడు భర్త అయ్యాడని అలా ప్రవర్తిస్తుందనుకుని ఇడిపస్ ఆమె మాటలను పెడచెవిన పెట్టాడు.

నిరాశతో జొకాస్టా తన మందిరానికి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. దూత మాటల్లోని నిజాన్ని మొదటి గొర్రెల కాపరి ద్వారా విన్న ఇడిపస్ తను చంపినది లెయస్‌రాజైన తన జన్మతండ్రిగా, తను సంసారం చేసి పిల్లలను కన్నది తన తల్లితోనే అని గ్రహిస్తాడు. అలా జోస్యంలోని రెండవభాగం నిజమవుతుంది.

జొకాస్టాను వెదుకుతూ వెళ్లిన ఇడిపస్ ఆమె ఉరితాడుకు వేళ్లాడుతూ మరణించి ఉండడం గమనిస్తాడు. ఆమె పతకానికున్న సూదిని తీసి తన కళ్లు పొడిచి, పెరికివేసుకుని అంధుడవుతాడు. క్రియాన్‌ను పిలిచి తన కుమార్తెల బాధ్యత అప్పగించి,

తన పిల్లలను స్పృశించి, కుమార్తె ఏంటిగొనె సాయంతో థెబెస్ ఎల్లలు దాటి ఏథెన్స్‌లో రాజు థెసియస్ (Theseus) రక్షణలో జీవించి చివరకు కొలొనస్ (Colonus)లో తనువు చాలిస్తాడు.

అతని ఇద్దరు కుమారులు ఎటియొక్లిస్, పాలినైసెస్‌లు ఒక సంవత్సరం ఒకరు, మరొకరు మరో సంవత్సరం పాలించేలా ఒప్పందానికి వస్తారు. ఒక సంవత్సరం పాలించినాక ఎటియొక్లిస్ ఒప్పుకోకపోవడంతో ఆగ్రహం చెందిన పాలినైసిస్ సైన్యాన్ని సమకూర్చుకుని యుద్ధానికి దిగుతాడు. ఆ సమరంలో ఇరువురూ మరణిస్తారు. సింహాసనాన్ని అధిష్టించిన క్రియాన్ పాలినైసిస్‌ను దేశద్రోహిగా ముద్రవేసి అతనికి అంత్యక్రియలు జరుపరాదని ఆజ్ఞాపిస్తాడు. ఎదురు తిరిగిన ఏంటిగొనెను కొండగుహలో బంధించగా ఆమె అక్కడ ఆత్మహత్యకు పాల్పడ్డుతుంది.

సొఫొక్లిస్ (Sophocles) రచించిన ఏంటిగొని (Antigone) కావ్యంలో – క్రియాన్‌కు ఎదురు తిరిగిన ఏంటిగొనెను రాతిపేటికలో ఉంచి సజీవ సమాధి గావించబోగా ఆమె ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంటుంది. ఏంటిగొనె సోదరి ఇస్‌మెనె తనను కూడ శిక్షించమని క్రియాన్‌ను అర్థిస్తుంది. టిరెసియాస్ ప్రవక్త జోక్యంతో క్రియాన్ మనసు మార్చుకుని పాలినైసెస్‌కు అంత్యక్రియలు స్వయంగా జరపడానికి వచ్చేసరికే ఏంటిగొనె చనిపోయి ఉంటుంది. ఆమెతో వివాహం నిశ్చయించబడ్డ క్రియాన్ కుమారుడు హీమన్ (Haemon) తండ్రిని చంపి తానూ చనిపోతాడు. ఆ దారుణవార్తలను విన్న క్రియాన్ భార్య 'యురెడైస్' (Eurydice) దుఃఖంతో తానూ తనువు చాలిస్తుంది.

# 3. థెబాయిస్ (Thebais)
## (Epic Cycle-3)

థెబాయిడ్ లేదా థెబాయిస్ అనే పదమూడు పరగణాలు ఎబిడోస్ (Abydos) నుంచి అశ్వన్ (Aswan) వరకు థెబెస్ (Thebes) నగరానికి చుట్టుపక్కల విస్తరించి ఉన్న ప్రాంతాలు. ప్రాచీన ఈజిప్టు దేశంలో ఇవి దక్షిణ ప్రాంతాన్ని సూచిస్తాయి.

ఈ ప్రాంతం టాలమిక్ కాలంలో (Ptolemic) ఒకే జిల్లాగా, రోమన్ పరిపాలనలో థెబెస్, టాలమిస్ భాగాలుగా పరిపాలించబడింది. క్రీస్తుశకం అయిదవ శతాబ్దంలో ఈ ఎడారి ప్రాంతం అనేకమంది క్రైస్తవ మతగురువులకు ఆశ్రయంగా ప్రసిద్ధికెక్కింది.

ఇతిహాస చక్రంలో (Epic Cycle) థెబాయిస్ (Thebais) అన్నదమ్ములైన ఎటియోక్లిస్ (Eteoclis), పాలినైసిస్‌ల మధ్య జరిగిన భీకర యుద్ధాన్ని వర్ణిస్తుంది. హోమర్ రచనగా చెప్పబడుతున్న ఈ కావ్యం శిధిలంకాగా కొద్దిభాగాలు మాత్రమే లభ్యమవుతున్నాయి.

లాటిన్ భాషలో ఈ కావ్యాన్ని పబ్లియస్ పాపినస్ స్టాటియస్ (Publius Papinius Statius - AD 45-96) తన 35వ ఏట రచించినాడు. వర్జిల్ (Virgil) రచించిన ఎయినీడ్ గ్రంథానికి (Aeneid) ధీటుగా పన్నెండు భాగాలుగా తన రచనలలో తలమానికంగా స్టాటియస్ ఈ కావ్యరచన చేసినాడు.

### కావ్య సంగ్రహం
### ఆర్గాస్ సప్తవీరులచే థెబెస్ నగరం ఆక్రమణ
### (Seven against Thebes)

అత్యంత విషాదకరమైన సంఘటనలు తన జీవితంలో పెనుమార్పును తీసుకుని రాగా తన కళ్లను తానే పొడుచుకొని అంధుడైన ఇడిపస్ తనను ఆదరించని తన కుమారులైన పాలినైసెస్ (Polyneices), ఎటియోక్లిస్ (Eteocles)లను శపిస్తాడు. అత్యంత ఆవేదనతో ఇడిపస్ పడ్తున్న మానసిక వ్యథను, అతడు తన కుమారులను దేవతల సాక్షిగా శపించిన తీరును గమనించిన టిసిఫొనె (Tisiphone) ఆగ్రహదేవత (The Fury) భూలోకానికి వచ్చి అన్నదమ్ముల మధ్య స్పర్థను రగిలిస్తుంది. అప్పటికే రాజ్యాన్ని ఒక సంవత్సరం ఒకరు, మరో సంవత్సరం మరొకరు పరిపాలించేలా ఒప్పందం చేసుకున్న అన్నదమ్ముల మధ్య వైరం మొదలవుతుంది. పాలినైసిస్ నగరం విడిచి పారిపోతాడు.

దేవతల వినోదం కోసం జ్యూస్ (జూపిటర్) దేవేంద్రుడు థెబెస్, ఆర్గాస్ నగరాల మధ్య యుద్ధాన్ని ప్రతిపాదిస్తాడు. హెరా దేవత (Hera - Juno) ఆర్గాస్‌ను

సమర్థిస్తుంది. దేవతలు పంపగా మెర్క్యురీ (Mercury) దేవుడు పాతాళలోకానికి వెళ్లి లెయస్‌ను (Laius) తీసుకొని రాగా ఆతడు ఎటియోక్లిస్‌ను తన సోదరుడిపై యుద్ధానికి దిగేలా ప్రోత్సహిస్తాడు.

ఇంతలో పాలినైసిస్ పెనుతుఫానులో చిక్కుకుని, చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు ఆర్గాస్ నగరాన్ని చేరుకుంటాడు. అక్కడ ఎడ్రాస్టస్ (Adrastus) భవనం వద్ద కాలిడాన్ (Calydon) నగర బహిష్కృతుడైన టిడియస్ (Tydeus)తో పోట్లాటకు దిగగా ఎడ్రాస్టస్ వారికి సంధి కుదిర్చి దివ్యవాణి (Oracle) ఆదేశానుసారం తన కుమార్తెలనిచ్చి వివాహం చేస్తాడు.

## రెండవ భాగం

ఆర్గియా (Argia)తో పాలినైసిస్‌కు, డీపైలె (Deipyle)తో టిడియస్‌కు జరిగిన వివాహ కార్యక్రమమంతా అంతులేని అపశకునాలతో గందరగోళమవుతుంది. దానికి కారణం ఆర్గియా ధరించిన హార్మోనియా వజ్రహారం (Harmonia Necklace) గా అందరూ భావిస్తారు. వివాహమైనాక పాలినైసిస్ తన తరపున టిడియస్‌ను తన సోదరుడైన ఎటియోక్లిస్ వద్దకు – ఒక సంవత్సరం పాలన గడిచినందున తనకు రాజ్యపాలన అప్పగించవలసిందిగా – రాయబారం పంపుతాడు.

అప్పటికే మెర్క్యురీ చొరవతో పాతాళలోకం నుంచి వచ్చిన లెయస్ (Laius) మారువేషంలో టిరెసియాస్ జ్ఞాని (Tiresias) రూపంలో ఎటియోక్లిస్ కలలో ప్రత్యక్షమై సోదరునికి రాజ్యాన్ని అప్పగించవద్దని సలహాయిస్తాడు. స్వప్నదర్శనాన్ని నమ్మిన ఎటియోక్లిస్ రాజ్యాన్ని పాలినైసిస్‌కు ఇవ్వడానికి నిరాకరించగా టిడియస్ ఆగ్రహంతో రాజును నిందిస్తూ వెనక్కు మళ్లుతాడు. మండిపడ్డ ఎటియోక్లిస్ టిడియస్‌ను చంపడానికి సైనికుల్ని పంపగా ఒక పర్వత కనుమ వద్ద జరిగిన భీకర పోరాటంలో టిడియస్ శత్రుసైనికులను అందరినీ హతమార్చి ఒక్క మెయాన్ (Maeon)ను ప్రాణాలతో వదుల్తాడు, జరిగిన సంగతిని చెప్పడానికి అన్నట్లుగా.

## మూడవ భాగం

కొన ఊపిరితో థెబెస్ నగరాన్ని చేరుకున్న మెయాన్ (Maeon) తన సహచరుల దుర్మరణాన్ని రాజుకు వివరించి, నియంతృత్వపోకడల్ని విడవమని అర్థిస్తూ, నిందిస్తూ ఆత్మహత్య చేసుకుంటాడు. జ్యూస్ (జూపిటర్) మార్స్ (Mars)ను రెండు నగరాల మధ్య యుద్ధాన్ని రగిల్చమని పంపగా, వీనస్ దేవత, మార్స్‌ను అడ్డుకుని శాంతిని ప్రతిపాదిస్తుంది. మార్స్ దేవుడు దానికంగీకరించక మానవ వీరుల మనస్సులలో మారణహోమాగ్నిని జ్వలింపచేస్తాడు.

ఎటియోక్లిస్ మాట తప్పడాన్ని నిరసిస్తూ ఎడ్రాస్టస్, పాలినైసిస్‌లు యుద్ధానికి ఆర్గీవులను సిద్ధం చేస్తారు. ఎఫిసాస్ (Aphesas) దివ్యవాణి సైతం యుద్ధ ఫలితాన్ని

హింస కలహం, మృత్యువుల కలయికగా అభివర్ణిస్తుంది. ఆర్గియా తన భర్తను యుద్ధానికి వెళ్లవద్దని వారించినా పాలినైసిస్ విజయం తమదేనని ధీమా వ్యక్తం చేస్తాడు.

## నాల్గవ భాగం

మూడేళ్లు గడిచాయి. సైనిక సమీకరణ జరిగింది. ఎడ్రాస్టస్, పాలినైసిస్‌ల ఆధ్వర్యాన ఆర్గీవులు (Argives), టిడియస్ నాయకత్వాన ఎటోలియన్లు (Aetolians), హిప్పొమెడాన్ సారథ్యంలో డొరియన్లు (Dorians), కపానియస్ కనుసన్నలలో మెస్సెనియన్లు (Messenians), ఏంఫియారస్ అదుపాజ్ఞలలో స్పార్టన్లు (Spartans), పార్థినోపెయస్ పర్యవేక్షణలో అర్కాడియన్లు (Arcadians) సమరానికి సంసిద్ధులైనారు.

థెబియన్లకు అన్నీ అపశకునాలే కనిపంచగా ఆందోళనతో టిరెసియాస్, ఎటియోక్లిస్, మాంటోలు దయానా ఉద్యానవనంలో క్షుద్రపూజలు నిర్వహిస్తారు. మాంటో, టిరెసియాస్‌లకు స్వప్న దర్శనమిచ్చిన లెయాస్ ఆత్మ థెబెస్‌ను విజయం వరిస్తుంది కాని అనేక ఉత్పాతాలూ, మరణాలు సంభవిస్తాయని చెబుతుంది.

ఆర్గీవులు ఎలిస్సాస్ (Elissos) నదీ లోయ ప్రాంతంలోని నిమియా వద్దకు చేరుకుంటారు. హెరాక్లిస్ నిమియన్ సింహాన్ని నిర్జించిన ప్రాంతమిదే. విపరీతమైన దాహంతో అలమటిస్తున్న ఆర్గీవులకు హిప్సిపైలె అనే యువతి నీటిబుగ్గకు దారి చూపిస్తుంది. ఆమె ఒఫెల్టెస్ (Opheltes) అనే బాలుడి సంరక్షకురాలు.

## అయిదవ భాగం

హిప్సిపైలె (Hypsipyle) లెమ్నాస్ దీవిలో ఉండేది. అక్కడి ప్రజలు వీనస్ దేవతను (Venus) పూజించకపోవడంతో ఆమెకు కోపం వచ్చి అక్కడి స్త్రీలు పురుషులందర్నీ చంపేలా చేసింది. హిప్సిపైలె మాత్రం తన తండ్రి తోయాస్ (Thoas)ని ఓ చెక్క భోషాణంలో దాచి సముద్రంలో వదిలిపెట్టింది. ఈ విషయం తెలిసిపోవడంతో ఆమె పారిపోయి వచ్చి ఒఫెల్టెస్‌కు 'దాయి'గా కాలం గడుపుతోంది.

ఈ విషయాలు చెబుతూ ఆమె ఆర్గీవులకు నీటిబుగ్గకు పోయే దారి చూపిస్తుండగా ఒక మహాసర్పం పార్స్లీ ఆకులపై నిద్రిస్తున్న ఒఫెల్టెస్‌ను తన చుట్టలలో నలిపి చంపివేస్తుంది. ఆర్గీవులు ఆ సర్పాన్ని వధించి ఒఫెల్టెస్ (లైసెర్గస్ (Lycergus), యురెడైస్ (Eurydice)ల కుమారుడు) జ్ఞాపకార్థం నిమియన్ ఆటలపోటీలను నిర్వహించారు.

## ఆరవ భాగం

ఒఫెల్టెస్‌ను ఒక బ్రహ్మాండమైన చితిపై ఉంచి దహనం కావించారు. ఆర్గీవులు ఒఫెల్టెస్ స్మృత్యర్థం అనేక బలుల్ని, వీర విద్యాప్రదర్శనల్ని నిర్వహించారు. తొమ్మిదవ రోజున జరిగిన రథాల స్వారీలో ఏంఫియారస్ (Amphiarus) గెలుపొందాడు. పార్థినోపియస్ నడకలో, హిప్పొమెడాన్ డిస్కస్ పోటీలో, కపానియస్ ముష్టియుద్ధంలో (Boxing), టిడియస్ మల్లయుద్ధంలో (Wrestling)లో గెలుపొందారు.

## ఏడవ భాగం

నిమియాలో జరుగుతున్న ఆలస్యానికి జ్యూస్ (Zeus) దేవునికి కోపం వచ్చింది. మెర్క్యూరీని పంపి థ్రాసియన్ దేవాలయంలో ఉన్న మార్స్ దేవతను పురికొల్పగా ఆతడు ఆర్గీవులలో యుద్ధకాంక్షను పెంపొందించాడు. బాకస్ (Bacchus) దేవుడు యుద్ధాన్ని ఆపమని అర్థించినా జ్యూస్ అంగీకరించడు. భయంకరమైన దుశ్శకునాల మధ్య ఆర్గీవుల సైన్యం థెబెస్ నగరాన్ని చుట్టుముట్టింది.

ఏంటిగొనె తన భవన గవాక్షం నుంచి ఆ సైన్యాన్ని చూసి వీరులను గుర్తిస్తుంది. ఆర్గీవులు బాకస్ వనంలోని పవిత్ర వ్యాఘ్రాలు రెండింటిని చంపి థెబెన్లను యుద్ధానికి సవాలు చేస్తారు.

ఏంఫియారస్ (Amphiaraus) తన అవక్ర పరాక్రమంతో మొదటిరోజు యుద్ధంలో విజృంభించి థెబెన్లను చెల్లాచెదరు చేస్తాడు. ఇంతలో భూమి బద్ధలై, నెర్రెలు ఏర్పడగా ఏంఫియారస్ తన రథంతో సహా భూగర్భంలోకి అదృశ్యమవుతాడు.

## ఎనిమిదవ భాగం

తన అనుమతి లేకుండా పాతాళానికి మానవమాత్రుడు రావడంతో ఆగ్రహం చెందిన పాతాళాధిపతి ఫ్లూటో (Pluto) టిసిఫొనె (Tisiphone)ను పంపి యుద్ధరంగంలో అకృత్యాలు జరిగేలా చూడమని ఆజ్ఞాపిస్తాడు. ఇరువేపులా బలులు, దేవతా పూజలు విరివిగా జరుగుతాయి. రెండు పక్షాల్లోనూ లాభనష్టాలు దోబూచులాడు తున్నాయి. దురదృష్టవశాత్తూ ఇస్మెనె (Ismene) కాబోయే భర్త ఎటిస్ (Atys) యుద్ధంలో మరణించగా, మెలెనిప్పస్ (Melanippus) చేతిలో గాయపడ్డ టిడియస్ (Tydeus) ఆతనికి శిరచ్ఛేదం గావిస్తాడు.

## తొమ్మిదవ భాగం

తరువాత జరిగిన యుద్ధంలో టిడియస్ మరణిస్తాడు. ఆతని పార్థివదేహం కోసం ఇరుపక్షాలు తీవ్రంగా ప్రయత్నిస్తాయి. హిప్పొమెడాన్ (Hippomedon) ఆరోజు దుర్నిరీక్షుడైన సూర్యునిలా విజృంభించి టిడియస్ దేహాన్ని శత్రువుల హస్తగతం కాకుండా కాపాడతాడు. తరువాత ఇస్మెనస్ నదీ తీరాన జరిగిన యుద్ధంలో ఆకస్మాత్తుగా

నది పొంగి హిప్పొమెడాన్‌ను కబళించివేస్తుంది. ఆతని శరీరం కోసం జరిగిన సమరంలో హెప్సెస్ (Hepseus) మరణిస్తాడు. పార్థినోపియస్ విజృంభించి థెబెయన్లను మట్టుపెట్టుతున్నప్పుడు డ్రయస్ (Dryas) ఆతనిని చంపివేస్తాడు.

## పదవ భాగం

విజయోత్సాహంతో థెబెన్లు ఉత్సవాలు జరుపుకుంటారు. ఆర్గీవుల భార్యలు ఆవేదనతో జ్యూస్ దేవుణ్ణి ప్రార్థిస్తారు. వారి మొరాలకించిన దేవదేవుడు ఐరిస్ (Iris)ను పంపి థెబెన్ల సైన్యం నిద్రమత్తులోకి జారుకునేట్లు చేస్తాడు. ఆర్గీవుల సైనికులు ఆ రాత్రే థెబెన్ల శిబిరంపై దాడిచేసి నిద్రిస్తున్న వారిని నిద్రలోనే చంపివేసి అల్లకల్లోలం సృష్టిస్తారు. డైమాస్, హాప్లియస్‌లనే ఆర్గీవు సైనికులు అనేకమంది థెబెన్లను హతమార్చి చివరకు వీరమరణం పొందుతారు. మేలుకున్న థెబెన్ సైన్యం తమ కోటలోకి పారిపోయి కోట తలుపులు మూసివేస్తుంది.

టిరెసియాస్ జ్ఞాని (Tiresius) సూచనతో మెనొసియస్ (Menoeceus) కోటగోడపై నుండి దూకి ఆత్మార్పణ చేసుకుంటాడు. అతని బలి యుద్ధాన్ని అంతమొందిస్తుందని టిరెసియాస్ వివరిస్తాడు. కపానియస్ కోట బురుజునెక్కి థెబెన్లతో తలపడుతున్నపుడు జ్యూస్ దేవుడు ఆగ్రహం చెంది పిడుగుతో ఆతనిని భస్మీపటలం చేస్తాడు.

## పదకొండవ భాగం

ఆర్గీవుల వీరులొక్కొక్కరే నేలకొరిగారు. థెబెన్లు విజృంభించి ఆర్గీవులను వాళ్ల శిబిరాలవేపు తరిమికొట్టారు. కలహాధిదేవత ప్రోద్బలంతో పాలినైసిస్, ఎటియోక్లెస్‌లు ద్వంద్వయుద్ధానికి దిగుతారు. ఆ యుద్ధంలో ఒకరి చేతిలో ఒకరు ఇద్దరూ మరణిస్తారు. క్రియన్ (Creon) థెబెన్ సింహాసనాన్ని అధిష్ఠించి ఇడిపస్‌ను దేశం నుంచి బహిష్కరిస్తాడు. పాలినైసిస్‌ను దేశద్రోహిగా నిర్ధారించి ఆతనికి, ఆర్గీవుల మృతదేహాలకు ఉచిత సంస్కారాలు జరపకుండా నిషేధిస్తాడు.

## పండ్రెండవ భాగం

థెబెన్ల మృతవీరులకు అంతిమ సంస్కారాలు పూర్తవుతాయి. మృత ఆర్గీవుల భార్యలు థెబెస్ వచ్చినా రాజానుమతి లభించక ఎథెన్స్ వెళ్లి థెసియస్ (Theseus)తో తమ దుఃఖాన్ని విన్నవించుకుంటారు.

ఆర్గియా రహస్యంగా ఏంటిగోనెను కలిసి మృతి చెందిన సోదరులు పాలినైసిస్, ఎటియోక్లెస్‌లను ఒకే చితిపై ఉంచి దహనం కావిస్తుంది. అయినా దహన జ్వాలలు సైతం రెండుగా విడిపోవడం అందరినీ ఆశ్చర్యపరుస్తాయి. క్రియాన్

ఆర్గియా, ఏంటిగొనెలను ఖైదు చేస్తాడు.

థెసియస్ (Theseus) సైన్య సమేతంగా వచ్చి క్రియాన్‌ను హతమార్చి థెబెస్‌ను తన కైవసం చేసుకుంటాడు.

సోఫోక్లిస్ (Sophocles) రచించిన ఏంటిగొని (Antigoni)లో క్రియాన్ రాజు (Creon) పాలినెసియస్‌ను దేశద్రోహిగా పరిగణించి అంతిమ సంస్కారాలకు అనుమతినివ్వడు. ఏంటిగొని దానిని ఉల్లంఘించినందుకు ఆమెను సజీవ సమాధి గావించుతాడు. ఏంటిగొని సోదరి ఇస్మెనె (Ismene) తనను కూడ చంపివేయమని అర్థిస్తుంది. దేవతలు టిరిసియాస్ జ్ఞాని ద్వారా తమ అనంగీకారాన్ని తెలియజేయగా క్రియాన్ రాజు సమాధిని తెరిచేసరికే ఏంటిగొని ఉరివేసుకుని మరణించి ఉంటుంది. అది చూసిన క్రియాన్ కుమారుడు, ఏంటిగొని వరుడు హేమాన్ (Haemon) తండ్రిని చంపి తాను ఆత్మహత్య చేసుకుంటాడు. తన భర్త, కుమారులు మరణించగా గుండె బ్రద్ధలైన క్రియాన్ భార్య యురిడైస్ (Eurydice) తనూ ఆత్మహత్యకు పాల్పడ్తుంది.

# 4. ఎపిగొని

## (Epigoni (The Progeny) Epic Cycle-4)

తొలి థెబెస్ యుద్ధంలో వీరమరణం చెందిన ఆర్గీవువీరుల కుమారుల సాహస యాత్రలను వివరించేది ఎపిగొని (Epigoni). ఎపిగొని అనగా పుత్రులు (Offspring).

మొదటి థెబెస్ యుద్ధం తరువాత పదేళ్లకు ఏడుగురు ఆర్గీవుల పుత్రులు థెబెస్ నగరంపై దండెత్తి తమ తండ్రుల మరణానికి ప్రతీకారం తీర్చుకోవడం 'ఎపిగొని' కావ్య సారాంశం.

అపోలోడోరస్ కథనం ప్రకారం (Apollodorus) –

ఎడ్రాస్టస్ (Adrastus) కుమారుడు ఎగియెలియస్ (Aegialeus), ఏంఫియారిస్ (Amphiaraus) కుమారుడు అల్కమియన్ (Alcaemeon), ఏంఫియారస్ (Amphiaraus) కుమారుడు ఆంఫిలోకస్ (Amphilochus), టిడియస్ (Tydeus) కుమారుడు డయొమెడిస్ (Diomedes), మెసిస్టియస్ (Mecisteus) కుమారుడు యురియాలస్ (Euryalus), పార్థినోపియస్ (Parthenopeus) కుమారుడు ప్రొమాఖస్ (Promachus), కపానియస్ (Capaneus) కుమారుడు స్థెనెలస్ (Sthenelus), పాలినైసిస్ (Polynieces) కుమారుడు థెర్సాండర్ (Thersander)లు ఏడుగురు వీరపుత్రులు.

పౌసానియస్ (Pausanias) ఈ వీరుల సరసన హిప్పొమెడాన్ (Hippomedon) కుమారుడు పాలిడోరస్‌ను (Polydorus) చేర్చినాడు.

అపోలోడోరస్ రచనలో డెల్ఫిక్ దివ్యవాణి (Delphic Oracle) ననుసరించి అల్కమియాన్ (Alcaemaon) నాయకత్వంలో ఆర్గీవులు పోరు సల్పుతారు. థెబెన్ల నాయకుడు లావొడామస్ (Laodamas) చేతిలో ఎగియేలియస్ (Aegialeus) మరణిస్తాడు. అందుకు ఆగ్రహించిన ఆర్గీవు వీరుడు ఆల్కమియాన్, లావొడొమాస్‌ను చంపి థెబెన్లను ఓడిస్తాడు. చావగా మిగిలిన థెబెన్లు టిరెసియాస్ (Tiresias) జ్ఞానితో సహా పారిపోతారు.

పౌసానియస్ రచనలో థెర్సాండర్ (Thersander) – (పాలినేసియస్ కుమారుడు) ఆర్గీవుల నాయకుడు. లావొడామస్ గాయపడి థెబెన్లతో సహా నగరాన్ని విడిచి పారిపోగా థెర్సాండర్ థెబెస్ నగర ప్రభువుగా అందలమెక్కుతాడు.

# 5. సైప్రియా
## (Cypria - Kypria - Epic Cycle-5)

పదకొండు భాగాలుగా వ్రాయబడ్డ సైప్రియా కావ్యం హోమర్ తరువాత వ్రాయబడ్డా ఇలియాడ్‌కు ముందు జరిగిన సంఘటనలను వివరిస్తుంది.

భూభారం పెరిగినందున జ్యూస్ (Zeus) దేవుడు మానవమాత్రుల మధ్య యుద్ధాన్ని రగులుస్తాడు. సప్త ఆర్గీవు వీరపుత్రులు థెబెస్ నగరంపై దండెత్తడంతో సమరపు తొలిఘట్టం మొదలవుతుంది.

పెలియస్ (Peleus) థెటిస్ (Thetis)ల వివాహం, ఎథెనా (Athena), హెరా (Hera), ఎఫ్రొడైట్ (Aphrodite)లలో ఎఫ్రొడైట్‌ను అందగత్తెగా పారిస్ (Paris) నిర్ణయించడం, ప్రతిగా ఎఫ్రొడైట్ పారిస్‌కు మెనెలాస్ భార్య హెలెన్ (Helen)ను పారిస్ ప్రేమలో పడేట్లు చేస్తుంది.

పారిస్ ఎఫ్రొడైట్ సలహాతో అందాలరాశి హెలెన్‌ను పొందగోరి ఎయినీస్ (Aeneas)ను వెంటనిడుకుని లేస్‌డిమన్ (Lacedaemon) చేరుకుంటారు. అక్కడ వారికి టిండారస్ (Tyndareus); కాస్టర్ (Castor), పాలిడ్యూసెస్ (Polydeuces)ల పుత్రులు వారికి ఆతిథ్యమిస్తారు. మెనెలాస్ (Menelaus) పారిస్‌ను ఆదరించి తను క్రెటె (Crete) వెళ్లవలసిరాగా అతిథిని ఆదరించే పనిని తన భార్య హెలెన్‌కు అప్పగించి విదేశానికేగుతాడు.

ఎఫ్రొడైట్ ప్రోద్భలంతో హెలెన్ పారిస్‌తో ప్రేమలో పడుతుంది. ఆ మోహతప్తమాయలో హెలెన్, తన సంపదలతో సహా పారిస్‌తో ట్రాయ్ నగరాన్ని చేరుకుంటుంది.

విషయం తెలిసిన మెనెలాస్ ఆగ్రహంతో మండిపడతాడు. సోదరుడు ఆగమెమ్నాన్‌తో కలిసి హెలెన్ స్వయంవరానికి విచ్చేసిన ఇతర వీరుల్ని సమావేశ పరచి తాము వెనక చేసుకున్న ఒడంబడికను గుర్తుచేసి (ఒకరికొకరు సాయపడడం) యుద్ధ సన్నాహాలు ప్రారంభిస్తాడు.

ఆలిస్ (Aulis)లో బలుల అనంతరం దివ్యవాణి ఈ యుద్ధం పది సంవత్సరాలు సాగుతుందని కాల్కాస్ (Calchas) జ్ఞాని ద్వారా తెలుపుతుంది.

మైసియాలోని ట్యూథ్రాస్ నగరాన్ని (Teuthras) ట్రాయ్ (Troy)గా పొరబడి దానిని ధ్వసం చేయబోగా టెలెఫస్ (Telephus) అడ్డుకొంటాడు. ఎఖిల్లస్ (Achillus) అతనిని గాయపరుస్తాడు కాని తమకు ఇలియం (ట్రాయ్) మార్గాన్ని చూపేందుకు అతన్ని చంపకుండా గాయాన్ని నయం చేసి తమలో చేర్చుకుంటాడు.

ఆలిస్ (Aulis)లో రెండవసారి దివ్యవాణి ఆర్గీవులకు కాల్కాస్ (Calchas) జ్ఞాని ద్వారా తన హెచ్చరికను పంపింది. నౌకలు క్షేమంగా సముద్ర ప్రయాణం చేయాలంటే ఆగమెమ్నాన్ రాజు తన కుమార్తె ఇఫిజినియా (Iphigeneia)ను ఆర్టెమిస్ (Artemis) దేవతకు బలియివ్వాలని తెలుపుతుంది. ఆర్టెమిస్‌కు ప్రియమైన మగదుప్పిని (Stag) చంపి వాళ్లు ఆర్టెమిస్ దేవతకు ఆగ్రహాన్ని తెప్పించారు గనుక ఈ త్యాగం తప్పదు. అందుకని ఆగమెమ్నాన్ రాజు ఇఫిజినియాను ఎఖిల్లిస్‌కు యిచ్చి వివాహం చేస్తానన్న నెపంతో ఆమెను రప్పించాడు. బలిపీఠంపై ఉన్న ఇఫిజినియాను ఆర్టెమిస్ దేవత రక్షించి ఆమెను టవురి (Tauri) దేశానికి పంపివేస్తుంది.

ఆర్గీవులు అక్కడి నుంచి టెనెడాస్ (Tenedos) చేరుకుంటారు. వారు విందులలో వినోదిస్తున్నప్పుడు ఫిలోక్టిటస్ పాము కాటుకు గురైనాడు. ఆతని కాలు దుర్గంధ భూయిష్టం కాగా ఆర్గీవులు ఆతనిని లెమ్నాస్ (Lemnos)లో వదలి ప్రయాణం కొనసాగిస్తారు. ఎఖిల్లస్, ఆగమెమ్నాన్‌ల మధ్య జగడం అప్పుడప్పుడూ సంభవిస్తూనే ఉన్నది.

ట్రొయాడ్ (Troad)లో జరిగిన తొలిపోరులో ట్రోజన్ల చేతిలో ప్రొటెసిలాస్ (Protesilaus) మరణిస్తాడు. ఎఖిల్లిస్ పరాక్రమధాటిలో పొజిడాన్ (Poseidon) కుమారుడు సైక్నస్ (Cycnus) మరణించగా ట్రోజన్లు వెనక్కి మళ్లుతారు. హెలెన్‌ను ఆమె సంపదలతో పాటు తమ కైవసం చేయమని గ్రీకులు (ఆర్గీవులు) ట్రోజన్లకు సందేశం పంపుతారు. తమ హెచ్చరికను ట్రోజన్లు ఖాతరు చేయకపోవడంతో ట్రాయ్ నగరపు చుట్టుపక్కల ప్రాంతాల్ని నాశనం చేయడానికి సంకల్పించి ఆర్గీవులు సర్వ సన్నద్ధులై ముందుకు కదిలారు.

ఎఫ్రొడైట్, థెటిస్‌ల సాయంతో ఎఖిల్లిస్ హెలెన్‌తో సమావేశమవుతాడు. ఇంటికి మరలిపోదామని పట్టుపడ్తున్న ఎఖియన్లను వారించి, ఎయినీస్ (Aeneas) రాజ్యంలో గోగ్రహణం గావించి చుట్టుపక్కల పట్టణాలను కొల్లగొట్టి, ట్రాయిలస్ (Troilus)ను ఎఖిల్లిస్ చంపుతాడు. బహుమతిగా ఎఖిల్లిస్‌కు బ్రిసిస్ (Briseis) సుందరిని, ఆగమెమ్నాన్‌కు క్రైసిస్ (Chryseis)ను ఆర్గీవులు సమర్పిస్తారు.

పలామెడిస్ మరణం మరోసారి ఎఖిల్లిస్‌ను కృంగదీస్తుంది. పలామెడిస్ (Palamedes) నాప్లియస్ (Nauplius), క్లైమెనె (Clymene)ల కుమారుడు. అతడు అనేక శాస్త్ర విషయాలను కనుగొన్నవాడు. ద్రవ్యము (Currency), తూనికలు, కొలతలు (Weights & Measures) పాచికలు (Dice), చదరంగము (Pessoi/ Chess) గ్రీకు అక్షరమాలలో పదకొండు హల్లులను కనిపెట్టినవాడు. ఆగమెమ్నాన్ ఆతడిని ఒడెసిస్ (Odysseus)ను యుద్ధానికి ఆహ్వానించమని పంపుతాడు. హెలెన్ స్వయంవరంలో పాల్గొన్న వీరులందరూ ఒకరికొకరు బాసటగా ఉంటామన్న ప్రతిజ్ఞను

గుర్తుచేసాడు పలామెడిస్. అయినా ఒడెసిస్ పిచ్చివాడిలా నటిస్తూ అతని మాటలు వినిపించుకోడు. పొలంలో ఇసుకను జల్లుతూ మతిపోయిన వాడిలా ప్రవర్తిస్తున్న ఒడెసిస్ నాగలి ముందు ఒడెసిస్ కుమారుడు టెలెమాఖస్‌ను నిలిపి ఆతని నాటకాన్ని బయటపెడ్తాడు పలామెడిస్.

తనని ఇష్టం లేకుండా యుద్ధానికి రప్పించినందుకు ప్రతీకారంగా కొంత బంగారాన్ని, ప్రియామ్ రాజు వ్రాసినట్లున్న లేఖను ఉంచి ఆగమెమ్నాన్ ముందు ద్రోహిగా నిలబెడ్తాడు. శత్రువుల సొమ్ము తిని గ్రీకువీరులను ఇంటికి మరలేందుకు పురికొలుపుతున్నాడన్న నెపంతో ఆతనిని ద్రోహిగా ముద్రవేయగా ఒడెసిస్, డయోమెడిస్‌లు పలామెడిస్‌ను రాళ్లతో కొట్టి చంపుతారు.

ఈ సంఘటన ఎఖిల్లిస్ ఆగమెమ్నాన్‌ల మధ్య వాగ్వాదానికి మరో కారణమవుతుంది.

# 6. ఇలియాడ్

## Iliad (Song of Ilion or Song of Ilum)
## (Epic Cycle-6)

క్రీస్తుపూర్వం 8వ శతాబ్దంలో హోమర్‌చే వ్రాయబడినట్లు చెప్పబడుతున్న ఇలియాడ్ మహాకావ్యం పాశ్చాత్య కావ్యాలకు తలమానికం. పదిహేను వేల పంక్తులలో, 24 భాగాలుగా అత్యద్భుతమైన సంఘటనలతో ఆద్యంతం అలరించే అతిమనోహరమైన కావ్యం ఇలియాడ్.

### మొదటి భాగం

ఆర్గీవుల సైన్యంలో అలజడిని గమనించిన ఎఖిల్లిస్ వెల్లువలా వస్తున్న అపశకునాలకు కారణాల్ని కాల్కాస్ దివ్యవాణి ద్వారా గ్రహించి ఆగమెమ్నాన్‌ను క్రైసిస్ యువతిని ఆమె తండ్రి వద్దకు పంపివేయమని కోరతాడు. అది ఇద్దరి మధ్య మరోసారి ఘర్షణలకు దారితీస్తుంది. యుద్ధంలో తాను పాల్గొనబోనని ఎఖిల్లిస్ తన శిబిరానికి వెళ్లిపోతాడు. ఆగ్రహోదగ్రుడైన ఎఖిల్లిస్‌ను ఎథెనె దేవత సమయమిదికాదని వారిస్తుంది. దుఃఖంతో ఎఖిల్లిస్ తన తల్లి థెటిస్ (Thetis)ను జ్యూస్ (Zeus) వద్దకు వెళ్లి ఆర్గీవులు తన సాయం కోసం వెంపర్లాడేలా చేయమని అడుగుతాడు. ఇథియోపియన్ల పూజలు, విందులకోసం వెళ్లిన దేవతలు పదిరోజుల తరువాత ఒలింపస్ శిఖరాన్ని చేరుకుంటారు. అదనుచూసి థెటిస్ దేవత జ్యూస్ దేవేంద్రుడి పాదాలపై పడి తన విన్నపాన్ని తెలియబరుస్తుంది. జ్యూస్ దేవుడు హెరా దేవతకు కూడా తెలియనీకుండా మౌనం వహించినపుడు, హెరా ఎత్తిపొడుపులధికం కాగా, జ్యూస్ కోపోద్రిక్తుడు కాగా అమరసభ అత్యంత గంభీరంగా మారుతుంది. హెఫాస్టియస్ (Hephasteus) తన చతురోక్తులతో సభను మరల సందడిగా మార్చగా దేవతలు విందు వినోదాల్లో మునిగితేల్తారు.

### రెండవ భాగం

జ్యూస్ దేవుని ఆజ్ఞానుసారం ఆగమెమ్నాన్‌కు నిద్రలో ఒక స్వప్నం గోచరిస్తుంది. ట్రాయ్ ముట్టడికి అదే సమయమని భావించిన ఆగమెమ్నాన్ సైన్యంలోని ముఖ్యుల్ని సమావేశపరుస్తాడు. తొమ్మిదేళ్లు పూర్తయినాయి కనుక ఇక యుద్ధం చాలించి ఇంటికి మరలుదామని వ్యంగ్యంగా ఆగమెమ్నాన్ పలుకగానే సైన్యంలో అల్లకల్లోలం మొదలై చాలామంది తిరుగు ప్రయాణానికి సిద్ధం కాసాగారు. ఒడెసిస్, నెస్టర్ వాళ్లను వారించి, సముదాయించి వాళ్ళలో యుద్ధోత్సాహాన్ని నింపగా థెర్‌సైటిస్ వాళ్లను వ్యతిరేకిస్తాడు.

## మూడవ భాగం

అయినా యుద్ధం ఇంకా తీవ్రం కాలేదు. పారిస్ మెనెలాస్‌ను ద్వంద్వ యుద్ధానికి ఆహ్వానిస్తాడు. దానితో ఇరుపక్షాల మధ్య శాంతి సూచనలు అంకురించి సైనికులు తాత్కాలికంగా తమ తమ ఆయుధాలను నేలపై ఉంచి పారిస్, మెనెలాస్‌ల మధ్య యుద్ధాన్ని ఉత్కంఠతో వీక్షించసాగారు. ఐరిస్ (Iris) దేవత మారువేషంలో హెలెన్ వద్దకు వెళ్ళి ఆమెను కోట బురుజుపైన ఇరుపక్షాల సైన్య సమూహాల్ని చూస్తున్న ప్రియామ్ రాజు, ఆతని ఆంతరంగికుల మధ్యకు తీసుకువెళ్తుంది. ప్రియామ్‌రాజు కోరికపై హెలెన్ ఆర్గీవుల సైన్యంలోని ముఖ్యుల నామవిశేషాల్ని పరాక్రమాల్ని వివరిస్తుంది.

ద్వంద్వయుద్ధానికి మధ్యవర్తిగా ప్రియామ్‌రాజును ఆహ్వానిస్తారు. ఎవరు గెలిస్తే వారికి హెలెన్, ఆమె సర్వసంపదలూ దక్కుతాయి. ఇరుపక్షాలు శాంతి ఒడంబడికకు లోబడి ఇళ్లకు మరలవచ్చు. ఇదీ ఒప్పందం. ద్వంద్వయుద్ధం మొదలవుతుంది. పారిస్ విసిరిన బల్లెం మెనెలాస్‌ను గాయపరచలేకపోతుంది. కాని మెనెలాస్ తన ఖడ్గంతో పారిస్ శిరస్త్రాణాన్ని బద్దలు గావించి ఆతని మెడపట్టీని పట్టుకుని ఆర్గీవుల సైన్యంవేపు ఈడ్చుకుపోతున్న సమయంలో, ఎఫ్రొడైట్ దేవత కరుణ వల్ల మెడపట్టీ తెగి పారిస్ తన చుట్టూ ఆవరించిన ధూళిమేఘంలో అదృశ్యమై తన ఇంటిలో ప్రత్యక్షమవుతాడు. ఎఫ్రొడైట్ ఓ ముదుసలి పరిచారిక రూపంలో హెలెన్‌ను కవ్వించి పారిస్ కౌగిలిలోకి చేరుస్తుంది.

ఇక్కడ పారిస్ రతికేళిలో మునకలు వేస్తుంటే, అక్కడ యుద్ధరంగంలో మెనెలాస్ తోకతొక్కిన తాచులా బుసలు కొడ్తుంటాడు. ఆగమెమ్నాన్ విజయం తమదే అని తీర్మానించి హెలెన్‌ను సర్వసంపదలతో సహా అప్పగించవలసిందిగా ట్రోజన్లను హెచ్చరిస్తాడు.

## నాల్గవ భాగం

హెరా, ఎథెనా దేవతలు ట్రాయ్‌నగర విధ్వంసాన్ని కోరతారు. అయినా జ్యూస్ దేవుని వ్యూహం ఎవరికీ అర్థం కాదు. జ్యూస్ దేవుడు పంపగా ఎథెనా దేవత ట్రోజన్ సైనికుల మధ్యలో ప్రవేశించి పండారస్ అనే విలుకాణ్ణి మెనెలాస్‌ను తన బాణంతో గాయపరచేలా ప్రోత్సహిస్తుంది. బాణం తగిలి గాయపడిన మెనెలాస్ ఎస్క్లెపియస్ భిషక్కు కుమారుడు మఖవాన్ (Machaon) వైద్యంతో త్వరగా కోలుకుంటాడు. ఆగమెమ్నాన్ తన సైనిక ప్రముఖుల్ని రకరకాలుగా ఉత్తేజపరచి రణరంగానికి సమాయత్తం చేస్తాడు.

## అయిదవ భాగం

డయొమెడిస్ వీరత్వ ప్రదర్శన ఈరోజు సాగుతుంది. దేవతలను ఎదిరించడమే కాక గాయపరుస్తాడు. పండారస్ వదిలిన భాణం అతనిని గాయపరిచినా ఎథెనా ఇచ్చిన ఉత్సాహంతో అతడు మధ్యందిన మార్తాండునిలా విజృంభించి ఎయినీస్ (Aeneas)ను చంపబోతాడు. తన కుమారుడిని కాపాడబోయిన ఎఫ్రొడైట్‌ను చేతిపై గాయపరచగా ఆమె యుద్ధరంగం నుంచి అదృశ్యమై తన తల్లి డయోన (Dione) దగ్గర ఉపశమనాన్ని పొందుతుంది. ఎయినీస్ (Aeneas)ను రక్షించబోయిన అపొలో (Apollo)తో కూడ డయొమెడిస్ యుద్ధానికి తలపబడబోగా అపోలో ఆతనిని హెచ్చరించి వదిలివేస్తాడు.

ఏర్స్ (Ares) ప్రోత్సాహంతో ట్రోజన్లు ఆర్గీవులను ఎదుర్కొంటారు. హెరా ఎథెనాలు డయొమెడిస్‌కు సహకరిస్తారు. వారి ప్రోద్బలంతో డయొమెడిస్ ఏర్స్‌ను గాయపరచగా ఆతడు ఒలింపస్‌కు పారిపోతాడు. హెరా, ఎథెనాలు అదృశ్యమవుతారు.

## ఆరవ భాగం

ట్రోజన్ల కష్టాలు మరింత విస్తృతమవుతాయి. హెలెనస్ (Helenus) జ్ఞాని సలహాతో హెక్టార్ నగరంలో పర్యటిస్తాడు. ట్రోజన్ స్త్రీలు ఎథెనా దేవతకు పూజలు, మొక్కుబడులు సమర్పిస్తారు.

అక్కడ యుద్ధరంగంలో గ్లాకస్ (Glaucus), డయొమెడిస్ (Diomedes)లు ఒకరికొకరు ఎదురుపడి తమ పాత పరిచయాన్ని గుర్తుతెచ్చుకుని పరస్పరం కానుకలు ఇచ్చుకుని (లైసియన్ల (Lycians) స్వర్ణానికి బదులు ఆర్గీవులు (Argives) బ్రాంజ్)తో గౌరవించుకుని రాచమర్యాదల ఔన్నత్యాన్ని ప్రదర్శిస్తారు.

హెక్టార్ తన మాతృమూర్తిని సందర్శిస్తాడు. సోదరుడు పారిస్‌ను యుద్ధ రంగానికి రమ్మని సమాధానపరచి తన భార్యాపుత్రుల కోసం ఇంటికి వెళ్లగా వారు స్కియన్ (Scean Gates) కోట ద్వారం వద్ద ఉన్నట్లు తెలుస్తుంది. భార్యాభర్తల సమాగం (Andromachus and Hector) ప్రేమ విషాదాల సంగమం కాగా అది హెక్టార్ చివరి కలయికగా స్ఫురిస్తుంది. అత్యంత భారంగా జరిగిన వీడ్కోలు అనంతరం పారిస్‌తో కలిసి హెక్టార్ యుద్ధరంగానికి మరలుతాడు. ఆంద్రోమేఖస్ ఇంటికి వెళ్లి భర్త చనిపోయినట్లుగానే భావించి విలపిస్తుంది.

## ఏడవ భాగం

యుద్ధం మరింత తీవ్రతరమవుతుంది. హెలెనస్ జ్ఞాని ద్వారా ఎథెనా, అపొలో దేవతలు ఇరుపక్షాల నుంచి ఎన్నిక చేయబడిన వీరుల మధ్య ద్వంద్వయుద్ధాన్ని

ప్రోత్సహిస్తారు. ట్రోజన్ల పక్షాన్నుంచి హెక్టార్, ఆర్గీవుల నుంచి అజాక్స్‌ల మధ్య పోరు భయంకరంగా సాగినా విజయం ఎటూతేలదు. సూర్యాస్తమయం కాగా పోరు ఆరోజుకు ముగుస్తుంది.

పారిస్ రాకుమారుడు హెలెన్‌ను అప్పగించడానికి మరల తిరస్కరించడంతో ఇరుపక్షాల మధ్య వైరం మరింత ఎక్కువవుతుంది. ఆర్గీవులు తమ నౌకల చుట్టూరా రక్షణ దుర్గాన్ని నిర్మించుకుంటారు. ఇరుపక్షాల మృతవీరులకు అంతిమ సంస్కారాలు జరుగుతాయి.

## ఎనిమిదవ భాగం

జ్యూస్ దేవేంద్రుడు ఇడా (Ida) శిఖరం నుంచి యుద్ధాన్ని పర్యవేక్షిస్తాడు. మొగ్గు ట్రోజన్ల వేపు ఉంటుంది.

ఆర్గీవులలో డయొమెడిస్, ట్రోజన్లలో హెక్టార్‌లు తమతమ సైన్యాల్ని ప్రతిభా వంతంగా నడిపిస్తున్నారు. యుద్ధం తీవ్రమవుతుంది.

హెరా దేవత ఈరోజు జ్యూస్ దేవుని ఆజ్ఞలను ధిక్కరించదలుచు కున్నట్లున్నది. పొజిడాన్ దేవుణ్ణి ఆగమెమ్నాన్‌కు సమరోత్సాహాన్నివ్వమని కోరుతుంది. జ్యూస్ పంపగా వచ్చిన ఐరిస్ వారిని నిలువరిస్తుంది. జ్యూస్ దేవుడు దేవతలకు తన వ్యూహాన్ని వివరిస్తాడు.

గ్రీకులకు మరుసటిరోజు ఓ దుస్వప్నమవుతుంది. హెక్టార్ విజృంభణతో ఆర్గీవులు వెన్నుచూపి తమ నౌకలవద్దకు వెనుకంజ వేయగా ఆ రోజు కూడ విజయ ఫలితం తేలదు. మరుసటిరోజు పోరుకోసం హెక్టార్ తన బలగాలతో కోట వెలుపలి మైదానంలో విడిదిచేస్తాడు.

## తొమ్మిదవ భాగం

ఆగమెమ్నాన్ మరల యుద్ధ విముఖతను చూపుతాడు. డయొమెడిస్ అతనిని వ్యతిరేకించి, నెస్టర్ సలహాతో ఎఖిల్లిస్‌కు రాయబారాన్ని పంపుదామని సలహాయిస్తాడు. ఆగమెమ్నాన్ అంగీకారంతో ఒడెసిస్, అజాక్స్, ఫీనిక్స్‌లు ఎఖిల్లిస్ శిబిరానికి చేరుకుంటారు. ఒడెసిస్ ప్రతిపాదనలు వాక్చాతుర్యంతో కూడినవికాగా, అజాక్స్ మాటలు వీరోత్సాహాన్ని కలిగించేవిగా, ఫీనిక్స్ పలుకులు భావావేశంతో మానవత్వం నిండినవిగా కానవస్తాయి.

ఎఖిల్లిస్ కొంచెం కరిగినట్లు కనిపించినా, అవమానంతో క్రోధంతో రగుల్తున్న అతని హృదయం ఉపశమించదు. హెక్టార్ తమ నౌకల వద్దకు వచ్చినప్పుడే తాను రంగంలోకి దిగుతానని ఎఖిల్లిస్ ఖరాఖండీగా చెబుతాడు. రాయబారులు తమ

ప్రయత్నం విఫలమయిందని బాధపడ్తుంటే డయొమెడిస్ వారిని ఓదార్చి ధైర్యం చెబుతాడు.

## పదవభాగం

అందరూ నిద్రాదేవత ఒడిలో ఒరిగిపోయినా ఆగమెమ్నాన్, మెనెలాస్ సోదరులు ఆందోళనాభరితులై ఒడెసిస్, డయొమెడిస్‌లను మేల్కొలిపి శత్రువ్యూహాన్ని అంచనావేయమని అడుగుతారు. అటుపక్క హెక్టార్ కూడా డోలాన్ (Dolan) అనే వీరునికి ఎఖిల్లిస్ అశ్వాలను బహుమతిగా ఆశచూపి ఆర్గీవుల శిబిరంవేపు గూఢచారిగా పంపుతాడు. విధివక్రించి ఆతడు ఒడెసిస్, డయొమెడిస్‌లకు చిక్కి ట్రోజన్ల రహస్యాలను, అద్భుతమైన అశ్వాలతో విచ్చేసిన థ్రాసియన్ రాజు రీసస్ (Rhesus) శిబిరం గురించి వెల్లడిస్తాడు. ఆర్గీవులు ఆతడిని అక్కడే హతమార్చి, రీసస్ శిబిరంపై దాడిచేసి రాజును, ఆతని పండ్రెండుగురు అనుచరుల్ని చంపి గుర్రాలను తమ నౌకలవద్దకు తీసుకుపోతారు.

## పదకొండవ భాగం

ఆగమెమ్నాన్ విజృంభణ ఈరోజు నుంచి ప్రారంభమవుతుంది. ఆతని ధాటికి తట్టుకోలేక శత్రువులు పలాయనం చిత్తగిస్తుంటే ఆర్గీవుల విజయం తథ్యమనిపిస్తుంది. ఐరిస్ ప్రోత్సాహంతో హెక్టార్ ఆర్గీవులను శాయశక్తులా ప్రతిఘటిస్తాడు. గాయపడిన ఆగమెమ్నాన్ తన శిబిరంవేపు మరలడంతో ట్రోజన్లలో ఆశ చిగురిస్తుంది. డయొమెడిస్, ఒడెసిస్‌లు కొంతవరకు ట్రోజన్లను ఆపగలిగినా డయొమెడిస్ కూడ గాయపడతాడు. ఒడెసిస్, అజాక్స్‌లు తమ వీరత్వంతో ట్రోజన్లను కొంతసేపు అల్లకల్లోల పరచినా తలవంచకతప్పదు. గాయపడిన మఖవాన్ (Machaon)ను తన రథంపై తీసుకుని వెళ్తున్న నెస్టర్‌ను తన నౌకాగ్రం నుంచి వీక్షించిన ఎఖిల్లిస్ తన మిత్రుడు పాట్రోక్లస్ (Patroclus)ను విషయం కనుక్కోమని పంపుతాడు. ఎఖిల్లిస్‌ను యుద్ధానికి వచ్చేలా చేయమని పాట్రోక్లస్‌ను నెస్టర్ అర్థిస్తాడు. దారిలో ఎదురుపడ్డ యూరిపైలస్ (Eurypylus) పాట్రోక్లస్‌తో ఆర్గీవులకు అంతిమక్షణాలు దగ్గరపడ్డాయని వివరిస్తాడు.

## పండ్రెండవ భాగం

ట్రోజన్లు అసంఖ్యాకులై ఆర్గీవుల రక్షణవలయాన్ని సమీపిస్తారు. హెక్టార్ నాయకత్వంలో ట్రోజన్ సైనికులు ఆర్గీవుల నౌకల చుట్టూరా ఏర్పరుచుకున్న మట్టి కోటను అగడ్తను ధ్వంసం చేయ సంకల్పించగా పాలిడామస్ (Polydamos) అగడ్త అంచులను దాటి శత్రు శిబిరంపై దాడిచేసేలా హెక్టార్‌కు సలహాయిస్తాడు. ఆ ప్రయత్నంలో ఎసియస్ (Asius) వీరమరణాన్ని పొందుతాడు. సార్పెడాన్ (Sarpedon) కొంత కోటగోడను ధ్వంసం చేయగా, హెక్టార్ ఓ పెద్ద గండశిలతో ద్వారం తలుపులను వ్రయ్యలు చేస్తాడు.

## పదమూడవ భాగం

జ్యూస్ వద్దని వారించినా దేవతలు స్వయంగా తమతమ అభిమాన వీరపుత్రులకు సహాయం చేయ సంకల్పిస్తారు. పొజిడాన్ కాల్కాస్ జ్ఞాని రూపంలో ఎఖియన్లకు ధైర్యాన్ని నూరిపోస్తాడు. మరోసారి థోయాస్ (Thoas)గా ఉన్నపుడు హెక్టార్ చేతిలో తన మనవడు ఏంఫిమాఖస్ (Amphimachus) మరణించడాన్ని చూసి విలపిస్తాడు. క్రెటన్‌రాజు ఇడొమెనెస్ (Idomenes) ఎఖియన్లను ఉత్సాహపరుస్తాడు. పాలిడామస్ సలహాతో హెక్టార్ సైన్యాన్ని సంఘటిత పరచినా ఎఖిల్లిస్ గురించిన ఆతని హెచ్చరికలను పట్టించుకోడు.

## పధ్నాలుగవ భాగం

మఖవాన్ (Machaon)కు వైద్యసహాయం అందించి నెస్టర్ యుద్ధరంగానికి వస్తూ గాయపడి తిరోన్ముఖులై వస్తున్న డయొమెడిస్, ఒడెసిస్, ఆగమెమ్నాన్‌లను కలుస్తాడు. ఆగమెమ్నాన్ - ఇక చేసిన యుద్ధం చాలు - చీకటి పడగానే నౌకలను స్వదేశానికి మరలిద్దామంటాడు. ఒడెసిస్, డయొమెడిస్‌లు ఒప్పుకోరు. పొజిడాన్ దేవుడు ఆగమెమ్నాన్‌ను ఉత్సాహపరుస్తాడు.

హెరాదేవత జ్యూస్‌ను సమ్మోహపరచి నిద్రపోయేట్లు చేస్తుంది. పొజిడాన్ ప్రోద్బలంతో ఉత్తేజితులైన ఆర్గీవులలో అజాక్స్ విసిరిన పెనుశిల తగిలి హెక్టార్ మూర్ఛపోతాడు.

## పదిహేనవ భాగం

నిద్రనుంచి లేచిన జ్యూస్ దేవుడు హెరా తంత్రాన్ని అవగతం చేసుకుంటాడు. అందరిని చీవాట్లు పెట్టి తన అసలు ఉద్దేశాన్ని వెల్లడించగా హెరా ఐరిస్, అపొలోలను యుద్ధరంగానికి పంపుతుంది. ఐరిస్ సందేశంతో పొజిడాన్ రణరంగం నుంచి నిష్క్రమించగా, అపొలో హెక్టార్‌ను స్వస్థపరిచి ఆర్గీవులపైకి ఉసికొలుపుతాడు. హెక్టార్ ధాటికి తట్టుకోలేని ఆర్గీవులు తమతమ నౌకల వెనుక ఆశ్రయం పొందుతారు. ట్రోజన్ల చేతిలో మండుతున్న కాగడాలను చూసిన పాట్రొక్లస్ తమ నౌకలవేపు శత్రువులు వస్తున్నారని భావించి ఎఖిల్లిస్‌ను త్వరితగతిని చేరుకుంటాడు.

## పదహారవ భాగం

ఎఖిల్లిస్ తనకు జరిగిన అవమానాన్నింకా మరిచిపోలేదు. కావాలంటే నా ఆయుధాల్ని కవచాన్ని ధరించి శత్రువులను ప్రతిఘటించు. అంతేకాని వాళ్లను తరుముతూ దూరంగా పోవద్దు అని పాట్రొక్లస్‌ను హెచ్చరిస్తాడు.

ట్రోజన్లను ఎంతోసేపు నిలువరించిన అజాక్స్ అలిసిపోయాడు. పాట్రొక్లస్ మిర్మిడాన్ల సైన్యంతో ట్రోజన్లను ఢీకొని అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ సార్పెడాన్‌ను

సంహరిస్తాడు. జ్యూస్ అనుజ్ఞతో అపోలో సార్పిడాన్ శరీరాన్ని భద్రపరుస్తాడు. హెచ్చరికను మరిచి నౌకలకు దూరంగా వెళ్లగా ఆతనిని అసియస్ (Asius) రూపంలో ఉన్న అపోలో, యుఫోర్బస్, హెక్టార్‌లు చుట్టుముట్టి గాయపరచగా హెక్టార్ తన బల్లెంతో పాట్రొక్లస్‌ను హతమారుస్తాడు.

## పదిహేడవ భాగం

పాట్రొక్లస్ శరీరం కోసం జరిగిన యుద్ధంలో మెనెలాస్ యుఫోర్బస్‌ను చంపుతాడు. హెక్టార్ అందరినీ పారద్రోలి పాట్రొక్లస్ శరీరంపైని ఉన్న ఎఖిల్లిస్ కవచాన్ని ఆయుధాల్ని తన కైవసం చేసుకుంటాడు. అజాక్స్ నాయకత్వాన ఎఖియన్లు వీరోచితంగా పోరాడి పాట్రొక్లస్ శరీరాన్ని ట్రోజన్ల నుంచి స్వాధీనం చేసుకుని, ఎఖిల్లిస్ అశ్వాలతో సహా తమతమ శిబిరాలకు మరలుతారు. చీకటి పడడంతో ఆరోజుకు యుద్ధం ముగుస్తుంది. ఏంటిలోఖస్ (Antilochus - the son of Nestor)ను పాట్రొక్లస్ మరణాన్ని ఎఖిల్లిస్‌కు తెలుపవలసిందిగా మెనెలాస్ పంపుతాడు.

## పద్ధెనిమిదవ భాగం

పాట్రొక్లస్ మరణంతో క్రుంగిన ఎఖిల్లిస్‌ను అతని తల్లి థెటిస్ ఓదార్చి హెఫాస్టిస్ దేవునిచే నిర్మితమై మానవ జీవిత సారాంశాన్ని తెలిపే చిత్రాలున్న కవచాల్ని, డాలును, ఆయుధాల్ని తెస్తానని మాట ఇస్తుంది. హెక్టార్ మరణాన్ని అనుసరించే ఎఖిల్లిస్ మరణం ఉంటుందన్న విషయాన్ని వివరిస్తుంది.

పాట్రొక్లస్ శరీరం శిథిలమైపోతుందని, ట్రోజన్లు ఆ శరీరాన్ని స్వాధీన పరచుకోకుండా ఎఖిల్లిస్ ఎథెనె, ఐరిస్‌ల ప్రేరణతో భయంకరంగా పెడబొబ్బలు పెడుతూ ట్రోజన్లను భయకంపితుల్ని చేస్తాడు.

వెనక్కు మరలుదామని పాలిడామస్ ఇచ్చిన సలహాలు పెడచెవినపెట్టి హెక్టార్ మరుసటిరోజు యుద్ధానికి తన సైన్యాన్ని సన్నద్ధుల్ని చేయసాగాడు.

## పంధొమ్మిదవ భాగం

ఉదయాన్నే థెటిస్ ఇచ్చిన ఆయుధాల్ని ధరించి, తన మిత్రుని శరీరానికి అమృతచికిత్స చేసి ఆగమెమ్నాన్‌తో ఎఖిల్లిస్ సమావేశమవుతాడు. ఆగమెమ్నాన్ తాను చేసిన పొరపాటును ఒప్పుకుని దానికి ప్రతిగా అనేక బహుమతుల్నివ్వబోతాడు. బ్రిసిస్ యువతిని తాను ముట్టుకోలేదనీ ప్రమాణం చేస్తాడు.

ఎఖిల్లిస్ యుద్ధానికి వేగిరపడతాడు. ఆతని అశ్వరాజం మాట్లాడుతూ రానున్న విపత్తును వివరిస్తుంది.

## ఇరువది భాగం

అత్యంత భీకరమైన యుద్ధం ప్రారంభమవుతుంది. జ్యూస్ దేవుడు దేవతలను వారి యిష్టారాజ్యాలకు వదిలివేస్తాడు. ఉరుములు, పిడుగులు, భూకంపాలు, పెనుగాలులు యుద్ధరంగ దేవతలై ప్రేక్షకులవుతాయి.

ఎఖిల్లిస్ చేతి నుంచి పాజిడాన్ దయవల్ల ఎయినీస్ (Aeneas) అపోలో మహిమతో హెక్టార్‌లు రక్షింపబడతారు.

ఎఖిల్లిస్ క్రోధం మరింత రగిలి భీకరారణ్యాన్ని చుట్టుముట్టిన దావాగ్నిలా ప్రజ్వరిల్లుతుంది.

## ఇరవై ఒకటవ భాగం

స్కామాండర్ (Scamander) నదీతీరాన జరిగిన సమరంలో ఎఖిల్లిస్ అరివీరభయంకరుడై నదిని మొత్తం కళేబరాలతో నింపేస్తాడు. ప్రియామ్ కుమారుడు లైకాన్ (Lycaon)ను చంపి పంద్రెండుగురు ట్రోజన్ వీరుల్ని బంధించి పాట్రొక్లస్ చితిపై బలిచేయడానికి నిశ్చయిస్తాడు. కోపించిన స్కామాండర్ నది పొంగి ఎఖిల్లిస్‌ను నిలువరించగా పాజిడాన్ నదిని ఇంకింపచేస్తాడు. దేవతల మధ్య సమరం మొదలుకాగా ఎథెనె దేవత ఏర్స్ (Ares)ను రాతితో గాయపరుస్తుంది. అపోలో పాజిడాన్‌తో యుద్ధానికి ఇష్టపడడు. ఆర్టెమిస్ మొండిగా ఉండడంతో హెరా దేవత ఆమె విల్లమ్ముల్ని విరిచి యుద్ధరంగం నుంచి నిష్క్రమించేలా చేస్తుంది.

ఎగెనార్ (Agenor) ట్రాయ్‌నగరపు మహాద్వారం వద్ద నిలబడి ఎఖిల్లిస్‌ను ఆపే ప్రయత్నం చేస్తాడు. అపోలో దేవుడు ఎఖిల్లిస్‌ను ఎగెనార్ రూపంలో దృష్టిమరలించి ట్రోజన్లు తమ కోటలోకి సురక్షితంగా మరలేలా సాయపడతాడు.

## ఇరవైరెండవ భాగం

తన తల్లిదండ్రులు ఎంత బతిమిలాడుతున్నా వినకుండా హెక్టార్ కోటముందే యుద్ధ సన్నద్ధుడై నిలబడతాడు. ఎఖిల్లిస్ ఆతని వెంటబడగా మూడుసార్లు కోటచుట్టూ తిప్పి తిప్పి చివరకు తనకు మరణం ఆసన్నమైనదని గ్రహించి ఎఖిల్లిస్‌తో ద్వంద్వ యుద్ధానికి దిగుతాడు. దొరికిన శత్రువును కసితీరా చంపి ఎఖిల్లిస్, హెక్టార్ శవాన్ని తన రథానికి కట్టి ఈడ్చుకుంటూ తన శిబిరంవేపు బయల్దేరతాడు.

ప్రియామ్, హెకుబా, ఏంద్రొమాఖెల దుఃఖానికి అంతుండదు.

## ఇరవై మూడవ భాగం

ఇప్పుడక్కడ అంతిమ సంస్కారాలకై ఎదురుచూస్తున్న శవాలు రెండున్నాయి. పాట్రొక్లస్ శరీరాన్ని ఓ బ్రహ్మాండమైన చితిపై ఉంచి బందీలుగా ఉన్న పంద్రెండుగురు

ట్రోజన్లను బలియిచ్చి దహనసంస్కారాలు గావించారు. మరుసటిరోజు పాట్రోక్లస్ చితి బూడిద, ఎముకలను ఏరి వాటిని సంరక్షిస్తూ యుద్ధ విద్యా ప్రదర్శనలను ప్రారంభించారు. ఒడెసిస్ చతురతకు, అజాక్స్ సాహసానికి మధ్య జరిగిన పోటీలో ఇద్దరూ సమ ఉజ్జీలైనారు. ఎఖిల్లిస్ మధ్యవర్తిత్వం రేపు భవిష్యత్తులో జరిగే సంఘటనను సూచించినట్లుండింది.

## ఇరవై నాలుగవ భాగం

అయినా ఎఖిల్లిస్ కోపం చల్లారలేదు. తన ప్రాణమిత్రుని చంపిన హెక్టార్‌పై పగ ఇంకా పొగలు కక్కుతూనే ఉన్నది. ప్రతిరోజూ హెక్టార్ శవాన్ని మూడుమార్లు పాట్రొక్లస్ సమాధిచుట్టూ ఈడుస్తూ ప్రదక్షిణాలు చేసేవాడు. దేవతలు థెటిస్‌ను ఎఖిల్లిస్ వద్దకు పంపి హెక్టార్ శవాన్ని వాళ్ల బంధువులకు అప్పగించవలసిందిగా ఒత్తిడి తెచ్చారు. ఆ రాత్రి ప్రియామ్‌రాజు అనేక కానుకలతో ఎవరికంట పడకుండా ఎఖిల్లిస్ శిబిరానికి చేరుకుని ఆతని మోకాళ్లు పట్టుకుని తన కుమారుడి శవాన్ని అప్పగించమని బతిమాల్తాడు. ఇరువురిమధ్య చాలాసేపు జరిగిన సంభాషణలో ఎఖిల్లిస్ తన మానసిక వ్యధను వెల్లడిచేస్తాడు.

ప్రియామ్ తన కుమారుడి శవంతో ట్రాయ్ నగరం చేరుకుంటాడు. పదకొండు రోజులు యుద్ధవిరమణ జరుగుతుంది. ఏండ్రొమాఖె, హెకుబా, హెలెన్‌ల విషాదానికి అంతేలేదు. తొమ్మిది రోజులు చితికి ఏర్పాట్లు జరుగుతాయి. పదవరోజున దహన సంస్కారాల అనంతరం సమాధి నిర్మిస్తారు.

# 7. ఎథియోపిస్
## (Aethiopis - Epic Cycle - 7)

ఎథియోపిస్ గ్రీకు ఇతిహాసచరిత్రలో ట్రోజన్ వీరచరిత్రలో ఏడవభాగం. ఇది ఆర్కిటినస్ (Arctinus of Meletus)చే రచించబడినదిగా ప్రసిద్ధికెక్కింది. రచనాకాలం 700-600 క్రీస్తుపూర్వంగా భావిస్తున్నారు. పూర్వరచనలో కేవం అయిదు పంక్తులు మాత్రమే లభ్యమవుతున్నా ప్రొక్లస్ (Proclus) క్రీస్తుశకం రెండవ శతాబ్దిలో రచించిన క్రెస్టోమాథె (Chrestomathy) నుంచి కథాసారాంశాన్ని గ్రహించినారు. అయిదు భాగాలుగా వ్రాయబడిన ఎథియోపిస్ కావ్యంలో అమెజాన్ వీరవనిత పెంథెసిలియాది ముఖ్యపాత్ర.

## కావ్యసంగ్రహం

హెక్టార్ మరణం నాటికి అమెజాన్‌ల నాయకురాలు పెంథెసిలియా (Penthesilea) తన సైన్యంతో ట్రోజన్ల పక్షాన పోరాడడానికి వస్తుంది. ఆర్గీవులను తన ధైర్యసాహసాలతో చీకాకుపరిచి మఖవాన్ (Machaon, the son of Asclepius) హతమార్చిన పెంథిసిలియాను ఎఖిల్లిస్ గాయపరిచి చంపుతాడు. తనను పెంథెసిలియా ప్రేమలో పడ్డావని వేళాకోళం చేసినందుకు తన సాటి ఆర్గీవువీరుడు థెర్‌సైటిస్ (Thersites)ను తన కరవాలానికి బలిచేస్తాడు ఎఖిల్లిస్. ఆ తరువాత ప్రాయశ్చిత్త విధులను నిర్వర్తించి విముక్తి పొందుతాడు.

ఈలోగా ఇథియోపియానుంచి ఈవాస్ (Eos) టిథొనస్ (Tithonus)ల కుమారుడు మెమ్నాన్ (Memnon) తన బలగాలతో ట్రాయ్‌నగరం చేరుకుంటాడు. హెఫాస్టిస్ తయారుచేసిన కవచం, ఆయుధాలతో అవక్ర పరాక్రముడై మెమ్నాన్, నెస్టర్ కుమారుడు, ఎఖిల్లిస్‌కు సన్నిహితుడు అయిన ఏంటిలోఖస్ (Antilochus)ను చంపగా కోపించిన ఎఖిల్లిస్ మెమ్నాన్‌ను దారుణంగా వధిస్తాడు. ఈవాస్ (Eos) అభ్యర్థనతో జ్యూస్ దేవుడు మెమ్నాన్‌ను అమరుడ్ని గావిస్తాడు. ఇంకా కోపం తగ్గని ఎఖిల్లిస్ ట్రోజన్లను స్కీయన్ ద్వారాల (Scaean Gates) వరకు తరుముకు వెళ్లగా అదనుకోసం వేచిచూస్తున్న పారిస్ ఆతనిని తన బాణంతో చీలమండ వద్ద గాయపరచి అపొలో దేవత సాయంతో హతమారుస్తాడు. అజాక్స్, ఒడెసిస్‌లు అక్కడకు చేరుకుని ఎఖిల్లిస్ శరీరం శత్రువుల చేజిక్కకుండా కాపాడుకుంటారు.

గ్రీకులు ఏంటిలోఖస్‌కు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తారు. తన కుమారుడు ఎఖిల్లిస్ మరణాన్ని తెలుసుకున్న థెటిస్, మ్యూజెస్ (Muses) ను వెంట నిడుకుని కుమారుని శవాన్ని చూచి విలపిస్తుంది. అంత్యక్రియల సందర్భంలో జరిగిన యుద్ధ విద్యాప్రదర్శనలలో అజాక్స్, ఒడెసిస్‌ల మధ్య ఘర్షణ చెలరేగుతుంది. ఇద్దరూ సమ ఉజ్జీలు కాగా ఎవరికి ఎఖిల్లిస్ కవచం, ఆయుధాలు చెందుతాయన్న వివాదంతో ఎథియోపిస్ ముగుస్తుంది.

# 8. చిన్న ఇలియాడ్
## (Little Iliad - Epic Cycle-8)

మూలకావ్యం నుంచి కేవలం ముప్పది పంక్తులు మాత్రమే లభ్యమవుతున్నా, ప్రొక్లస్ (Eutychlius Proclus) రచించిన క్రిస్టొమాథె (Christomathe) నుంచి కావ్యసంగ్రహాన్ని విజ్ఞులు గుర్తించారు. నాలుగు భాగాలుగా రచింపబడినదిగా చెప్పబడుతున్న ఈ కావ్యానికి మూలరచయితలుగా అనేకమంది (Lesches, Cinaethon, Diodorus, Thestorides, Homer) పేర్లు వాడుకలో ఉన్నాయి.

### కావ్యసంగ్రహం

ఎఖిల్లిస్ శరీరాన్ని ఎవరు కాపాడారు? ఎవరికి ఎఖిల్లిస్ ఆయుధాలు చెందాలి? అన్న వివాదంపై ఇద్దరి ప్రసంగాలు, వాదనలు, ట్రోజన్ ఖైదీల నిర్ణయం ఇవన్నీ ఒడెసిస్ వేపు మొగ్గుచూపుతాయి. ఆగ్రహం చెందిన అజాక్స్ ఒడెసిస్‌ను కపటుడిగా, మోసగాడిగా నిందిస్తాడు. ఎథెనాకు కోపం వచ్చి అజాక్స్‌ని ఉన్మత్తుణ్ణి గావిస్తుంది. ఆ ఉన్మాదంలో అజాక్స్ పిచ్చెక్కి తిరుగుతూ చుట్టూ ఉన్న గొర్రెల్ని తన ఆయుధానికి బలిచేస్తాడు. ఉన్మాదం తగ్గిన తరువాత తన పిచ్చి చేష్టలకు సిగ్గుపడి ఆత్మహత్య చేసుకుంటాడు. ఆగమెమ్నాన్ రాజు ఆగ్రహంతో అజాక్స్‌కు సరైన అంత్యక్రియలు జరపకుండా చెక్కపెట్టెలో ఆతని శవాన్నుంచి సమాధి గావిస్తాడు.

గ్రీకుల ద్రష్ట కాల్కాస్‌జ్ఞాని జోస్యం ప్రకారం ఫిలోక్టెటిస్ (Philoctetes) దగ్గర ఉన్న హెరాక్లిస్ (Heracles) ఆయుధాల వల్లనే ట్రాయ్‌నగరంపై విజయం సాధ్యమవుతుంది. అందువల్ల ఒడెసిస్, డయొమెడిస్‌లు, లెమ్నాస్ ద్వీపంలో పాముకాటు వల్ల కాలికి గాయమై దుర్వాసన వస్తున్నందువల్ల విడిచిపెట్టబడిన ఫిలోక్టిటిస్‌ను బతిమిలాడి యుద్ధరంగానికి తీసుకువస్తారు. రాజవైద్యుల వల్ల గాయం నయం కాగా ఫిలొక్టెటిస్ పారిస్‌తో ద్వంద్వయుద్ధానికి తలపడి పారిస్‌ను చంపుతాడు. హెలెన్ కోసం పోటీపడిన హెలెనస్ (Helenus), డీఫొబస్ (Deiphobus)లలో డీఫోబస్ విజయం చెంది హెలెన్‌ను వివాహం చేసుకుంటాడు. ఆగ్రహంతో హెలెనస్ ట్రాయ్ నగరాన్ని విడిచి ఇడా పర్వతాలకు వలసపోబోతాడు.

దారిలో ఒడెసిస్ ఆతనిని పట్టుకుని నిర్బంధించగా గ్రీకులు గెలవాలంటే మూడు పనులు ముందుగా జరగాలంటాడు. మొదటిది పల్లాడియం (Palladium) ట్రాయ్‌నగరంలో ఉన్నంతవరకు ట్రాయ్‌నగరం పతనం చెందదు. రెండవది పీసా నుంచి పెలాప్ (Pelops) ఎముకల అవశేషాల్ని తీసుకురావాలి. మూడవది ఎఖిల్లిస్ కుమారుడు నియోటాలమస్ (Neoptolemus) యుద్ధంలో పాల్గొనాలి.

ఒడెసిస్ వెళ్లి నియోటాలమస్‌ను తీసుకువచ్చి ఆతనికి ఎఖిల్లిస్ ఆయుధాల్ని, కవచాన్ని అప్పగిస్తాడు. ఎఖిల్లిస్ ఆత్మ కుమారునికి ఉద్బోధ చేస్తుంది. తరువాత జరిగిన యుద్ధంలో విజృంభించిన ట్రోజన్ వీరుడు యూరిపైలస్ (Eurypylus)ను నియోటాలమస్ నిర్జిస్తాడు.

పెలాప్స్ అస్థికల కోసం ఒక నౌక పీసానగరానికి వెళ్తుంది. ఒడెసిస్, డయొమెడిస్‌లు బిచ్చగాళ్ల వేషంలో ట్రాయ్ నగరానికి వెళ్లి హెలెన్ సాయంతో పల్లాడియంను తీసుకుని, దారిలో కొందరు ట్రోజన్లను సంహరించి తమ శిబిరాలకు చేరుకుంటారు.

ఎథెనా ప్రోత్సాహంతో గ్రీకువీరుడు ఎపియస్ (Epeus) ఒక బ్రహ్మాండమైన దారు నిర్మిత అశ్వాన్ని (Trozan Horse)ను నిర్మిస్తాడు. అరివీరభయంకరులైన ఆర్గీవులు దానిలో దాగి తగు సమయానికై వేచిచూస్తుండగా, మిగతా గ్రీకువీరులు తమ శిబిరాల్ని తగలపెట్టి, నౌకలను తీసుకుని టినిడాస్ (Tenedos) ద్వీపంలో కొండలమాటున నిరీక్షిస్తుంటారు.

ఉదయాన్నే ట్రోజన్లు ఆర్గీవులు పలాయనం చిత్తగిస్తూ ఒక మహా దారు శిల్పాన్ని వదిలివెళ్లారని భావిస్తారు. తమ కోటగోడలో ఒక భాగాన్ని కూలగొట్టి ఆ మాయా అశ్వాన్ని ట్రాయ్‌నగరంలోకి తీసుకువెళ్లి విందులు, వినోదాలతో విజయోత్సవాన్ని జరుపుకుంటారు.

# 9. ట్రాయ్ నగర విధ్వంసం
## (ILUPERSIS - The Sack of Troy)
## (Epic Cycle - 9)

మూలకావ్యంలోని పది పంక్తులు మాత్రమే మిగలగా, కావ్యసంగ్రహం ప్రొక్లస్ రచించిన క్రిస్టొమాథె నుంచి గ్రహింపబడినది. రెండు భాగాలుగా వ్రాయబడిన ఈ కావ్యాన్ని ఆర్కిటినస్ (Arctinus of miletus) రచించినట్లు ప్రచారంలో ఉన్నది.

## కావ్యసంగ్రహం

కోట వెలుపల ఉన్న అద్భుతమైన, బ్రహ్మాండమైన దారుశిల్పపు అశ్వాన్ని ట్రోజన్ ప్రజలు విప్పారిన కళ్లతో వీక్షించారు. ఎక్కడా కనుచూపుమేరలో ఆర్గీవుల అలికిడి లేదు. వాళ్ల శిబిరాలు మంటల్లో మాడి మసైపోతూ కనిపిస్తున్నాయి.

కాసాండ్రా (Cassandra), లావొకూన్ (Laocoon)లు కొయ్యగుర్రం లోపల గ్రీకు సైనికులు దాగి ఉన్నారని హెచ్చరిస్తారు. ఇతరులు అది ఎథెనాకు కానుక అని భ్రమిస్తారు. ఎక్కువమంది తమ విజయానికి బహుమతిగా ఆ మాయా గుర్రాన్ని పరిగణించడంతో సంబరాలు మొదలవుతాయి. అడ్డుపడిన లావొకూన్‌ను పొజిడాన్ దేవుడు పంపిన రెండు భయంకర సర్పాలు అతని కుమారులతో సహా నలిపి చంపివేస్తాయి. అది దుశ్శకునంగా గమనించిన ఎయినీస్ (Aeneas) తన తండ్రి, కుమారులతో సహా ట్రాయ్ నగరాన్ని విడిచి వెళ్లిపోతాడు.

అర్ధరాత్రి అశ్వగర్భంలో నుంచి బయటకు వచ్చిన ఆర్గీవులు కోట తలుపుల్ని తెరవగా, టెనిడాస్ దీవి నుంచి వెనక్కువచ్చిన గ్రీకుసైన్యం ట్రాయ్ నగరాన్ని ధ్వంసం చేసి మంటలకు ఆహుతి చేస్తుంది.

జ్యూస్ దేవుని ఆలయంలో తలదాచుకున్న ప్రియామ్‌రాజును నియోటాలమస్ హతమారుస్తాడు. డియోఫోబిస్‌ను చంపి మెనెలాస్ తన భార్య హెలెన్‌ను దక్కించుకుంటాడు. చిన్న ఆజాక్స్ ఎథెనా దేవాలయంలో కాసాండ్రా (Cassandra)ను బలాత్కరించగా దేవతలు ఆగ్రహం చెంది తిరుగుప్రయాణంలో ఆతనిని సముద్రంలో ముంచివేస్తారు. ఒడెసిస్ శత్రుశేషం మిగలకుండా హెక్టార్ కుమారుడు, పసికూన ఏస్టియానక్స్ (Astyanax)ను కోటపై నుంచి విసిరి చంపివేస్తాడు. నియోటాలమస్ హెక్టార్ భార్య ఏండ్రొమాఖస్‌ను బందీగా బహుమతిగా పట్టుకుంటాడు. గ్రీకులు ఎఖిల్లిస్ సమాధి దగ్గర ప్రియామ్ కుమార్తె పాలిక్జెనాను (Polyxena)ను బలియిచ్చి, పేట్రేగిపోతున్న అతని ఆత్మకు శాంతి కలిగిస్తారు.

# 10. తిరుగు ప్రయాణం
## RETURNS (Nostoi)
## (Epic Cycle-10)

గ్రీకు ఇతిహాసచక్రంలో పదవభాగమైన తిరుగుప్రయాణం (Return-Nostoi) ఎగియాస్ (Agias of Troezen) రచనగా భావించబడ్తున్నది. అయిదు భాగాలుగా వ్రాయబడిన ఈ కావ్యసంగ్రహం ప్రొక్లస్ రచించిన క్రిస్టొమెథె నుంచి గ్రహింపబడినది.

ట్రాయ్‌నగర విధ్వంసం అనంతరం గ్రీకులు తమకు చేజిక్కిన సంపదలను పంచుకుని తిరుగుప్రయాణానికి సిద్ధమైనారు. అంతా సవ్యంగా ఉందనుకున్న సమయంలో ఎథెనె దేవత ఆగమెమ్నాన్, మెనెలాస్ సోదరుల మధ్య కలహాగ్నిని రగిలించింది. ఆమె కోపాన్ని ఉపశమింపజేయడానికి ఆగమెమ్నాన్ ట్రాయ్‌లో ఉండిపోగా డయొమెడిస్, నెస్టర్‌లు తొలి విడత నౌకలలో బయల్దేరినారు మెనెలాస్ ప్రయాణం సముద్రపు ఆటుపోట్లకు గురై అనేక నౌకలు ధ్వంసం కాగా మిగిలిన కేవలం అయిదు నౌకలతో ఈజిప్టు చేరుకుంటాడు. కాల్కాస్, లియొంటిస్, పాలిపొయెటిస్‌లు భూమార్గం ద్వారా కోలోఫోన్ (Colophone) చేరుకుని తమతో వచ్చిన టిరేసియాస్ (Teiresias) మరణించగా అతనిని అక్కడ సమాధి గావిస్తారు.

ఆగమెమ్నాన్ సముద్రమార్గాన వస్తుండగా ఎఖిల్లిస్ ఆత్మ కనపడి అతనిని ఇంటికి వెళ్లవద్దని, ప్రాణప్రమాదము ఉన్నదని హెచ్చరిస్తుంది. కొంతదూరం పోయినాక కాఫెరైడెస్ (Capherides) కొండల వద్ద దేవతలు పంపిన తుఫానులో కాసాండ్రాను బలాత్కరించి ఎథెనె ఆగ్రహానికి గురైన చిన్న అజాక్స్ సముద్రంలో మునిగిపోయి మరణిస్తాడు.

థెటిస్ హెచ్చరికను పాటించి నియొటాలమస్ భూమార్గాన మిగతా ప్రయాణాన్ని కొనసాగిస్తాడు. దారిలో మరణించిన ఫీనిక్స్ (Phoenix)కు అంత్యక్రియలు జరిపి మొలొస్సి (Molossi)లో పెలెయస్‌ను కలుస్తాడు.

ఇంటికి చేరుకున్న ఆగమెమ్నాన్‌ను భార్య క్లైటిమినెస్ట్రా తన ప్రియుడైన ఎగిస్తస్ (Aegisthus)తో కలిసి కుట్ర పన్ని దారుణంగా హతమారుస్తుంది. దానికి ప్రతీకారంగా ఆగమెమ్నాన్ కుమారుడు ఒరెస్టెస్ (Orestes), కుమార్తె ఎలక్ట్రా (Electra)లు తల్లిని, ఆమె ప్రియుణ్ణి చంపి పగ తీర్చుకుంటారు.

మెనెలాస్ ఈజిప్టు నుంచి స్వదేశానికి చేరుకోవడంతో ఈ కావ్యం ముగుస్తుంది.

# 11. ఒడెస్సీ
## (ODYSSEY - Epic Cycle-11)

హోమర్ వ్రాసినట్లుగా చెప్పబడుతున్న ప్రసిద్ధ గ్రీకు కావ్యాలలో ఒడెస్సీ (Odyssey) రెండవది. ఇలియాడ్ (Ilead)కు ఒడెస్సీ రచనలలో ఉన్న వైవిధ్యం, వస్తువర్ణన ఈ రెండు కావ్యాలు వేర్వేరు కవులచే రచింపబడినా హోమర్ పేరుచే ప్రసిద్ధికెక్కాయని విమర్శకుల అభిప్రాయం.

ట్రాయ్ నగర విధ్వంసం తరువాత తిరుగుప్రయాణంలో పదేళ్లపాటు ఒడెసిస్ (యులిసెస్–Ulysses) పడ్డ కష్టనష్టాలు, అవస్థల సమాహారం ఒడెస్సీ మహాకావ్యం. 12110 పంక్తులతో స్త్రీల నిర్ణయాలు ముఖ్య ఘటనలుగా ఈ అద్భుత రచన ప్రపంచ వాఙ్మయ చరిత్రలో – ఒడెస్సీ అంటే చరిత్రాత్మక ప్రయాణంగా ప్రసిద్ధికెక్కింది.

### కావ్య సంగ్రహం

ఒడెసిస్ తనకిష్టంలేని యుద్ధ ప్రయాణానికి అన్యమనస్కంగానే తరలి వెళ్లుతాడు. అప్పటికి అతని కుమారుడు టెలెమాఖస్ (Telemachus) వయస్సు ఒక నెల మాత్రమే. ముప్పదిరోజుల పసిబిడ్డను, అత్యంత ప్రియమైన భార్య పెనెలోప్ (Penelope)ను వదల్లేక వదల్లేక తప్పనిసరై అంతకుముందు మెనెలాస్, హెలెన్‌ల వివాహ సమయంలో చేసిన ఒప్పందం ప్రకారం ట్రాయ్ నగరానికి తన అనుచరులతో బయల్దేరుతాడు. ట్రాయ్ నగర విధ్వంసానికి పదేళ్లు, తరువాత ఇంటికి రావడానికి పదేళ్లు పట్టగా ఈ కథాకాలం నాటికి కుమారుడు టెలిమాఖస్ ఇరవైఏళ్ల నవ యువకుడిగా రూపొందినాడు.

ఇథాకాలో ఒడెసిస్ గృహం పెనెలోప్ పొందుకోరి వచ్చిన 108 మంది యువకుల (The suitors)తో నిండిపోయి ఉన్నది. ఒడెసిస్ జాడలేదు కనుక తమలో ఎవరో ఒకరిని వరించాల్సిందేనని పట్టుబడ్తూ ఆ ఇంట్లోనే తిష్ఠవేసి సుష్టుగా భోంచేస్తూ, వినోద కాలక్షేపం చేస్తూ ఒడెసిస్, పెనెలోప్‌ల ధాన్యాగారాన్ని, పశుసంపదల్ని భక్షించ సాగారు. రోజులు గడిచినకొద్దీ వాళ్ల ఒత్తిడి ఎక్కువైంది. ఒక్కడే టెలిమాఖస్ మాత్రం ఏం చేయగలడు? తగిన అవకాశం కోసం, తండ్రి జాడకోసం ఎదురుతెన్నులు చూస్తున్నాడతడు.

ఒడెసిస్ రక్షాదేవత ఎథెనా (Athene)కు ఆతనిపై జాలి కలుగుతుంది. కాని పొజిడాన్ పడనీయడన్న భయంతో ఆ దేవుడు ఒలింపస్ (Olympus)లో లేని సమయంలో జ్యూస్ (Zeus) దేవుని అనుమతితో ఎథెనా ఒడెసిస్‌కు సాయం చేయడానికి బయల్దేర్తుంది.

టాఫియన్‌ల నాయకుడు మెంటెస్ (Mentes) రూపంలో ఎథెనా టెలెమాఖస్‌ను ఒడెసిస్ కోసం వెదకమని కోరుతుంది. ఇంటిలో పిలవని అతిథులు విందులు గుడుస్తూ ఫెమియస్ (Phemius) గాయకుడు పాడుతున్న పాటలు వింటూ ఆనందిస్తున్నారు. పెనెలోప్ వచ్చి ఆర్గీవుల తిరుగు ప్రయాణాన్ని గానం చేస్తున్న ఫెమియస్‌ను ఆ పాట తన భర్త స్మృతులను గుర్తుతెస్తున్నదని కనుక పాడవద్దని వారిస్తుంది.

ఆ రాత్రి మెంటెస్ రూపంలో ఉన్న ఎథెనా, టెలెమాఖస్ కోసం ఒక నౌకను, నావికుల్ని సిద్ధం చేస్తుంది. మెంటెస్, టెలిమాఖస్‌లు గ్రీకు దేశంలోని పైలాస్‌లో (Pylos) ఉన్న మహావీరుడు నెస్టర్ ఇంటికి వెళతారు. ఆతని ఆతిధ్యాన్ని స్వీకరించి నెస్టర్ కుమారుడిని తీసుకుని స్పార్టా (Sparta) వెళ్లి మెనెలాస్, హెలెన్‌ల ద్వారా ఒడెసిస్ కాలిప్సో (Calypso) ద్వీపంలో ఉన్నట్లు గ్రహిస్తాడు. మెనెలాస్, హెలెన్‌లు తమకు తిరుగు ప్రయాణంలో జరిగిన అనుభవాల్ని వివరిస్తారు. అక్కడే టెలెమాఖస్‌కు ఆగమెమ్నాన్ హత్య గురించి తెలుస్తుంది. మెనెలాస్ తాను ఈజిప్టు నుంచి వస్తున్నపుడు ఫారొస్ (Pharos) ద్వీపంలో నివసిస్తున్న ప్రొటియస్ (Proteus - The sea God) కుమార్తె ఈడొథియా (Eidothea) తనకు ఒడెసిస్ కాలిప్సో దీపంలో ఉన్నట్లు చెప్పిందంటాడు.

అప్పటికే కాలిప్సో ప్రేమలోనూ ద్వీపంలోనూ ఉండి ఏడేళ్లు గడవగా ఒడెసిస్‌కు ఇంటి జ్ఞాపకాలు ఎక్కువయ్యాయి. ఎథెనా అభ్యర్థనను మన్నించి జ్యూస్ (Zeus) దేవుడు పంపగా హెర్మెస్ (Hermes the messenger god) కాలిప్సోను ఒడెసిస్ విడుదలకు ఒప్పిస్తాడు. కొయ్యచెక్కలతో ఒక బల్లకట్టు (Raft) తయారు చేసుకుని కాలిప్సో యిచ్చిన దుస్తులు, వస్తువులతో ఒడెసిస్ మళ్లీ సాగర ప్రయాణం ప్రారంభిస్తాడు. కాని పొజిడాన్ అతడిని గమనించి తీవ్రమైన అలలతో ఆ పడవను ముక్కలు చేయగా ఈదుకుంటూ ఒడెసిస్ స్కెరె (Scherie) ద్వీపాన్ని చేరుకుని సొమ్మసిల్లి పడిపోతాడు. అది ఫెయాసియన్ల (Pheacians) దేశం. అలల ధాటికి అతని వస్తువులు, దుస్తులు అన్నీ నీళ్లపాలు కాగా, నగ్నంగా ఉన్న దేహాన్ని ఆకులతో కప్పుకుని గాఢనిద్రలో మునిగిపోతాడు ఒడెసిస్. తెల్లవారే ఆడపిల్లల కిలకిల నవ్వులతో మేలుకొని ఆ దేశపు రాకుమార్తె నౌసికా (Nausicca) ఇచ్చిన దుస్తులు వేసుకుని ఆమె సలహాతో ఆమె తల్లిదండ్రులు అరెటె (Arete), అల్సినస్ (Alcinous)లను కలుస్తాడు.

ఒడెసిస్ తన పేరు వెల్లడి చేయకుండా, కొన్నాళ్లు గడిపి, యుద్ధవిద్యా ప్రదర్శనలలో పాల్గొని తన కౌశల్యంతో వాళ్లందరినీ అబ్బురపరుస్తాడు. అంధ గాయకుడు డెమొడొకస్ (Demodocus) గానం చేసిన ఒడెసిస్–ఎఖిల్లిస్‌ల తగాదా,

ఏర్స్–ఎఫ్రొడైట్‌ల ప్రేమగాధని విని తన్మయుడై ట్రోజన్ కొయ్యగుర్రం కథ పాడమని అడిగి దానిని వింటూ తన భావావేశాన్ని ఆపుకోలేకపోతాడు. విస్మయంతో వివరాల్ని కోరిన ఫయాసియన్ రాజు ఆల్సినస్‌కు తన నిజనామాన్ని వివరించగా ఆ రాజు ఒడెసిస్‌ను సమాదరించి ఆతని సాహస ప్రయాణ వివరాలను తెలుపమని కోరతాడు.

"సికోనస్ ప్రాంతపు ఇస్మారోస్ (Ismaros of Cicones) వద్ద సముద్రపు దొంగల దాడి నుంచి తప్పించుకున్నాక తాను తన పండ్రెండు నౌకలతో ప్రయాణం సాగించాడు. ఇంతలో చుట్టుముట్టిన భయంకర తుఫాను ధాటికి దారి తప్పి తామరభక్షకుల (Lotus eaters) దేశాన్ని చేరతాడు. అక్కడ్నించీ బయల్దేరి మహాకాయుడు ఒంటికంటి దైత్యుడు సైక్లాప్స్ (Cyclops) పాలిఫెమస్ పాలబడి గుహలో తన అనుచరులతోపాటు బందీ అవుతాడు. అయినా తన చతురోపాయంతో పాలిఫెమస్‌కు తనపేరు నోమాన్ (Noman) అని చెప్పి తన అనుచరుల్ని తిని గుర్రుపెట్టి నిద్రపోతున్న సైక్లాప్స్ కంటిలోకి మండుతున్న కర్ర గుచ్చి అంధుణ్ణి చేసి గొర్రెల పొట్టకింద దాక్కుని తప్పించుకుని తన నౌకలతో పారిపోతాడు. అప్పటికే గర్వం అతిశయించగా తనపేరు ఒడెసిస్, తననెవరూ ఏమీ చేయలేరని బీరాలు పలుకగా, పాలిఫెమస్ తన తండ్రి పొజిడాన్‌కు తనను గాయపరచింది ఒడెసిస్‌గా వెల్లడిస్తాడు. అక్కడ్నించి ఒడెసిస్ ఎయొలస్ (Aeolus) రాజ్యాన్ని చేరుకుంటాడు. ఎయొలస్ ఆతని గాధ విని జాలిపడి ఒక తోలుసంచిలో సముద్రలు గాలుల్ని నిక్షిప్త పరిచి (ఒక పశ్చిమ గాలి తప్ప) బహుమతిగా యిస్తాడు. దానిలో బంగారం ఉందని భ్రమపడిన నావికులు – సముద్రప్రయాణం మధ్యలో ఒడెసిస్ నిద్రపోతుండగా సంచిని తస్కరించి మూత తీస్తారు. అన్ని గాలులూ బయటకు పోయి బ్రహ్మాండమైన తుఫానును సృష్టించగా నౌకలన్నీ వెనక్కిమళ్లి మరల ఎయొలస్ (Aeolus) రాజ్యాన్ని చేరుకుంటాయి.

శాపగ్రస్థులకు సాయం చేయడం అనవసరం అని భావించిన ఎయొలస్ రాజు ఒడెసిస్ అభ్యర్థనను నిరాకరిస్తాడు. ఏం చేయలేని ఒడెసిస్ మరల సముద్ర ప్రయాణం ప్రారంభించి అననుకూల పరిస్థితుల్లో లీస్ట్రోగోనియన్లు (Laestrygonians) అనే నరమాంస భక్షకజాతికి చిక్కుతాడు. ఒడెసిస్ నౌక ఒక్కటి మాత్రం వాళ్లను తప్పించుకోగా సిర్సె (Circe) మంత్రగత్తె ఉండే ప్రాంతాన్ని చేరుకుంటాడు. ఆమె ఆతని అనుచరులు సగం మందిని పందులుగా మారుస్తుంది. అయితే హెర్మెస్ (Hermes) సలహా యివ్వడం వల్ల ఒడెసిస్ సిర్సె మంత్రతంత్రాలకు విరుగుడుగా మొలె (Moly) ఔషధాన్ని సేవించడం చేత ఆమె మందులు ఆతనిపై ప్రభావం చూపించవు. అతని ధైర్యసాహసాలకు ముచ్చటపడ్డ సిర్సె ఆతనిని మోహించి, ఆతని

అనుచరుల్ని నిజరూపుల్ని చేస్తుంది. ఒక సంవత్సరం పాటు వాళ్లు హాయిగా కాలం గడిపి సిర్సె దగ్గర సెలవు తీసుకుని ఇథాకా (Ithaca) బయల్దేరుతారు.

ప్రపంచ పశ్చిమ తీరాన్ని చేరినాక ఒడెసిస్ మృతాత్మలకు బలుల్ని సమర్పించి టిరెసియస్ ఆత్మను రావించి సలహా పొందుతాడు. అతని తల్లి ఆత్మ ప్రత్యక్షమై ఒడెసిస్ ఇంటి సంగతులు, అతని భార్య పెనెలోప్‌ను వరులు (The suitors) పెడ్తున్న బాధలు వివరిస్తుంది. ఇంకా అనేకమంది స్త్రీలు, పురుషుల ఆత్మలు అతనికి ప్రత్యక్షమవుతాయి. ఆగమెమ్నాన్ ఆత్మ తను ఎలా తన భార్య క్లైటిమెనెస్ట్రా చేతిలో హతమయ్యిందీ వివరిస్తుంది.

తిరిగి సిర్సె ద్వీపానికి చేరుకుని ఆమె సలహా అడుగుతాడు ఒడెసిస్. మరల ప్రయాణంలో సైరన్ల (Sirens) నుంచి తప్పించుకుని ఆరు తలల స్కిల్లా (Scylla) భయంకర సుడిగుండం చారిబ్డిస్ (Charybdis) మధ్య నుంచి అతికష్టంతో తప్పించుకుని త్రినాసియా (Thrinacia) చేరుకుంటారు. అక్కడ ఒడెసిస్ అనుచరులు టిరెసియాస్, సిర్సెల హెచ్చరికను పాటించకుండా హెలియాస్ (Helios) సూర్యదేవుని పశువుల్ని వేటాడి భుజిస్తారు. ఆ అపరాధానికి శిక్షగా వారి నౌక సముద్రంలో మునగగా ఒడెసిస్ మినహా మిగతా అందరూ మునిగి చనిపోతారు. చచ్చీచెడి కాలిప్సో (Calypso) ద్వీపానికి చేరుకున్న ఒడెసిస్ ఏడేళ్లు ఆమెతో కాలం గడిపి ఎథెనె దేవత అనుగ్రహంతో విడుదలై ఇథాకా వేపు మరలుతాడు"

ఈ కథంతా విన్న ఫెయాసియన్లు ఒడెసిస్‌కు సాయం చేయడానికి పూనుకుని తమ నౌకలో ఓ అర్ధరాత్రి ఇథాకా తీరంలో విడిచి వెళ్తారు. అక్కణ్ణించి తన పందుల కాపరి యుమియస్ (Eumaeus)ను కలిసి ఒక కల్పిత కథను అక్కడున్న వారందరికీ చెబుతాడు. తాను క్రెటె (Crete) ద్వీపం నుంచి అనుచరులతో ట్రోజన్ యుద్ధంలో గ్రీకుల తరపున పాల్గొన్నానని యుద్ధానంతరం ఈజిప్టు రాజు కొలువులో ఏడేళ్లు గడిపి దారిలో నౌక ధ్వంసం కాగా థెస్ప్రొటియా (Thesprotia) నౌకాశ్రయం నుంచి ఇథాకా వచ్చానని చెబుతాడు.

ఈలోగా స్పార్టా నుంచి బయల్దేరిన టెలెమాఖస్ (Telemachus) పెనెలోప్‌ను కాంక్షిస్తున్న వరులు తనను మట్టుపెట్టడానికి పెట్టిన కుట్ర నుంచి తప్పించుకుని ఇథాకా తీరం చేరి తనుకూడా నమ్మకస్థుడైన యుమియస్ (Eumaeus) దగ్గరకు వస్తాడు. ఒడెసిస్ టెలిమాఖస్‌కు తన నిజరూపాన్ని వృత్తాంతాన్ని వివరించగా తండ్రీకొడుకులు ఒకరినొకరు గౌరవించుకుని ఆనందిస్తారు. అయినా యుమియస్‌కు ఆ బాటసారి తన యజమాని ఒడెసిస్‌గా తెలియనివ్వరు. ఎథెనా దయవల్ల ఒడెసిస్‌కు ఊళ్లుతిరిగి అడుక్కునేవాడి మాదిరిగా మారువేషంలో ఉండటం సాధ్యమయ్యింది.

పెనెలొప్‌ను ప్రలోభపెడ్తున్నవాళ్లను (The suitors) చంపివేయాలనే నిశ్చయానికి తండ్రీకొడుకులు వచ్చాక టెలిమాఖస్ ఇంటికి వెళతాడు. తరువాత యుమియస్‌తో కలిసి ఒడెసిస్ తన ఇంటికి వెళ్లి ఆ వరుల దుష్ప్రవర్తనను గమనిస్తాడు. పెనెలోప్‌ను కలిసి తను క్రెటె ద్వీపవాసిగా, ఒడెసిస్‌ను ఒకసారి కలిసినట్లు చెప్పి ఆతనింకా బతికే ఉన్నాడు త్వరలో వస్తాడని చెబుతాడు.

టెలెమాఖస్ సలహాతో ఆతడు అందరితో కలిసి విందులో పాల్గొంటాడు. ఆతనిని స్నానం చేయిస్తూ ఇంటి పనిమనిషి యూరికియా ఆతని కుడితొడపై గాయాన్ని చూసి ఒడెసిస్‌ను గుర్తుపడ్తుంది. ఆ గాయం అడివిపంది చేయగా ఏర్పడినది. ఎప్పుడో పార్నాసస్ (Parnassus) పర్వతాలవద్ద ఆటొలైకస్ (Autolycus) కుమారులిద్దరితో వేటకు పోయినప్పుడు జరిగిన సంఘటన. యూరిక్లియాను పెనెలోప్‌కు ఈ విషయం చెప్పవద్దని హెచ్చరించి వెళతాడు ఒడెసిస్.

మరుసటిరోజు ఎథెనా సలహాతో పెనెలోప్ ఒక బలపరీక్ష పెడుతుంది. తనను కాంక్షిస్తున్న వరులు (The Suitors) ఒడెసిస్ విల్లును ఎక్కుపెట్టి దూరంగా ఉన్న పండ్రెండు గొడ్డళ్ల రంధ్రాల గుండా పోయేట్టు బాణాన్ని వదలాలి. ఎవరైతే అలా చేస్తారో వారినే తాను వరిస్తాను అని చెబుతుంది. వాళ్లు అందరూ ఓడిపోయి తలదించుకోవడంతో ఒడెసిస్ తానూ పాల్గొని సఫలుడవుతాడు.

ఒడెసిస్ తన నిజరూపాన్ని వెల్లడించి ఎథెనా, యుమియస్, టెలిమేఖస్, ఫిలొటియస్ గోవుల కాపరిల సాయంతో పెనెలోప్‌ను కాంక్షించిన వరుల్నీ, వారికి సర్వసౌఖ్యా లందిస్తూ పెనెలోప్‌ను తిరస్కరించిన పరిచారికలు పండ్రెండు మందినీ చంపేస్తారు. ఒడెసిస్‌ను వేళాకోళం చేసిన గొర్రెలకాపరి మెలాంథియస్‌ను (Melanthius)ను చిత్రహింసల పాల్జేసి మరీ చంపుతారు.

పెనెలోప్ ఒడెసిస్‌లు ఒకరినొకరు గుర్తించినా ఆమె తన సందేహాల్ని నివృత్తి చేయమని అడుగుతుంది. అన్ని ప్రశ్నలకూ సరైన సమాధానాల్నిచ్చి 'ఒడెసిస్' తమ పడకమంచం ఇంకా నేలలోనే నాటుకుని ఉన్న ఆలివ్ వృక్షపు మొదలుతో తాను స్వయంగా చేసిందని వివరించగా పెనెలోప్ ఆనందభరితురాలై భర్తను కౌగలించుకుని ఆనందబాష్పాలు రాలుస్తుంది.

మరుసటిరోజు ఒడెసిస్, టెలెమాఖస్‌తో కలిసి తన తండ్రి లియర్టెస్ (Laertes) ఉన్న పొలం చేరుకుని, తండ్రి తనకిచ్చిన పండ్లతోట గురించి సవివరంగా వివరించి గుర్తింపబడి ఆతని ఆశీస్సులు పొందుతాడు.

ఇథాకా ప్రజలు తమ పిల్లల మృతికి ఆగ్రహం చెంది ఒడెసిస్‌పై పగ తీర్చుకునేందుకు వెంబడిస్తారు. ఒడెసిస్ తనతో యుద్ధానికి తీసుకునివెళ్లిన సైనికుల్లో

ఒక్కడూ తిరిగి రాలేదు. ఇక్కడున్న అనేకమంది యువకుల్నీ చంపి రెండు తరాల మనుషుల్ని నిర్మూలనం చేసిన వాడిగా ఆతనిని నిందిస్తారు. ఇరుపక్షాలు ఒకర్నొకరు చంపుకునే సమయంలో ఎథెనె దేవత వాళ్లను శాంతపరుస్తుంది.

అయినా ఒడెసిస్‌ను దేవతలు కరుణించలేదు. వాళ్ల నిర్ణయం వేరుగా ఉంది. ఆతడు సముద్రం అన్నా, పడవ తెడ్డు అన్నా కూడా తెలియని ప్రదేశంలోకి సంచరించాలి. అక్కడ దేవతలకు ఓ ఆలయాన్ని నిర్మించి బలుల్నిచ్చి సంతుష్టపరచాలి. అప్పుడే ఆతని దీర్ఘప్రయాణం ముగిసి స్వంత ఇంటిలో సుఖంగా కాలం గడప గలుగుతాడు.

# 12. టెలెగొని
## (TELEGONY - Epic Cycle - 12)

టెలిగొని కావ్యం ఇతిహాసచక్రం (Epic Cycle)లో చివరిది. ఒడెసిస్, సిర్సెల ప్రణయఫలం టెలిగొనస్ (Telegonus - born far away) తండ్రిని వెదుకుతూ రావడం, అనుకోని పరిస్థితులలో తండ్రీకొడుకుల మధ్య జరిగిన పోట్లాట విషాదాంతం కావడం ఈ కావ్యవృత్తాంతం. సినెథాన్ (Cinaethon) లేదా యూగమ్మాన్‌ను (Eugammon) ఈ కావ్యకర్తగా భావిస్తున్నారు. మూలకావ్యంలోని రెండు పంక్తులు మాత్రమే ఇప్పుడు లభ్యమవుతున్నా ప్రొక్లస్ వ్రాసిన 'క్రిస్టొమాథె' నుంచి టెలెగొని కథను స్వీకరించినారు. రెండు భాగాలుగా – థెస్‌ప్రొటిస్ (Thesprotis), టెలెగొనిగా (Telegony) ఉన్న ఈ కావ్యం క్రీస్తుపూర్వం 631లో రచింపబడినదిగా భావిస్తున్నారు.

## కావ్యసంగ్రహం

ఒడెసిస్ తన కుమారుడు టెలిమాఖస్‌తో కలిసి తన గృహాన్ని, సంపదలను అనుభవిస్తూ తన భార్య పెనెలోప్‌ను కాంక్షిస్తున్న వరులను (The Suitors)ను చంపివేశాక, అతనికి, ఆగ్రహం చెందిన ఇథాకా ప్రజలకు మధ్య ఎథెనా దేవత మధ్యవర్తిత్వంతో శాంతి ఒప్పందం కుదుర్తుంది. మృతులకు అంత్యక్రియలు జరిగాక బలులు, శాంతిక్రియలు జరిపి ఒడెసిస్ పరిశుద్ధుడౌతాడు. ఆ తరువాత ఎలిస్ (Elis) ప్రాంతానికి వెళ్లిన ఒడెసిస్ పాలిక్జెనాస్ (Polyxenos) అనే అతణ్ణి కలుస్తాడు. ఆతడు ట్రొఫొనియస్ (Trophonius) జీవితచరిత్ర చిత్రించబడిన పాత్రను కానుకగా ఇస్తాడు. (ట్రొఫొనియస్, ఆగమెడిస్‌లు (Agamedes) - ఎర్గినస్ (Erginus) కుమారులు. వాళ్లిద్దరు డెల్ఫిలో (Delphi)లో అపోలో (Apollo)కు దేవాలయాన్ని నిర్మిస్తారు. దేవతలు సంతుష్టులై వారికి అమరత్వాన్నిస్తారు. వారి కథ నుంచే "దేవతలకిష్టమైనవారు పసితనంలోనే మరణిస్తారు – those whom Gods love die young" అన్న నానుడి వచ్చిందంటారు) ఒడెసిస్ ఇథాకాకు తిరిగి వచ్చి టిరెసియాస్ (Tiresias) జ్ఞాని సలహా ప్రకారం థెస్‌ప్రొషియా (Thesprotia)కు వెళ్లి దేవతలకు ఆలయాన్ని నిర్మించి బలులిచ్చి సంతృప్తి పరుస్తాడు. అక్కడ థెస్‌ప్రొషియన్ రాణి కల్లిడికె (Kallidike)ను వివాహమాడగా వారికి పాలిపొయెటిస్ (Polypoites) జన్మిస్తాడు. ఆ తరువాత థెస్‌ప్రొషియన్లకు, బ్రిగోయి (Brygoi) రాజ్యం మధ్య జరిగిన యుద్ధంలో కల్లిడికె మరణిస్తుంది. కుమారుడు పాలిపొయెటిస్‌ను రాజుగా పట్టాభిషేకం జరిపించి ఒడెసిస్ ఇథాకాకు మరలివస్తాడు.

అక్కడ ఎయియా (Aeaea) ద్వీపంలో సిర్సె (Circe)కు జన్మించిన పుత్రునికి 'టెలెగోనస్' (Telegonus - Born far away) అన్న పేరు పెట్టింది. ఎథెనా సలహాతో

ఆతనికి తండ్రి ఒడెసిస్ పుట్టుపూర్వోత్తరాలు చెప్పగా ఆతడు తండ్రిని కలవడానికి ఉవ్విళ్లూరుతాడు. 'సిర్సె' అతనికి విషకిరణాలు అమర్చిన బల్లేన్ని కానుకగా ఇచ్చి ఇథాకాకు పంపుతుంది. నౌకాప్రమాదం జరిగి ఇథాకా తీరం చేరుకున్న టెలెగోనస్ అక్కడ దగ్గరలో ఉన్న పశువుల్ని దొంగిలిస్తాడు. ఆ పశువుల యజమాని అడ్డగించగా ఇద్దరి మధ్య తీవ్రమైన పోరు జరుగుతుంది. తన బల్లెంతో టెలిగోనస్ ఆతనిని పొడవగా విషకిరణాల తాకిడికి గాయపడి మరణావస్థలోకి చేరుకున్నపుడు జరిగిన సంభాషణలో ఇద్దరూ ఒకర్నొకరు గుర్తిస్తారు. ఆవేదనతో టెలెగోనస్ దుఃఖపడ్తున్నప్పుడు ఒడెసిస్ తనకు టిరెసియాస్ చెప్పిన జోస్యం వివరించి ఇది దేవతల అనుజ్ఞతోనే జరిగింది. బాధపడవద్దని అనునయిస్తాడు. (తనకు వృద్ధాప్యంలో సునాయాస మరణం (gentle death) వస్తుందన్నదే జోస్యం) ఒడెసిస్ మృతదేహాన్ని తీసుకుని టెలెమాఖస్, పెనెలోపేలతో పాటు ఎయియా (Aeaea) ద్వీపానికి వచ్చి తల్లి 'సిర్సె'కు అప్పగిస్తాడు టెలెగోనస్. ఒడెసిస్ దేహానికి దహన క్రియలు జరిగాక 'సిర్సె' తన మంత్రశక్తితో అందరినీ అమరుల్ని గావిస్తుంది.

# గ్రీకు దేవతలు

# అయిదు యుగాలు - హెసియాడ్

## Five Ages by Hesiod

గ్రీకు కవి హెసియాడ్ తన Works & Daysలో వర్ణించిన...

**1) స్వర్ణయుగం (Golden Age) :** క్రోనస్ పరిపాలనాకాలం. దేవతలు, మానవులు కలిసి సంచరించిన కాలమిది. శాంతి, సామరస్యాలు వెల్లివిరిసి, పని, శ్రమ అవసరంలేని కాలం. సమృద్ధిగా ఆహారం లభ్యమయ్యేది. చనిపోయాక వీరు దివ్యాత్మలై (Daemons - Knowing or wise) సంచరిస్తారు.

**2) రజత యుగం (Silver Age) :** జ్యూస్ దేవుని పరిపాలనా యుగం. పసిపాపలుగా వందేళ్లు జీవించి, పెద్దవాళ్లు కాగానే ఒకరితో ఒకరు కలహించి అంతమయ్యేవారు వీరిని Blessed Spirits – పవిత్రాత్మలనేవారు.

**3) కంచు యుగం (Bronze Age) :** యుద్ధమే ప్రధానలక్ష్యం. హేడ్స్ పాతాళంలోకి మరణానంతరం ప్రేతాత్మలుగా నెట్టివేయబడ్డారు. డ్యుకాలియన్ కాలం నాటి వరదతో ఈ యుగ సమాప్తి అవుతుంది.

**4) హీరోల యుగం (Heroic Age) :** దైవాంశ సంభూతులైన మానవులు, సాధారణ మానవులతో కలిసి సంచరించే యుగం. యుద్ధాల్లో మరణించిన వీరులు ఎలిసియం (Elysium) వీర స్వర్గానికి చేరతారు.

**5) ఇనుప యుగం (Iron Age) :** కష్టాలు, శారీరక శ్రమతో కూడిన యుగం. పిల్లలు తల్లిదండ్రులను గౌరవించరు. అన్నదమ్ములు కలహిస్తారు. అతిథి మర్యాదలు మృగ్యమవుతాయి. బలవంతుడే రాజు. అసత్యానికి పీట. తప్పుచేసినందుకు వ్యక్తులు సిగ్గుపడరు. పసిపాపలు తెల్లజుట్టుతో పుడతారు. దేవతలకు మానవులపై నమ్మకం నశిస్తుంది.

సెయింట్ జెరొమ్ (1710 - 1674 B.C. - The Golden Age); (1674-1628 B.C. - Silver Age); (1628-1472 B.C. - Bronze Age); (1460 - 1103 B.C. - Heroic Age); (1100 B.C. - Present after - Iron age) గా పేర్కొన్నాడు.

ఓవిడ్ (Ovid) కాలాన్ని 1) స్వర్ణయుగం (నౌకాయానం తెలియని రోజులు, 2) రజత యుగం – ఋతువులు, వ్యవసాయం, వాస్తుకళ అభివృద్ధి చెందిన రోజులు, 3) కంచు యుగం – యుద్ధ ప్రాధాన్యత, 4) ఇనుపయుగం – సరిహద్దులున్న రాజ్యాల ఏర్పాటు; నౌకాయానం, గనుల త్వకాలు, ప్రజలలో ఈర్ష్యాద్వేషాలు మెండుగా ఉంటాయి. ఒకరిపై ఒకరికి గౌరవం ఉండదు. భక్తిభావం నశిస్తుంది – గా విభజించాడు.

# 1. ఆదిదేవతలు
## (PROTOGENOI)

- కేయాస్ (Chaos=Void) = శూన్యం (gap abyss)
    - ఫేన్స్ (Phanes or Himeros or Eros elder of the first born) = ఆదిదేవుడు; సంతానాధిపతి; కాముడు)
    - ఫ్యూసిస్ (Phusis =Nature =ప్రకృతి or Thesis = సృష్టిదేవత)
    - ఎరిబోస్ (Erebos=mist of darkness = చీకటి ముసురు లేదా సంజె చీకటి దేవుడు.
    - ఈథర్ (Aether) = mists of light = సంజె వెలుగుల దేవుడు
    - థలాస్సా (Thalassa) = Sea surface = సముద్రపు ఉపరితల దేవత
    - హెమెరా (Hemera=Day=పగలు దేవత)
    - నిక్స్ (Nyx=Night=రాత్రి దేవత)
- ఎనాంకె (Ananke=inevitability= విధి దేవత)
- క్రోనాస్ (Time=కాలదేవుడు)
- గెయియా (Gaia=Earth=భూదేవత)
    - ఒయురియా (Ouerea=Mountains=పర్వతదేవుడు)
    - నెసొయి (Nesoi=Islands=ద్వీపాధిదేవత)
    - యురేనస్ (Uranus=Heaven=ఆకాశదేవుడు)
    - టెథెస్ (Tethys=fresh water=మంచినీటి దేవత)
    - ఓసియేనస్ (Oceanus or water = నీటి దేవుడు)
    - పొంటాస్ (Pontos) = water; The Seas = నీటి దేవుడు
    - టార్టారస్ (Tartaros) = పాతాళ అధిదేవుడు

దైవసృష్టి కొన్ని మార్పులతో మిగిలిన ఇతిహాసాలలో కానవస్తుంది. ఇలియాడ్ (Homer-700-600 B.C.) ప్రకారం ఓసియానస్ (Oceanus) ప్రథమ దేవుడు. హెసియాడ్ (Hesiod) (700 B.C.)లో కేయాస్ (Chaos) నుంచి నిక్స్, గెయియా, టార్టారస్, ఎరాస్‌లు తమకు తామే (స్వయంభువులు) జన్మించారని వారి తరువాతి తరం ఎరిబస్, పాంటస్, ఒయిరియా,టైటాన్లు (దైత్యులు), ఈథర్ (Aether)లు. ఆల్క్‌మాన్ (Alcman) ప్రకారం నీటిదేవత (అప్సరస) థెటిస్ (Thetis) ఆదిదేవత.

ఆమె పొరాస్ (Poras=path=దారి); టెక్‌మార్ (Tekmor=Marker=చిహ్నం); స్కోటాస్ (Scotos=darkness=చీకటి)లను దారీతెన్నూ తెలియని కేయాస్ (Chaos=Void = శూన్యం) నుంచి సృజించిందంటారు.

ఆర్ఫిక్ సంప్రదాయం (Orphic«530 B.C.)లో నిక్స్ (Nyx) ఆదిదేవత. బ్రహ్మాండం (Comsmic egg) నుంచి ఫేన్స్ (Phanes) అనబడిన కామదేవుడు, కాంతిదేవుడు (Deity of light and procretation) సృష్టింపబడినారు. అరిస్టొఫేనిస్ (456-386 B.C.) తన పక్షులు (Birds) గ్రంథంలో నిక్స్ (Nyx) పక్షి (Night bird) గుడ్డు నుంచి ఎరాస్ (Eros=కాముడు) సృష్టింపబడినాడు – అని వ్రాసినాడు.

ఫెరిసైడిస్ (Pherecydes of Syros = 600-550 B.C.), కాలుడు (Time = కాలం) ఆదిదేవుడు. ఎంపిడోక్లిస్ (Empedocles=490-430 B.C.) ఎఫ్రొడైట్ (ప్రేమదేవత); ఏర్స్ (యుద్ధదేవత)లను ఆదిదేవతలుగా భావించినాడు. ప్లాటో (360 B.C.) సిద్ధాంతం ప్రకారం మొదట్లో మోనాడ్ (Monad=ఆద్యుడు) అన్నిటికి తొలిదేవుడు. అతని నుంచి డెమిఅర్జ్ (Demiurge=Consciousness= స్పృహ), ఆ కోరిక నుంచి సమస్త ప్రపంచాలు ఉద్భవించాయి.

# 2. దైత్యులు
# (TITANS)

స్వర్ణయుగంలో (Golden age) విశ్వాన్ని పరిపాలించిన టైటాన్లు గెయియా, యురేనస్‌ల సంతానం. వీరిలో మొదటితరం (First Generation Titans)-

1) ఓసియేనస్ (Oceanus)
2) హైపరియాన్ (Hyperion)
3) కోయియస్ (Coeus)
4) క్రోనస్ (Cronus)
5) క్రియస్ (Crius)
6) లాపెటస్ (Lapetus) లు దేవుళ్లు కాగా
7) నెమొసినె (Mnemosyne)
8) టెథిస్ (Tethys)
9) థియా (Theia)
10) ఫొయెబె (Phoebe)
11) రియా (Rhea)
12) థెమిస్ (Themis)లు దేవతలు

రెండవతరం దైత్యులు (Second generation Titans)

**హైపరియాన్ సంతానం :**

1) ఇవాస్ (Eos), 2) హెలియాన్ (Helios), 3) సెలెనె (Selene)

**కోయియస్** (Coeus) **కుమార్తెలు :**

4) లెటొ (Leto), 5) ఏస్టరియా (Asteria)

**లాపెటస్ పుత్రులు :**

6) అట్లాస్ (Atlas), 7) ప్రొమెథియస్ (Prometheus),
8) ఎపిమెథియస్ (Epimetheus), 9) మెనొషియస్ (Menoetius)

**క్రియస్** (Crius) **కుమారులు :**

10) ఏస్ట్రయిస్ (Astraeus), 11) పల్లాస్ (Pallas),
12) పెర్సెస్ (Perses).

# 3. ద్వాదశ ఒలింపిక్ దేవతలు
## (TWELVE OLYMPIANS = DODEKATHON)

1) జ్యూస్ (Zeus) (Deos)
2) హెరా (Hera)
3) పొజిడాన్ (Poseidon)
4) డిమేటర్ (Demeter)
5) ఎథెనా (Athena)
6) డయొనెసస్ (Dionysus)
7) అపొలో (Apollo)
8) ఆర్టెమిస్ (Artemis)
9) ఏర్స్ (Ares)
10) ఎఫ్రొడైట్ (Aphrodite)
11) హెఫాస్టిస్ (Hephaestus)
12) హెర్మెస్ (Hermes)

**1. జ్యూస్ (Zeus=Jupiter) :** దేవతలకు రాజు. ఒలింపస్ పర్వతాధిపతి ఆకాశానికి ఉరుములకు అధిదేవత. క్రోనాస్, రియా దైత్యుల చివరిపుత్రుడు. పిడుగు, గ్రద్ద, ఓక్‌వృక్షం, రాజదండం, తుల ఈతని చిహ్నాలు. భార్య హెరా. అనేకమంది ప్రియురాళ్లు.

**2. హెరా (Hera=Juno) :** దేవతల రాణి. వివాహానికి, మాతృత్వానికి అధిదేవత. నెమలి, దానిమ్మ, కిరీటం, కోయిల, సింహం, ధేనువు చిహ్నాలు. క్రోనాస్, రియాల కనిష్ఠ పుత్రిక. జ్యూస్‌కు భార్య. జ్యూస్ ప్రియురాండ్లు, వాళ్ల సంతానంతో పగ, విరోధం.

**3. పొజిడాన్ (Poseidon=Neptune) :** సముద్రాలకధిపతి. భూకంపాలకు, అశ్వాలకు దేవుడు. గుర్రం, ఎద్దు, డాల్ఫిన్, త్రిశూలం చిహ్నాలు. క్రోనస్, రియాల కుమారుడు. ఏంఫిట్రైట్ ఈతని భార్య.

**4. డయొనైసస్ (Dionysus=Bacchus) :** మధువుకు, ఉత్సవాలకు, ఆనందానికి అధిదేవుడు. నాటకరంగానికి దేవుడు. ద్రాక్షతీగె, ఐవి (Ivy), పాత్ర, పులి, చిరుతపులి, డాల్ఫిన్, మేక చిహ్నాలు. జ్యూస్‌కు ధెబెన్ మానవకన్య

సెమెలె (Semele)ల సంతానం. క్రెటి రాకుమార్తె ఎరియాడ్నె (Ariadne) ఈతని భార్య. ఒలింపయన్లలో మానవస్త్రీకి జన్మించినవాడీతడొక్కడే.

**5. అపొలొ (Apollo) :** వెలుగుకు, సంగీతానికి, కవిత్వానికి, ధనుర్విద్యకు అధిపతి. సూర్యుడు, వీణ, విల్లమ్ములు, కాకి, డాల్ఫిన్, తోడేలు, హంస, ఎలుక చిహ్నాలు. జ్యూస్, లెటోల కనిష్ఠ సంతానం ఇతడు.

**6. ఆర్టెమిస్ (Artemis=Diana) :** వేట, విలువిద్య, జంతువులు, కన్యాత్వానికి అధిదేవత. చంద్రుడు, లేడి, వేటకుక్క, ఆడ ఎలుగుబంటి, పాము, సైప్రస్ వృక్షం, విల్లమ్ములు చిహ్నాలు. అపొలోకు కవల సోదరి. జ్యూస్, లెటొల సంతానం.

**7. హెర్మెస్ (Hermes=Mercury) :** దేవతల వార్తాహరుడు. వ్యాపారానికి, దొంగలకు దేవుడు. కాడ్యుసియస్ (Caduceus– రెండు సర్పాలు పెనవేసుకున్న దండం), రెక్కల చెప్పులు, టోపి, కొంగ, తాబేలు చిహ్నాలు (తాబేలు పై డిప్పతో వీణ (Lyre)ను కనుక్కున్నాడని ప్రతీతి). జ్యూస్, అప్సరస మైయా (Maia) ల సంతానం. డ్రయోప్ (Dryope) ఈతని భార్య. డ్రయోప్స్ ఈతని కుమార్తె. కుమారుడు పాన్ (Pan) ప్రకృతికి అధిపతి. గాయకుల దేవుడు. పాన్‌పైప్స్‌ను తయారుచేసినాడు. డయొనెసిస్‌కు చెలికాడు.

**8. ఎథెనా (Athena=Minerva) :** జ్ఞానానికి, హస్తకళలు, రక్షణ, యుద్ధ తంత్రానికి అధిదేవత. ఈగిస్ (Aegis = జ్యూస్ వాడే డాలు), గుడ్లగూబ, ఆలివ్‌చెట్టు, పాము, సాలీడు చిహ్నాలు; జ్యూస్, మెటిస్‌ల సంతానం. తండ్రి తలనుంచి కవచసహితంగా జన్మించిందని ప్రతీతి.

**9. ఏర్స్ (Ares-Mars) :** యుద్ధానికి, హింస, రక్తతర్పణానికి అధిదేవుడు. అడవి పంది, సర్పం, కుక్క, రాబందు, బల్లెం, డాలు చిహ్నాలు. జ్యూస్, హెరాల పుత్రుడు. అందరి దేవతలకు అయిష్టుడు.

**10. ఎఫ్రొడైట్ (Aphrodite=Venus) :** ప్రేమకు, అందానికి, కోరికకు అధిదేవత. పావురం, ఏపిల్, తేనెటీగ, హంస, మిర్టిల్, గులాబి, గవ్వలు చిహ్నాలు. జ్యూస్, డయొనెల కుమార్తెగా, యురేనస్ రక్తం సముద్రంలో పడగా జన్మించినట్లుగా చెబుతారు. హెఫాస్టస్‌కు భార్య అయినా అనేకమందితో ప్రేమాయణం నడిపిందని ప్రతీతి.

**11. హెఫాస్టస్ (Hephaestus=Vulcan) :** విశ్వకర్మ, దేవశిల్పి. కొలిమికి, మంటలకు అధిపతి. అగ్ని, ఏన్విల్ (Anvil), గొడ్డలి, గాడిద, సుత్తి, పట్టకారు,

ఈక చిహ్నాలు. తల్లిదండ్రులు హెరా, జ్యూస్‌లు ఒలింపస్ నుంచి విసిరివేయగా లెమ్నాస్ (Lemnos) ద్వీపంలో పడి కుంటివాడైనాడు. ఎఫ్రొడైట్ ఈతని భార్య.

**12. డిమిటర్ (Demeter = Ceres) :** వ్యవసాయం, పునరుత్పత్తి, ప్రకృతి, కాలాలకు అధిదేవత. గోధుమ, గంజాయి, పంది, పాములు చిహ్నాలు. క్రోనస్, రియాల కుమార్తె.

## మరికొందరు ఒలింపియన్ దేవతలు

1. **హేడ్స్ (Hades = Pluto) :** పాతాళాధిపతి. భూగర్భనిధుల దేవుడు. (Pluto = The rich one) ఎక్కువకాలం పాతాళలోకంలో గడుపుతాడు కనుక ద్వాదశ ఒలింపియన్లలో ఒకడిగా లెక్కించరు.

2. **హెస్టియా (Hestia = Vestia) :** కుటుంబానికి, వంటయింటికి అధిదేవత. డయొనెసిస్‌కు తన స్థానాన్నిచ్చి ఒలింపియన్లలో కలహాలు రాకుండా చేసిందని ప్రతీతి.

3. **ఏస్క్లీపియస్ (Asclepius=Vediovis) :** దేవవైద్యుడు, ధన్వంతరి. ఇతని కుమార్తెలు – హైజియా (Hygiea); లాసో (Laso=Medicine) ఎక్సెసో (Aceso=healing); ఎగ్లియా (Aglia=Healthyglow); పనాసియా (Panacea=Universal remedy).

4. **ఎరాస్ (Eros=Cupid) :** కామదేవత. అందానికి, శృంగారానికి ఆధిదేవుడు.

5. **హెబె (Hebe =Juventas) :** జ్యూస్ హెరాల కుమార్తె. ఒలింపియన్లకు మధువునందించే దేవత. తేనె+పుప్పొడిల నెక్టార్‌ను, అమృతాన్ని (Ambrosia) అందిస్తుంది. హెరాక్లిస్‌కు భార్య.

6. **హెరాక్లిస్ (Heracles=Hercules) :** జ్యూస్, ఆల్కెమెనె (Zeus = Alcemene) ల కుమారుడు. ఏంఫిట్రయాన్ పెంపుడు కుమారుడు. పెర్సియస్ (Perseus)కు మునిమనమడు. గ్రీకువీరులలో అగ్రగణ్యుడు.

7. **పాన్ (Pan=Faunaus) :** పశువుల మందలకు, కాపర్లకు దేవుడు. అడవి జంతువులకు, విచ్చలవిడితనానికి, జానపద సంగీతానికి అధిదేవుడు. అప్సరస (Nymph)లకు సహచరుడు.

8. **పెర్సెఫోన్ (Persephone=Proserpina) :** పాతాళలోకపు రాణి. జ్యూస్ డిమిటర్ల కుమార్తె. హేడ్స్‌కు భార్య.

# ఇతర దేవతలు

1) ఎయొలస్ (Aeolus) = వాయుదేవుడు
2) ఏంఫిట్రైట్ (Amphitrite) = సముద్రదేవత. పొజిడాన్ భార్య.
3) ఏనిమొయి (Anemoi) చిరుగాలులు (Boreas=North wind; Notus= South wind; Zephyrus=West wind; Eurus=East wind)
4) ఆరా (Aura) = చల్లని గాలి (Goddess of cool breeze & fresh air)
5) బైయా (Bia) = హింస (Personification of Violence)
6) సిర్సె (Circe) = మంత్రాధిదేవత (Goddess of Magic)
7) క్రెటాస్ (Kratos) = శక్తిదేవత (Goddess of power)
8) డీమాస్ (Deimos) = భీభత్సదేవుడు (God of Terror)
9) డయొనె (Dione) = సముద్రదేవత (ఎఫ్రొడైట్ తల్లి)
10) ఎలిథియియా (Eileithyia) = శిశు జననానికి అధిదేవత (జ్యూస్, హెరాల కుమార్తె)
11) ఎన్యో (Enyo) = యుద్ధానికి అధిదేవత, ఏర్స్‌కు సహచరి.
12) ఇవాస్ (Eos) = సంధ్యాదేవత (Dawn)
13) ఎరిస్ (Eris) = విభేద దేవత (Goddess of discord)
14) గనెమెడె (Ganymede) = ఒలింపస్ దేవతల మధుపాత్రల అధిపతి (Cupbearer)
15) గ్రేసెస్ (Graces) = సౌందర్యాధిదేవతలు. ఎఫ్రొడైట్, హెరాల చెలికత్తెలు.
16) హార్మొనియా (Harmonia) = సామరస్యానికి అధిదేవుడు
17) హెకాటె (Hecate) = మంత్రగత్తెలకు, ఇంద్రజాలానికి, కూడలికి అధిదేవత.
18) హొరె (Horae) = ఒలింపస్ సంరక్షకులు
19) హిప్నాస్ (Hypnos) = నిద్రకు దేవుడు.
20) ఐరిస్ (Iris) = ఇంద్రధనుస్సు (Rainbow), ఒలింపస్ వార్తాహరురాలు.
21) జానస్ (Janus)= ద్వారాలకు, ఆద్యంతాలకు, ఇష్టాలకు అధిదేవుడు.
22) లెటో (Leto) = దైత్యురాలు (Titaness). అపోలొ, ఆర్టెమిస్‌ల తల్లి.
23) మెయిరాయి (Moirae) = విధికి అధిదేవతలు. జ్యూస్ కన్నా శక్తిమంతులు.
24) మార్ఫియస్ (Morpheus) = స్వప్నాధిదేవుడు. హిప్నాస్ కుమారుడు.

25) మ్యూజెస్ (Muses) = నవకళాధిదేవతలు (తొమ్మిదిమంది)

26) నెమెసిస్ (Nemesis) = పగకు, ప్రతీకారానికి అధిదేవత.

27) నైక్ (Nike) = విజయాధిదేవత (Goddess of Victory)

28) నిక్స్ (Nyx) = రాత్రికి అధిదేవత

29) పాన్ (Pan) = God of wild; హెర్మెస్ కుమారుడు

30) పెయాన్ (Paeon) = దేవతల వైద్యుడు

31) పెర్సియస్ (Perseus) = మెడుసా సంహారి, మైసినె వంశకర్త

32) ఫొబొస్ (Phobos) = God of fear = భయానికి దేవుడు

33) పొమొనా (Pomona) = ఫలాలకు, తోటలకు అధిదేవత

34) సెలెనె (Selene) = దైత్యురాలు, చంద్రుడు

35) స్టిక్స్ (Styx) = స్టిక్స్ నది. దేవతలు ప్రమాణం చేసే నదీదేవత.

36) థనాటాస్ (Thanatos) = మృత్యుదేవుడు

37) ట్రిటాన్ (Triton) = సముద్రాలకు వార్తాహరుడు.

38) టిఖె (Tyche) = అదృష్టాధిదేవత

39) జెలస్ (Zelus) = Emulation

# 4. చిల్లర దేవుళ్లు

1. **ఎరినైస్ (The Erinyes =** Three goddesses of revenge and retribution) పగ, ప్రతీకారాధిదేవతలు. వీరినే ఫ్యురీస్ (Furies) అనికూడా పిలుస్తారు. యురేనస్ రక్తం చిందినప్పుడు పుట్టిన భయంకర రూప దేవతలు. వారి ఊపిరి మంటలు మండుతున్నట్లుగా ఉండి, విషపూరితమైన రక్తం వాళ్ల కన్నుల నుంచి కారుతూంటుంది. ఎరినైస్ – ముగ్గురు 1) ఎలెక్టొ (Alecto= the angry), 2) మెగెరా (Megaera = The grudging) 3) టిసిఫొనె (Tisiphone=Avenger of murder) అక్రమాలకు, అగౌరవానికి, హత్యలకు ముఖ్యంగా రక్తసంబంధీకులను చంపిన వారిని వెంటాడి వేటాడి శిక్షిస్తారు. ఆ శిక్షకు అవధులుండవు. నేరస్తుడు చనిపోయినా వదలరు. కేవలం పశ్చాత్తాపమే ఎరినైస్ నుంచి విముక్తికి మార్గం. కొన్ని కథనాల ప్రకారం ముగ్గురు సోదరీమణులు ఎరినైస్ (Erinyeas) కేయాస్ కుమార్తె నిక్స్ (Nyx = Night) సంతానం. రోమన్లు వీరిని ఫ్యురీస్‌గా పిలిచేవారు.

2. **గ్రేసెస్ (Graces=Charites) =** (Three lovely goddesses of Joy, Charm and beauty) జ్యూస్ దేవునికి, సముద్రకన్య (Oceanide) యురినొమ్ (Eurynome)లకు పుట్టినవారు. 1) ఎగ్లెయియా (Aglaia = The goddess of Beauty), 2) యుఫ్రొసినె = The grace of delight), 3) థాలియా (Thalia=the grace of Blossom). విశ్వంలో మంచిని, అందాన్ని పెంపొందించేందుకు జనించిన ఈ ముగ్గురు దేవతలు ఎఫ్రొడైట్ దేవతకు అనుయాయులు. ఎఫ్రొడైట్, ఎరాస్‌ల సమక్షంలో అపొలో సంగీతానికి అనుగుణంగా నృత్యం చేస్తూ, మ్యూజెస్ (Muses) సాహిత్యానికి సొబగులు దిద్దుతూ ప్రకృతిని పరవశింపజేస్తారు.

3. **మొయిరాయి (Moirae=The Fates) =** The spinners of the thread of life and personification of destiny. జ్యూస్ దేవునికి, న్యాయదేవత థెమిస్ (Themis)కు పుట్టిన ఈ ముగ్గురు దేవతలు 1) క్లొతొ (Clotho) అందరికంటె చిన్నది. ఈమె జీవన దారాన్ని కండెతో పేనుతుంది. మనిషి పుట్టుకను నిర్ణయిస్తుంది. 2) లాఖెసిస్ (Lachesis) దారపు పొడుగును తద్వారా ఆయుఃకాలాన్ని నిర్దేశిస్తుంది. 3) ఎట్రోపాస్ (Atropos) మరణ సమయాన్ని సూచిస్తూ దారాన్ని కత్తిరిస్తుంది. వీరి నిర్ణయానికి తిరుగులేదు. విధికి ప్రతిరూపులైన వీరి నిర్ణయానికి జ్యూస్ దేవుడు కూడా కట్టుబడి ఉంటాడు.

4. **మ్యూజెస్ (The Muses) =** The nine goddesses presiding our memory. దేవతల సంతానం ఈ తొమ్మిదిమంది దేవతలు. చెడుకు విరుగుడు

గానూ, దుఃఖాలను తొలగించడానికి వీరు సృజింపబడినారు. అపొలో వీరి గురువు. గ్రేసెస్‌తో కలిసి నృత్యగానాలతో సందడిగా ఉంటారు.

1) కాలియొపె = Calliope - Muse of Epic poetry
2) క్లియొ = Clio = Muse of History
3) ఎరాటొ = Erato = Muse of Erotic poetry
4) యుటెర్పె = Euterpe = Muse of Lyric poetry
5) మెల్పొమెనె = Melpomene = Muse of Tragedy
6) పాలిహైమ్నియా = Polyhymnia = Muse of Sacred poetry
7) టెర్పెస్కోలె = Terpeschore = Muse of Dance & Choral poetry
8) థాలియా = Thalia = Muse of Comedy and Bucolic poetry
9) యురెనియా = Urania = Muse of Astronomy

**5.** **నింఫ్స్ (The Nymphs) =** The young goddesses of nature = The sea, the land, and the woods. వనదేవతలుగా, అప్సరసలుగా, మాతృత్వానికి, పచ్చదనానికి ప్రతీకలుగా గుర్తించబడినారు. ఆర్టెమిస్, అపొలో, ఎఖెలూస్ (Acheloos), హెర్మెస్, పాన్ దేవతలతో కలిసి తిరుగుతుంటారు.

1) కాలిస్టొ (Callisto = The companion of Artemis)
2) కాలిప్సో (Calypso = The capturer of Odysseus)
3) డాఫ్నె (Daphne = The personification of the Laurel tree)
4) ఎఖొ (Echo = The nymph of steady reply)
5) ఐవొ (Io = The Priestess of Hera in Argos)
6) పిటిస్ (Pitys = The personification of the pine)
7) సిరింక్స్ (Syrinx = The inspiration for melody)

**6.** **సైరెన్స్ (The Sirens) =** Sea nymphs who sings in a seductive way. సముద్ర కన్యలైన సైరెన్లు ఫెయకెస్ (Faiakes) ద్వీపంలో నివసిస్తారు. మనిషి తల పక్షి శరీరంతో వీళ్లు విషాదగానం చేస్తూ నావికులను ఆకట్టుకుంటారు. ఈ సంగీతానికి తన్మయులై ఫెయకెస్ ద్వీపంలో చిక్కుబడి మరణించిన నావికుల ఎముకలతో ఆ ద్వీపం నిండి ఉంటుంది. ఒడెసిస్ తిరుగు ప్రయాణంలో తన చెవుల నిండా కొవ్వు (Wax) నింపుకుని, తెరచాప కొయ్యకు బంధించుకుని సైరెన్ల బారినుంచి బయటపడ్డాడు.

# గ్రీకు వీరులు

# ప్రాచీన గ్రీకు కాలరేఖ (క్రీస్తుపూర్వం)

క్రీస్తుపూర్వం 9000 –అట్లాంటిస్ అదృశ్యం (Atlantis)

1600 – థెరా ద్వీపంలో విస్ఫోటనం. క్రెటె నాగరికత పరిసమాప్తి

1300 – ఏథెన్స్ నగర స్థాపన – థెసియస్ (Theseus)

1250 – ట్రాయ్ నగర ధ్వంసం

800 – లైసర్గస్ (Lycurgas) – స్పార్టాను పరిపాలించుట.

776 – మొదటి ఒలింపక్ పోటీలు

730 – స్పార్టాచే మైసెనె ఆక్రమణ

594 – సొలాన్ (Solon) – ఏథెన్స్‌లో సంస్కరణలు

560–527 – ఏథెన్స్‌లో పిసిస్ట్రాటస్ నిరంకుశ పరిపాలన

490 – మారాథాన్ (Marathon) పోరాటం

480 – క్జెరెక్జెస్ (Xerexes) పర్షియన్‌రాజు దండయాత్ర.

479 – ప్లాటియా (Plataea) యుద్ధం. పర్షియన్ల ఓటమి.

477 – ఏథెన్స్‌చే పర్షియాకు వ్యతిరేకంగా డెలియన్ కూటమి

464 – స్పార్టాలో భూకంపం

461 – సిమన్ (Cimon) బహిష్కరణ ఏథెన్స్ నుంచి

454 – డెలియన్ కూటమి, ధనాగారం ఏథెన్స్‌కు తరలింపు

443 – పెరిక్లిస్ పరిపాలన, ఏథెన్స్ సుందరీకరణ

431 – పెలొపొనెస్సియన్ యుద్ధ ప్రారంభం

429 – ప్లేగు బారినపడి పెరిక్లిస్ మరణం

421 – నిసియాస్‌చే (Nicias) శాంతిస్థాపన ఒప్పందం

415 – ఏథెన్స్ సిసిలీపై దండెత్తుట

413 – నిసియాస్ లొంగుబాట

404 – పెలొపొనిస్సియన్ యుద్ధం ముగింపు. స్పార్టా విజయం

399 – సోక్రటీస్ మరణం

395 – గ్రీకులలో అంతఃకలహాలు

379 – పెలొపిడాస్‌చే థెబెస్ విముక్తి

336 – అలెగ్జాండర్ మాసిడోనియా రాజుగా పదవినధిష్టించుట.

333 – గాగమెలాలో అల్జెగాండర్ పర్షియన్లను ఓడించుట.

323 – ఇండియా నుంచి తిరుగు ప్రయాణంలో బాబిలోన్ వద్ద అలెగ్జాండర్ మరణం

# మానవసృష్టి

డోరిక్, హెల్లెనిక్ తరాల గ్రీకుప్రజల విశ్వాసం ప్రకారం పెలాస్గస్ (Pelasgus) తొలి మానవుడు. సృష్టికర్త యూరినోమ్ (Euryonome) అంశతో స్వయంభువు (Autochronus)గా పెలాస్గస్ అవతరించాడు.

హోమర్ (Homer), హెసియాడ్ (Hesiod), అపొలోడోరస్ (Apollodorus) రచనల ప్రకారం క్రోనాస్ (Cronos) స్వర్ణయుగపు కాలంలోనే గెయియా (Gaiea) భూదేవత మానవులకు జన్మనిచ్చింది. ఆ స్వర్ణయుగపు మానవులకు వృద్ధాప్యం లేదు. రోగాలు రావు. చెట్లు రాల్చిన పండ్లు తిని, సెలయేటి స్వచ్ఛమైన నీరు తాగి శారీరక శ్రమ లేకుండా హాయిగా బతికేవారు. నిద్రలోనే వారికి అనాయాస మరణం సంభవించగా దివ్యాత్మలుగా (Good spirits) మారి మానవులకు సన్మార్గబోధ చేసేవారు.

ఒలింపియన్ల కాలంలో జ్యూస్ దేవుడు రజతయుగపు మానవులను సృష్టించాడు. దేవతల వినోదానికి పనికి వస్తారనుకుని జ్యూస్ (Zeus), దైత్యుడైన అయాపెటస్ (Iapetus Titan) కుమారులు ఎపిమెథియస్ (Epimetheus), ప్రొమెథియస్ (Prometheus)లను మానవులకు వరాలనిచ్చి రమ్మని భూలోకానికి పంపినాడు. ఎపిమెథియస్ భూమ్మీది సమస్త జంతుజాలాన్ని సమావేశపరచి ఒక్కొక్క జంతువుకు ఒక్కో ప్రత్యేక శక్తిని, గుణాన్ని వరంగా ఇవ్వసాగినాడు. వేగం, బలం, చతురత, మోసకారితనం, ఉన్ని, రెక్కలు, కొమ్ములు ఇలా ఒక్కోటి ఇచ్చుకుంటూ వచ్చేసరికి ఆఖర్న మానవుడికివ్వడానికేమీ మిగల్లేదు. అశక్తుడై, ఏ రక్షణాలేని మానవుడిని చూసి జాలిపడిన ప్రొమెథియస్ ఎథెనా దేవత నుంచి విశ్లేషణాశక్తిని (Reason), హెఫాస్టిస్ నుంచి అగ్నిని (Fire) దొంగిలించి మానవులకందజేసాడు. అంతే కాకుండా జంతు బలుల్లో దేవతలకు రావాల్సిన ముఖ్యభాగాల్ని మానవులు పొందేట్లు చేసి, దేవతలకు జంతువుల ఎముకలు, పొట్టపేగులు చెందేలా యుక్తిపన్ని దైత్యులను టార్టారస్ పాతాళంలో బంధించిన జ్యూస్ (Zeus) దేవునికి ధిక్కారస్వరంగా నిలబడ్డాడు.

ఆగ్రహించిన జ్యూస్ ప్రొమెథియస్‌ను కకాసస్ కొండ శిఖరానికి బంధించి ప్రతిరోజూ ఒక గ్రద్ద వచ్చి ప్రొమెథియస్ కాలేయాన్ని పొడుచుకు తినేలా శిక్ష విధించాడు. తెల్లారేసరికల్లా మరల కాలేయం పెరగడం, గ్రద్ద మరల తినేందుకు రావడం.... ఇలా ముప్ఫై ఏళ్లు నరకయాతన పడిన ప్రొమెథియస్‌ను హెరాక్లిస్ వచ్చి గద్దను చంపి ఆతనిని విముక్తి చేసినాడు.

ఈ కాలపు మానవులు రజతయుగపు తెగగా (Silver race) ప్రసిద్ధికెక్కినారు. దేవతలకే ఎదురు తిరిగిన ఈ మానవుల చర్యలకు విసిగిన జ్యూస్ (Zeus) జలప్రళయాన్ని (Deluge)ను సృష్టించి మానవులను నాశనం చేయగా వాళ్లు మృతాత్మలై భూగర్భంలో సంచరించసాగినారు.

జ్యూస్ దేవుని నిర్ణయాన్ని ముందే పసిగట్టిన ప్రొమెథియస్ (Prometheus) మానవులైన డ్యుకాలియన్ (Deucalion) ఆతని భార్య పిర్రా (Pyrrha)లను ఒక నౌకలో ఉంచి రక్షించినాడు. జలప్రళయానంతరం ఆ మానవ జంట ప్రొమెథియస్ తల్లి థెమిస్ (Themis)ను ప్రార్థించగా ఆమె ప్రత్యక్షమై అందరికీ తల్లి అయిన నేలతల్లి ఎముకలను తమ భుజాల మీదుగా వెనక్కి విసురుతూ వెళ్లమని పలికి అదృశ్యమైంది. నేలతల్లి ఎముకలను రాళ్లుగా అర్థం చేసుకున్న డ్యుకాలియన్ విసిరిన రాళ్ల నుంచి మగవాళ్లు, పిర్రా విసిరిన రాళ్లనుంచి స్త్రీలు జన్మించారు. ఈ తెగ కంచు యుగపు (Bronze Race)గా ప్రసిద్ధికెక్కింది.

కొందరి అభిప్రాయం ప్రకారం రజతయుగపు తెగ (Silver Race)లో మొదటి మానవుడిని ప్రొమెథియస్ మట్టిని, నీటిని కలిపి సృజించగా మిగతా దేవతలు ఆతనికి కొన్ని శక్తులనిచ్చారు. అతడే ఫీనాన్ (Phaenon). అందుకే మానవులంటే ప్రొమెథియస్‌కు అంత ఇష్టమని వారి అభిప్రాయం.

డ్యుకాలియన్, పిర్రాలు సృష్టించిన కంచుయుగపు తెగ లోహ నిర్మాణంలో నిపుణులైనారు. నాగరికత వాళ్లతోనే మొదలైనా తాము కనుగొన్న శాస్త్ర విజ్ఞానాన్ని ఒకరినొకరు చంపుకోడానికి వినియోగించి సర్వనాశనమైనారు. దేవతలు మానవజాతిపై జాలిపడి మానవ స్త్రీలతో సంగమించగా ధీరోదాత్తులైన మానవజాతి ఉద్భవించింది. ఇది హీరో (Heroic age)ల కాలంగా ప్రసిద్ధికెక్కింది. వాళ్లు మృతి చెందినాక వీరస్వర్గానికి, ఎలిషియమ్ క్షేత్రాలకు (Elesiam fields) చేరుకున్నారు.

హీరోలు గతించగా మిగిలిన మానవులు ఇనుప యుగపు తెగగా (Iron Race)గా ప్రసిద్ధికెక్కినారు. వీరిలో రాగద్వేషాలు, పాపపుణ్యాలు, కోపతాపాలు కలగలుపుగా ఉండి నిరంతర కొట్లాటలలో నిమగ్నమై ఉంటారు. ఏనాడైతే ఈ తెగ తల్లిదండ్రులను హింసించడం, నగర విధ్వంసకులు కావడం, వారికి పిల్లలు తెల్ల జుట్టుతో జన్మించడం జరుగుతుందో అవి ఈ తెగ పరిసమాప్తి కాలాన్ని సూచిస్తాయి.

ఎథెనియన్ల నమ్మకం ప్రకారం హెఫాస్టిస్ ఎథెనాను బలాత్కరించబోతాడు. ఆమె తప్పించుకోగా అతని వీర్యం ఆమె కాళ్లపై చిందుతుంది. ఆమె ఛీత్కరించుకుని దానిని ఉన్నితో తుడిచి నేలపై పడవేయగా ఆ వీర్యం నుంచి ఎరిక్‌తోనస్ (Erichthonous) అనే సర్పమానవుడు జన్మించి ఏథెన్స్‌కు రాజవుతాడు.

థెబెస్ నగర పురాణాన్ననుసరించి కాడ్మస్ (Cadmus) అనే మహావీరుడు ఓ మహా సర్పాన్ని సంహరించి దాని కోరలను భూమిలో పాతివేయగా, ఆ పళ్లనుంచి వేలాదిగా జనించిన మనుషులు ఒకరినొకరు చంపుకోగా చివరకు మిగిలిన అయిదుగురు (Spartoi - the sown) థెబెస్ నగర నిర్మాతలుగా ప్రసిద్ధికెక్కినారు.

ప్లాటో (Plato) కథనం ప్రకారం దేవతలు తమ వినోదం కోసం సృష్టించి, శక్తులనిచ్చిన ద్విలింగ జీవి దేవతలపై తిరగబడగా జ్యూస్ దేవుడు ఆ జీవిని ఉడికిన గ్రుడ్డును వెంట్రుకతో కోసినట్లు, రెండు అర్థభాగాలుగా చీల్చి భూమిపై వదిలిపెట్టినాడని – అప్పటి నుంచి రెండు అర్థభాగాలుగా జనించి పురుషులు, స్త్రీలు తమ తమ అర్థభాగం కోసం వెదుకుతూ పరితపిస్తారని ఆ కోరిక, నిరీక్షణ, వెదుకులాట ప్రేమగా పరిణమించిందనీ అంటాడు.

# 1. ట్రిప్టొలెమస్
## (Triptolemus)

ట్రిప్టొలెమస్ అనగా మూడురెట్లు సాహసికుడు (Three fold warrior) అని అర్థం. భూమికి (Gaia)కు సముద్రానికి (Oceanus)కు కలిగిన సంతానంగా మనువుగా (Primordial man)గా ట్రిప్టొలెమస్‌ను భావిస్తారు.

ఎలూసిస్ (Eleusis) రాజ్యానికి రాణి మెటానిరా (Metanira). ఆమె భర్త సెలెయస్ (Celeus). వారికి ఇద్దరు కుమారులు డెమొఫొన్ (Demophon); ట్రిప్టొలెమస్‌లు. డిమిటర్ (Demeter) తన కుమార్తె పెర్సిఫొనె (Persephone)ను వెదకుతూ ముదుసలి అవ్వ డోసో (Doso) వేషంలో ఎలూసిస్ రాజ్యాన్ని చేరుతుంది. రాజు సెలెయస్ తన పిల్లలకు విద్యాబుద్ధులు గరపమని డిమిటర్‌కు బాధ్యత అప్పగిస్తాడు. అతని ఆతిథ్యానికి సంతోషించిన డిమిటర్, డెమొఫోన్‌కు అమరత్వాన్ని కలిగించడం కోసం అగ్నిలో డెమొఫోన్ శరీరాన్ని కాల్చుతూ ఆతడ్ని మృత్యుంజయుణ్ణి చేయబూనుకున్నది. ఒక రాత్రి దాన్ని చూసిన మెటానిరా అభ్యంతరం తెలపడంతో డిమిటర్ డెమొఫోన్‌ను అంతటితో వదిలేసి, ట్రిప్టొలెమస్‌కు వ్యవసాయం చేసే విధానం, పంటలు పండించడం నేర్పింది. డిమిటర్, పెర్సెఫోనెలు ఇచ్చిన రెక్కల రథంలో ట్రిప్టొలెమస్ గ్రీకు దేశమంతా తిరుగుతూ ప్రజలకు వ్యవసాయాన్ని నేర్పించ సాగాడు.

ట్రిప్టొలెమస్ ప్రవచించిన మూడు వాక్యాలుగా ప్రసిద్ధికెక్కినవి

1) తల్లిదండ్రులను గౌరవించు (Honor your parents)
2) దేవతలను ఆరాధించు (Honor the gods with fruth & grain)
3) భూతదయ కలిగి ఉండు (Spare the animals)

ఆ విధంగా ట్రిప్టొలెమస్ గ్రీకులకు వ్యవసాయాన్ని నేర్పి నాగరికులుగా మార్చిన మనువుగా ప్రసిద్ధికెక్కినాడు.

# 2. పెర్సియస్
# (Perseus)

ఆర్గాస్ రాజు ఎక్రిసియస్ (Acrisius) కుమార్తె డానె (Danae), జ్యూస్ దేవుని పుత్రుడు పెర్సియస్. డెల్ఫిలోని దివ్యవాణి "నీ కుమార్తెకు కలిగే మగబిడ్డ నిన్ను చంపుతాడు" అని హెచ్చరిస్తుంది. దానితో ఎక్రిసియస్ డానెను ఒక కంచుతో చేసిన పైకప్పులేని గదిలో బంధించాడు. బంగారు వర్షంలా ఆమెపై కురిసిన జ్యూస్ దేవుని వల్ల ఆమె పెర్సియస్‌కు జన్మనిస్తుంది. ఆ తల్లీబిడ్డలిద్దరిని ఓ చెక్కపెట్టెలో ఉంచి సముద్రంలో వదిలేస్తాడు ఎక్రిసియస్. సెరిఫాస్ ద్వీపానికి కొట్టుకువచ్చిన ఆ పెట్టెను తెరిచిన డిక్టిస్ (Dictys) అనే జాలరి వారిని రక్షించి ఆశ్రయమిచ్చాడు. డిక్టిస్ సోదరుడు పాలిడెక్టిస్ (Polydectes) ఆ ద్వీపానికి రాజు.

పాలిడెక్టిస్ కన్ను డానె (Danae) పై పడింది. తనకు అడ్డుగా పెర్సియస్ ఉన్నాడని భావించిన పాలిడెక్టిస్ పెద్ద విందు ఏర్పాటుచేసి అతిథులందరిని కానుకగా అశ్వాలను తెమ్మని కోరినాడు. ఒక్క పెర్సియస్ తన దగ్గర అశ్వాలు లేనందువల్ల ఇంకేదైనా చెప్పండి బహుమతిగా ఇస్తాను అని రాజుకు విన్నవించు కుంటాడు. "అంత సాహసం గలవాడివైతే మెడుసా గార్గన్ (Medusa Gorgon) తల తీసుకునిరా!" అని రాజు కోరతాడు.

గార్గన్‌లు ముగ్గురు – స్థెనొ, యురియాలె, మెడుసా (Stheno, Euryale, Medusa). స్థెనె, యురియాలెలకు చావులేదు. గార్గన్‌లు బంగారపు రెక్కలు, మెరుస్తున్న గోళ్లు, వరాహదంతాల్లాంటి కోరలతో తలలో వెంట్రుకలకు బదులు బుసలుకొడ్తున్న సర్పాలతో భయంకరంగా కనిపిస్తూ వాళ్ల చూపు తగిలిన జీవజంతువులను శిలలుగా మార్చగలరు. మెడుసా ఒకప్పుడు మానవస్త్రీ. అద్భుతమైన శిరోజాలతో పొగరుగా ఉండేది. ఒకనాడు ఎథెనా దేవాలయంలో పొజిడాన్‌తో సమాగమించి దేవాలయ పవిత్రతను భంగపరచడం చేత ఎథెనా ఆమె శిరోజాలను సర్పాలుగా మార్చి ఆమెను గార్గాన్‌గా మార్చిందని ప్రతీతి.

ఎథెనా సలహాతో పెర్సియస్ గార్గన్లను చంపగలిగిన ఆయుధాలున్న హెస్పెరెడిస్ ఆచూకి కోసం గ్రెయెయి (Graeae) అని పిలువబడే ముగ్గురు ముదుసలి స్త్రీలు, గార్గన్ల సోదరీమణులను కలుస్తాడు. హెరాదేవత వనాల్ని సంరక్షించడం వాళ్ల బాధ్యత. వాళ్ల ముగ్గురికి ఒకే కన్ను, ఒకే పన్ను. కన్నును ఒకరితరువాత ఒకరు మార్చుకుంటూ చూసే సమయంలో పెర్సియస్ దాన్ని లాక్కుని, బదులుగా హెస్పెరెడిస్ జాడను తెలుసుకుని వాళ్లకు కన్ను తిరిగి ఇచ్చేస్తాడు.

హెస్పెరెడిస్ దగ్గర మెడుసా తలను పట్టగల కిబిసిస్ (Kibisis) సంచిని స్వీకరిస్తాడు పెర్సియస్. జ్యూస్ దేవుడు ఎడమాంటైన్ ఖడ్గాన్నివ్వగా, కప్పుకుంటే కనబడకుండా చేసే టోపిని హేడ్స్, రెక్కల పాదరక్షల్ని హెర్మెస్ – పెర్సియస్‌కు

బహుమతులుగా ఇస్తారు. ఎథెనా తళతళలాడుతూ మెరుస్తున్న డాలును ఇస్తుంది. తలపై హేడ్స్ ఇచ్చిన టోపీ ధరించి ఎవరికీ కనపడకుండా గార్గన్ల గుహలో ప్రవేశించిన పెర్సియస్, నిద్రిస్తున్న స్థెనా, యురియాలె, మెడుసాలను తన డాలుతో గమనించి తన ఖడ్గంతో మెడుసా తల నరికి, ఆమె వేపు చూడకుండా ఆమె తలను 'కిబిసిస్' సంచిలో వేస్తాడు. మెడుసా మెడ నుంచి పెగాసస్ (Pegasus) రెక్కల గుర్రం, క్రైసావర్ (Chrysaor) అనే స్వర్ణధనుస్సు జనిస్తాయి. మిగిలిన ఇద్దరు గార్గను మేలుకుని పెర్సియస్‌ను వెంబడించేంతలోనే టోపి ధరించి అదృశ్యమవుతాడు.

గార్గన్ల నుంచి తప్పించుకుని మెడుసా తలతో సెరిఫోస్ ద్వీపానికి వస్తూ దారిలో ఇథియోపియా వద్ద పెర్సియస్ ఆగుతాడు. ఆ ద్వీపానికి రాజు సెఫియస్ (Cepheus), రాణి కాస్సియోపియా (Cassiopeia). కాస్సియోపియాకు తాను చాలా అందగత్తెనని గర్వం. సముద్రకన్యలు నీరీడ్స్ (Nereids) తన కాలిగోటికి సరిపోలరని అనడంతో సముద్రదేవుడు పాజిడాన్‌కు కోపం వచ్చి ద్వీపాన్ని ముంచెత్తడమే గాక, సెటస్ (Cetus) సర్పాన్ని పంపి ద్వీపాన్ని అల్లకల్లోల పరుస్తాడు. అమ్మోన్ దివ్యవాణి (Ammon oracle) "రాకుమారి ఏంద్రొమెడా (Andromeda) ను ఆ సర్పానికి బలియిస్తేనే గాని శాంతించదని" చెప్పగా ఆమెను సముద్ర తీరంలోని పెద్ద శిలకు కట్టేసి ఉంచుతారు. పెర్సియస్ ఆ సర్పాన్ని చంపి రాకుమార్తె ఏంద్రొమెడాను రక్షించి వివాహమాడ్తాడు. ఏంద్రొమెడాను పెండ్లాడదలుచుకున్న ఫినియస్ (Phineus) యుద్ధానికి రాగా, మెడుసా తలను చూపి ఆతడిని శిలగా మార్చాడు. అక్కడ్నుంచి తన తాతకు తన వలన మృత్యువు సంభవిస్తుందన్న విషయం తెలుసుకుని ఆర్గాస్‌కు వెళ్లకుండా లారిస్సాకు చేరాడు. లారిస్సా రాజు ట్యుటామైడెస్ (Teutamides) చనిపోయిన తన తండ్రి స్మృత్యర్థం క్రీడాపోటీలను నిర్వహిస్తున్నాడు. పెర్సియస్ అక్కడ తాను కనిపెట్టిన క్వాయట్ (Quoit) ఆటను ప్రేక్షకులకు చూపుతుండగా, ఆ క్రీడలకు విచ్చేసిన ఎక్రిసియస్‌కు క్వాయట్ తగిలి ఆతడు మరణించడంతో జోస్యం నిజమవుతుంది.

పెర్సియస్, ఆంద్రొమెడాలకు ఏడుగురు కొడుకులు – పెర్సెస్, ఆల్కయస్, హెలెయస్, మెస్టర్, స్థెనెలస్, ఎలక్ట్రియాన్, సినురస్. ఇద్దరు కూతుర్లు – గార్గొఫోన్, ఆటొక్తాలు. పెర్సెస్ – ఇథియోఫియాలో ఉండిపోగా ఆతడు పర్షియన్ రాజులకు మూలపురుషుడౌతాడు. ఎలక్ట్రియాన్ నుంచి యురెస్థియస్, ఆతడి నుంచి ఎట్రియస్‌కు మైసెనే రాజ్యం దక్కుతుంది. ఆల్కయస్ కుమారుడు ఏంఫిట్రయాన్ ఆతని సవతి కొడుకు హెరాక్లిస్ ఆతని వంశస్థులు గ్రీకు రాజ్యాన్ని పరిపాలిస్తాడు.

మరణించిన తరువాత పెర్సియస్ ఉత్తరాకాశంలోని నక్షత్రమండలంగా రూపు దాల్చినాడు.

# 3. జేసన్
## (Jason)

పెలియాస్ (Pelias) తన సోదరుడైన ఎయిసన్ (Aeson)ను తొలగించి, అయోల్కస్ – థెస్సాలే ప్రాంతానికి రాజవుతాడు. కాని అతని మనసులో ఎయిసన్ సంతానం తనకు ప్రాణహాని కలిగిస్తారన్న అనుమానంతో వారసులందరినీ చంపినా, ఎయిసన్ భార్య ఆల్సిమెడె (Alcimede) తనకు పుట్టిన జేసన్ పురిటిలోనే చనిపోయాడని నమ్మించి జేసన్ (Jason)ను చిరాన్ (Chiron) రక్షణలోకి పంపుతుంది. నమ్మకం చావని పెలియాస్ దివ్యవాణి (Oracle) సలహా అడుగుతాడు. "Beware of a man with one sandel – ఒక చెప్పుతో నడిచేవాడి గురించి జాగ్రత్తపడు! – అన్నది దివ్యవాణి.

కొన్ని సంవత్సరాలు గడిచాయి. పెలియాస్ తన తండ్రి పాజిడాన్ పేరిట క్రీడలను నిర్వహిస్తున్నాడు. పెరిగి పెద్దవాడైన జేసన్ అయోల్కస్ (Iolcus) ప్రాంతానికి వస్తున్నపుడు దారిలో అనౌరాస్ (Anauras) నదిలో ఒక చెప్పును పోగొట్టుకున్నాడు – ముదుసలి స్త్రీరూపంలో ఉన్న హెరాను నదిని దాటించే సమయంలో : హెరా సంతోషించి పెలియాస్ కథనంతా జేసన్‌కు చెప్పి అతడే థెస్సాలే ప్రాంతానికి వారసుడని తెలియబరుస్తుంది. అదేమాట జేసన్ పెలియాస్‌కు చెబుతాడు. పెలియాస్ తెలివిగా – "రాజ్యం, సింహాసనం నీదే! కాదనేది లేదు. కాని నీ అర్హత ఋజువు కావాలంటే పోయి బంగారపు ఉన్ని తీసుకురా!" అన్నాడు.

జేసన్ తనతో పాటు – ఉత్తరపుగాలి కుమారులైన బొరియాడ్స్, హెరాక్లిస్, ఫిలోక్టెటిస్, పెలియస్, టెలమాన్, ఆర్ఫియస్, కాస్టర్, పొల్లక్స్, అట్లాంటా, యుఫెమస్‌లతో కలిసి ఆర్గాస్ (Argos) అనే నౌకలో బంగారు ఉన్ని కోసం బయల్దేరినాడు. వీళ్లందరూ ఆర్గొనాట్స్ (Argonauts)గా ప్రఖ్యాతి చెందారు.

లెమ్నాస్ ద్వీపంలో ఒక వింత జరిగింది. ఎఫ్రొడైట్‌కు ఆ ద్వీపపు స్త్రీలపై కోపం వచ్చి వాళ్లందరి శరీరం నుంచి దుర్వాసన వచ్చేట్లు చేసింది. మగవాళ్లు దాన్ని భరించలేక థ్రాసియన్ మైదానపు స్త్రీలతో సంబంధాలు పెట్టుకోసాగినారు. ద్వీపపు స్త్రీలకు కోపం వచ్చి నిద్రపోతున్న మగవాళ్లందరిని చంపివేసారు. రాజు థొయాస్ (Thoas)ను మాత్రం ఆతని కుమార్తె హిప్సిపైలె (Hypsipyle) పెద్దపెట్టెలో పెట్టి సముద్రంలోకి విడిచిపెట్టింది.

ఆర్గోనాట్స్ ఆ ద్వీపానికి చేరుకున్నారు. ఒంటరిగా ఉన్న స్త్రీలతో వాళ్లకు సంబంధాలు ఏర్పడగా వారి సమాగమం వలన కలిగిన సంతానం మిన్యె (Minyae)గా పిలవబడసాగినారు.

లెమ్నాస్ నుంచి ఆర్గొనాట్లు మైసియాకు చేరుకున్నారు. హెరాక్లిస్ అనుచరుడు హైలాస్ (Hylas) మిగతావాళ్లతో కలిసి ద్వీపంలో నీళ్లు, ఆహారం అన్వేషణలో

ఉన్నపుడు అక్కడి అప్సరసలు ఆతడిని తీసుకుపోయి మాయం చేసినారు. హెరాక్లిస్ ఎంత వెదకినా హైలాస్ జాడ దొరకదు. హెరాక్లిస్ ఆర్గోనాట్లను విడిచి తన దారిని తానుపోయినాడు.

ఆ తరువాత జేసన్ (Jason) థ్రేస్‌లోని ఫినియాస్ (Phineas) రాజున్న సల్మిడెసస్ ప్రాంతానికి చేరుకున్నాడు. ఆ రాజు దురదృష్టం ఏమిటంటే ఆతడు భోజనానికి కూర్చోగానే హార్పిస్ (Harpies) అనే రెక్కల స్త్రీలు వచ్చి ఆహారాన్ని ఎగరేసుకుపోయేవారు. ఆ విధంగా తిండితిప్పలు లేక ఎముకల గూడులా ఉన్న రాజు మీద జాలికలిగి 'హార్పిస్'ను చంపి జేసన్ ఆతనికి విముక్తి కలిగిస్తాడు. కృతజ్ఞతతో ఫినియాస్ రాజు జేసన్‌కు 'కాల్చిస్' (Colchis) కు వెళ్లేదారి, సింపిల్ గేడ్స్ (Symple gades or the clashing rocks) ను దాటే ఉపాయాన్ని చెబుతాడు.

బంగారు ఉన్ని (Golden fleece) ఉన్న కాల్చిస్‌కు చేరుకోవాలంటే ఉన్న ఏకైక మార్గం సింపిల్ గేడ్స్ గుండానే! ఆ మహాశిలల మధ్య నుంచి ఎవరు పోవాలని ప్రయత్నించినా ఆ రెండు శిలలు దగ్గరకు వచ్చి వారిని నలిపివేస్తాయి. ఉపాయంగా జేసన్ ఒక పావురాన్ని వదుల్తాడు. పావురం లాఘవంగా వెళ్తుంది. కాని, శిలల తాకిడికి కొన్ని ఈకలు రాలిపోతాయి. అందుకని జేసన్ తన మిత్రుల్ని ఉత్సాహపరచి పావురం కన్నా వేగంగా నౌకను నడిపి స్వల్పనష్టంతో ఆవలి వేపు చేరుకుంటాడు. ఆరోజు నుంచి ఆ రెండు మహాశిలలు దగ్గరకు రావడం ఆగిపోవడంతో నౌకలు ఏ ఇబ్బందీ లేకుండా ప్రయాణించగలుగుతున్నాయి.

నల్లసముద్రం తీరాన ఉన్న కాల్చిస్‌కు జేసన్ నౌక చేరుకున్నది. కాల్చిస్‌ను పరిపాలిస్తున్న ఎయిటెస్ (Aeetes) రాజు జేసన్‌కు మూడు పనులు అప్పజెప్పినాడు. రాకుమార్తె మెడియా (Medea) సాయంతో జేసన్ నిప్పులుకక్కే ఎద్దుల్ని (Khalkotauroi) నాగలికి కట్టి పొలం దున్నినాడు. డ్రాగన్ దంతాల్ని నాటగా పుట్టుకువచ్చిన అసంఖ్యాకమైన సైనికులపైకి పెద్ద రాయిని విసిరి వాళ్లలో వాళ్లకు కలహాన్ని రగిలించి తన ప్రాణాన్ని కాపాడుకోగలిగినాడు. అడ్డం వచ్చిన మెడియా సోదరుడు 'ఏప్సిర్టస్' (Apsyrtus)ను చంపి, ఆమె తండ్రి 'ఎయిటీస్' దృష్టి మరలుస్తాడు జేసన్.

జ్యూస్ దేవునికి ఆగ్రహం వచ్చి ఆర్గో నౌకను తుఫానులో చిక్కుకునేలా చేసాడు. ఏప్సిర్టస్‌ను హతమార్చినందుకు ప్రాయశ్చిత్తం చేసుకోడానికి వాళ్లు ఎయియా (Aeaea) ద్వీపంలోని 'సిర్సె' (Circe) వద్దకు వెళ్లి పరిశుద్ధులై ప్రయాణం కొనసాగిస్తారు.

సైరెనమ్ స్కోప్యులి (Sirenum Scopuli) అనే శిలాద్వీపాలవద్ద ఉండే సైరెన్లు (Sirens) అద్భుతమైన పాటలతో నావికులను సమ్మోహపరచి నౌకలను దారిమళ్లించి రాళ్లకు తగిలి ధ్వంసమయ్యేలా చేసేవారు. చిరాన్ (Chiron) సలహాను పాటించిన జేసన్ అద్భుతంగా, బిగ్గరగా వీణను వాయిస్తూ, గానం చేస్తూ సైరన్ల పాటలను వినిపించకుండా ఆర్గాస్ నౌకను ఆ ప్రాంతం నుంచి బయటపడేట్టు చేయగలిగాడు.

అక్కడి నుంచి ఆర్గో నౌక క్రెటె (Crete) ద్వీపాన్ని చేరుకున్నది. అక్కడ కాపలా ఉండే కంచుమనిషి టాలస్ (Talas) నౌక పైకి పెద్దపెద్ద రాళ్లను విసుర్తూ అడ్డుపడుతుండగా మెడియా తన మంత్రశక్తితో టాలస్ రక్తనాళానికున్న సీలను తీసివేయగా రక్తస్రావమై టాలస్ మరణిస్తాడు.

ఇంటికి చేరుకున్న జేసన్, మెడియాతో కలిసి పెలియాస్ కుమార్తెలను కలుసుకుంటాడు. మెడియా వాళ్లను వినోదపరుస్తూ ఒక గొర్రెను తెప్పించి, దానిని ముక్కలుగా నరికి పెద్ద గంగాళంలో వేసి పొయ్యిక్రింద మంటపెట్టి ఏవో మొక్కలు వేయగానే గొర్రె బతికి క్రిందకుదూకి పరుగెడ్తుంది. వృద్ధుడైన తమ తండ్రి కూడా అలా యువకుడవుతాడని భావించిన పెలియాస్ కుమార్తెలు, ఆతనిని ముక్కలుగా నరికి గంగాళంలో వేస్తారు గాని, మెడియా మంత్రపు మొక్కలు వేయకపోవడం వలన పెలియాస్ మరణిస్తాడు.

థామస్ బుల్‌ఫించ్ (Thomas Bulfinch) ఈ విషయాన్నే మరోరకంగా చెబుతాడు. బంగారు ఉన్నితో ఇంటికి వచ్చిన జేసన్ తన తండ్రి ఎయిసన్ (Aeson) వృద్ధుడిగా ఉండడంచే తన విజయోత్సవాలలో పాల్గొనలేకపోతున్నాడని భావించి మెడియాను మంత్రశక్తిచే తన వయస్సులోని కొన్ని సంవత్సరాలు తండ్రికివ్వమని కోరుతాడు. ఆమె ఎయిసన్ వయస్సు తగ్గేలా చేస్తుంది. కాని జేసన్ నుంచి వయస్సును తీసుకోదు. పెలియాస్ కుమార్తెలు తమ తండ్రి కూడా అలా అవుతాడని భావించి ఆతడిని ముక్కలు చేస్తారు, పాపం! పెలియాస్ తన కుమార్తెల అవివేకం వలన మరణిస్తాడు. పెలియాస్ కుమారుడు ఎకాస్టస్ (Acastus) జేసన్, మెడియాలను దేశబహిష్కారం చేయగా వాళ్లిద్దరూ కోరింథ్ (Corinth)లో స్థిరపడ్తారు.

జేసన్ తన రాజకీయాల నిమిత్తం కోరింథ్ రాకుమార్తె క్రెయూసా (Creusa)ను వివాహమాడ్తాడు. మెడియాకు ఆగ్రహం వచ్చి క్రెయూసాకు కానుకగా ఒక విషపూరితమైన ఉడుపులనిస్తుంది. దాన్ని ధరించిన క్రెయూసా, కాపాడబోయిన ఆమె తండ్రి క్రియాన్ (Creon) మంటలలో కాలి మరణిస్తారు. ఇంకా ఆగ్రహం తగ్గని మెడియా తనకు జేసన్ వలన కలిగిన పిల్లల్ని కూడా చంపి, జేసన్ ఇంటికి రాకముందే ఏథెన్స్‌కు పారిపోతుంది.

తరువాత జేసన్ ఎఖిల్లిస్ తండ్రి పెలియస్ (Peleus) సాయంతో ఎకాస్టస్‌ను ఓడించి అయోక్లస్ (Ioclus)ను తిరిగి స్వాధీనం చేసుకుంటాడు. మెడియాకు జీవితాంతం కలిసి ఉంటానని చేసిన వాగ్ధానాన్ని భంగపరచినందుకు హెరా దేవతకు జేసన్‌పై కోపం వచ్చి ఆతడు ఒంటరి, ఆనందరహితమైన బతుకు బతకాల్సిందిగా శపిస్తుంది. జేసన్ చరమాంకంలో జీవచ్ఛవంగా బతుకుతూ ఆర్గో నీడలో విశ్రమిస్తున్నప్పుడు నౌకలోని చెక్క మీదపడి చనిపోతాడు. జేసన్ కుమారుడు థెస్సాలస్ (Thessalus) రాజవుతాడు.

# 4. థెసియస్
# (Theseus)

పిథియస్ రాజు (Pittheus) కుమార్తె ఎయిత్రా (Aethra)కు ఎగియస్ (Aegeus)కు వివాహమైంది. ఆ రాత్రే ఆమె సముద్ర తీరంలో విశ్రాంతి తీసుకుంటున్నపుడు సముద్రపు దేవత పొజిడాన్ అంశ వలన ఆమెకు మానవ, దైవ శక్తులు కూడి గర్భధారణ దాలుస్తుంది. ఇంతలో ఎగియస్ ఆమెను విడిచి ఏథెన్స్ వెళుతూ తన ఖడ్గాన్ని పాదరక్షల్ని పెద్దరాయి క్రింద భద్రపరచి తన కుమారుడు యుక్తవయస్సు రాగానే వాటిని స్వయంగా రాతి క్రింద నుంచి తీసి తనవద్దకు తీసుకురావాలని చెప్పి వెడతాడు. అక్కడ మెడియాతో పరిచయం కాగా ఆమెను వివాహం చేసుకుంటాడు. మెడియా (Medea) తనకు జేసన్ (Jason)తో కలిగిన సంతానాన్ని హతమార్చి ఏథెన్స్‌కు పారిపోయి వచ్చింది. ఎగియస్, మెడియాలు ఏథెన్స్‌కు ఏలికలవుతారు.

తల్లి దగ్గరే పెరిగిన థెసియస్ యుక్తవయస్కుడైనాక గండశిలను పైకెత్తి ఖడ్గాన్ని, పాదరక్షలను తీసుకుని, తల్లి అనుమతితో ఏథెన్స్‌కు బయల్దేరుతాడు. సముద్ర మార్గంలో క్షేమంగా, హాయిగా వెళతావా! లేక భూమార్గాన ఆరు పాతాళ ద్వారాలను దాటుకుంటూ, బందిపోటు దొంగల బారిన పడుతూ ఏథెన్స్ వెళతావా అని తల్లి అడిగితే భూమార్గాన్నే ఎన్నుకుని థెసియస్ ఏథెన్స్ వేపు పయనం సాగించాడు.

మొదటి పాతాళద్వారం అపోలో, ఏస్కులేపియస్‌ల పవిత్ర ఎపిడారస్ (Epidaurus). అక్కడ పెరిఫెటెస్ (Periphetes) అనే బందిపోటు దొంగ (హెఫాస్టియస్, ఏంటిక్లియాల కుమారుడు) ఒంటికన్ను, కుంటికాలు గలవాడు తన వద్ద ఉన్న కంచు గదతో ట్రోయిజన్ ఏథెన్స్‌ల మధ్య సంచరించే బాటసారుల్ని చావగొట్టి దోచుకునేవాడు. వాణ్ణి చంపి ఆతని కంచు గదను థెసియస్ తన ఆయుధంగా ఉపయోగించుకున్నాడు.

రెండవ పాతాళద్వారం ఇస్థమియాన్ వద్ద సినిస్ (Sinis) గజదొంగ రెండు 'పైన్' వృక్షాలను నేలపైకి వంచి దొరికిన బాటసారుల ఒక్కో కాలికి ఒక్కో చెట్టు చివరను కట్టి వదిలేవాడు. రెండుగా చీలిపోయిన అభాగ్యుల శరీరాలను చూసి ఆనందించే రాక్షసుడాతడు. వాణ్ణి వాడి పద్ధతిలోనే చంపి అతడి కుమార్తె 'పెరిగునె'ను బలాత్కరించగా ఆమె 'మెలానిప్పస్' అనే కుమారుడికి జన్మనిస్తుంది.

మూడవ పాతాళద్వారం 'క్రోమ్మ్యాన్' (Crommyon) వద్ద పెద్ద వరాహాన్ని చంపుతాడు. అది టైఫాన్, ఎఖిడ్నాల సంతానంగా, లేక ఫాయియా (Phaea) అనే మంత్రగత్తెగా జనులు భావించేవారు.

నాల్గవది మెగారా (Megara). అక్కడ స్కిరాన్ (Sciron) అనే ముసలి దొంగ ఇరుకైన దారి వద్ద బాటసారుల్ని తన కాళ్లు కడగమని బతిమలాడుతూ వాళ్లు ముందుకు వంగగానే ఈడ్చి తన్ని క్రింద లోయలో పడవేసేవాడు. ఆ అభాగ్యుల్ని సముద్రంలోని రాకాసి తాబేలు అప్పనంగా చప్పరించేది. థెసియస్ వాణ్ణి చంపివేసినాడు.

అయిదవది ఎలియుసిస్ (Eleusis) పవిత్ర స్థలం. దాని రాజు సెర్సియాన్ (Cercyon) తనతో అతిథులను మల్లయుద్ధానికి ఆహ్వానించి, ఓడినవారిని చంపి వేసేవాడు. థెసియస్ ఆతనిని ఓడించి చంపివేసాడు.

ఆరవ ప్రదేశంలో ప్రొక్టస్టెస్ (Proctustes - The stretcher) అనే చిత్రమైన గజదొంగ ఉన్నాడు. వాడి దగ్గర రెండు మంచాలుండేవి. బాటసారుల్ని ఆహ్వానించి వాటి మీద పడుకోమనేవాడు. బాటసారుల కాళ్లు పొడుగ్గా ఉంటే మంచానికి సరిపడేలా నరికేవాడు. పొట్టిగా ఉంటే తాళ్లుకట్టి సాగదీసి చంపేవాడు. థెసియస్ వాణ్ణి పట్టుకుని వాడి మంచాలకే కట్టి సాగదీసి, నరికి మరీ చంపినాడు.

ఏథెన్స్‌కు వచ్చిన థెసియస్‌ను ఎగియస్‌కన్నా ముందే మెడియా పసిగట్టింది. తన కుమారుడు మెడస్ (Medus) పదవికి గండం వస్తుందన్న ఆలోచనతో థెసియస్‌ను మారాథొనియన్ గిత్త (Marathonian Bull - The emblem of Cretan Power)ను తీసుకురమ్మని పంపుతుంది. దారిలో తనకు సాయం చేసిన హెకాలె (Hecale) అనే వృద్ధవనిత స్మృతి చిహ్నంగా ఆ ప్రాంతాన్ని ఆమె వారసత్వంగా ప్రకటిస్తాడు. ఏథెన్స్‌కు మారథొనియన్ గిత్తను తీసుకునివచ్చి దాన్ని బలియిచ్చాక థెసియస్‌ను చంపడానికి మెడియా విషం కలిపిన మధువును ఇస్తుంది. ఇంతలో తన ఖడ్గాన్ని, పాదరక్షల్ని గుర్తుపట్టిన ఎగియస్, థెసియస్‌ను తన కుమారుడిగా గుర్తుపట్టి థెసియస్ చేతిలోని విషపాత్రను క్రిందపడవేస్తాడు. దానితో భయపడిన మెడియా ఆసియాకు పారిపోతుంది.

ఎగియస్ అనంతరం ఏథెన్స్‌ను పరిపాలిద్దామనుకున్న పల్లాంటైడ్స్ కుట్రను భగ్నం చేసి థెసియస్ వాళ్లను హతమారుస్తాడు.

ఈ పల్లాంటైడ్స్ ఎగియస్ సోదరుడు పల్లాస్ కుమారులు. అయిదేళ్లకోసారి ఏథెన్స్‌లో జరిగే క్రీడలలో పాల్గొనడానికి క్రెటె ద్వీపం నుంచి వచ్చిన ఏండ్రొజియస్ (Androgeus) అనేక పోటీలలో విజయం సాధించి ప్రజల మన్ననలు పొందడం చూసి ఓర్వలేక ఆతనిని బంధించి చంపుతారు పల్లాంటైడ్స్. తన కుమారుడి మరణవార్త విన్న క్రెటె రాజు మినాస్ (Minos) నావికా సైన్యంతో ఏథెన్స్‌పైకి దండెత్తి వస్తాడు. హంతకులెవరో తెలియని ఎగియస్ తన దేశాన్ని మొత్తం మినాస్ పరం చేయగా,

కప్పం కింద ప్రతియేటా ఏడుగురు అత్యంత అందమైన యువతుల్ని, ఏడుగురు బలిష్ఠమైన యువకుల్ని క్రెటెకు పంపే ఒప్పందం కుదుర్తుంది.

క్రెటె ద్వీపంలో డిడాలస్ (Daedalus) నిర్మించిన గుహలో మినోటార్ అనబడే (Minotaur) నరవృషభం నివసిస్తూ ఉంటుంది. ఆ రాక్షసుడు మినాస్, పసిఫె (Pasiphae)ల కుమారుడు. తొమ్మిదేళ్లకోసారి కప్పంగా పంపబడిన ఏథెన్స్ యువతీయువకులు ఆతనికి ఆహారమయ్యేవారని ప్రతీతి.

ఈసారి వెళ్తున్న యువతీయువకుల్లో థెసియస్ కూడా ఉన్నాడు. తండ్రిని ఒప్పించి విజయుడిగా వచ్చేట్లయితే నౌక తిరుగు ప్రయాణంలో తెల్లటి తెరచాపతో సంకేతాన్ని పంపుతానని మాట యిచ్చి క్రెటెకు నల్లటి తెరచాప ఉన్న నౌకలో థెసియస్ బయల్దేరినాడు. నౌకలో ఆయుధాలేవీ తీసుకుపోనీకపోవడంతో నిరాయుధుడైన థెసియస్ క్రెటె ద్వీపానికి చేరుకున్నాడు. అక్కడ రాకుమారి ఎరియాడ్నె (Ariadne) అతన్ని మోహించి ఆతని చేతికి దారపు ఉండను, ఖడ్గాన్ని ఇస్తుంది. ఆమె చెప్పిన ప్రకారం దారపు చివరను ద్వారానికి కట్టి కుడి ఎడమలకు తిరగకుండా క్రిందకే దిగుతూ మినోటార్ నిద్రిస్తున్న గదికి చేరుకుంటాడు. మేల్కొన్న మినొటార్‌కు, థెసియస్‌కు మధ్య ఘోర యుద్ధం జరగగా మినోటార్‌ను థెసియస్ చంపుతాడు.

అదే దారపు చివరను పట్టుకుని బయటకు వచ్చిన థెసియస్ మిగిలిన ఏథెన్స్ యువతీయువకులతో పాటు ఎరియాడ్నెను, ఆమె సోదరి ఫీడ్రా (Phaedra)ను తీసుకుని క్రెటె ద్వీపం వదిలి పారిపోతాడు. మార్గమధ్యలో ఎరియాడ్నెను నక్సాస్ (Naxos) ద్వీపంలో డయొనెసిస్ కోరిక మేరకు విడిచిపెట్టగా ఆమె థెసియస్‌ను తండ్రికిచ్చిన మాట మరిచిపోయేలా శపిస్తుంది. తండ్రికిచ్చిన మాట మరచిపోయిన థెసియస్ ఏథెన్స్ తీరానికి నల్లటి తెరచాపతోనే వస్తాడు. ఎగియస్ ఆ నౌకను చూసి తన కుమారుడు మరణించాడన్న దుఃఖంతో సముద్రంలోకి దూకి చనిపోతాడు. (ఆ సముద్రాన్నే ఏగియస్ సముద్రంగా పేర్కొంటున్నాము). థెసియస్, మిగిలిన ఏథెన్స్ యువతీ యువకులు క్షేమంగా ఇంటికి చేరుతారు.

లాపిథ్స్ (Lapiths) యువరాజు – పిరిథౌస్ (Pirithous) మహావీరుడు. థెసియస్ వీరగాథల్ని విన్న పిరిథౌస్ ఆతడిని ద్వంద్వయుద్ధానికి ఆహ్వానిస్తాడు. ఇద్దరి మధ్యా పోరు 'నువ్వానేనా' అనేట్లు సాగి ఇద్దరు సమ ఉజ్జీలని తేలినాక మిత్రలాభంగా ముగుస్తుంది. ఇద్దరూ కలిసి అమ్మాయిల వేటలో పడతారు. ముందుగా హెలెన్‌ను అపహరించి, పిరిథౌస్ మనసుపడిన పెర్సిఫోన్ కోసం పాతాళానికి బయల్దేరుతారు. ఇద్దరికీ జ్యూస్ కుమార్తెలను పెళ్లిచేసుకోవాలనేది కోరిక. పాతాళనగరంలో హేడ్స్ ఇద్దరు అతిథులను ఆహ్వానించి వారిని సుఖాసీనులను గావిస్తాడు. చిత్రం! వాళ్లు కుర్చీలకు అతుక్కుపోయినారు. నిజానికి ఆ కుర్చీలు (Chairs of forgetfulness)

మతిపోగొట్టేవి. అలా కుర్చీలకు అతుక్కుపోయిన థెసియస్‌ను హెరాక్లిస్ తన పన్నెండవ పని – సెర్‌బెరస్‌ను బంధించడం – సమయంలో రక్షించి భూమిపైకి తీసుకువస్తాడు. పిరిథౌస్ పాతాళంలోనే ఉండిపోవాల్సి వస్తుంది. థెసియస్ ఏథెన్స్ వచ్చేసరికి హెలెన్‌ను డయొస్కురిలు విడిపించి ఆమెతోపాటుగా థెసియస్ తల్లి ఎయిత్రాను స్పార్టాకు తీసుకుపోతారు.

హెరాక్లిస్‌తో పాటు బయల్దేరిన హిప్పొలైటా అనే అమెజాన్ రాణిని తీసుకుని థెసియస్ ఏథెన్స్ వెళతాడు. దానికి ప్రతిగా అమెజాన్లు ఏథెన్స్‌పై దండెత్తుతారు. హిప్పొలైటా, థెసియస్‌లకు హిప్పొలైటస్ జన్మిస్తాడు. ఎరియాడ్నే సోదరి ఫీడ్రా (Phaedra)ను వివాహమాడాలనుకున్న థెసియస్‌ను వ్యతిరేకించిన హిప్పొలైటా థిసియస్, ఫీడ్రాల వివాహ సమయంలో ఏథెన్స్‌పై దండెత్తి ఆ యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకుంటుంది. కొందరు హెరాక్లిస్ చేతిలో 'హిప్పొలైటా' మరణించగా ఆమె నడుముకు పిరుదులకు ఉండే తొడుగును (Girdle) ఆతడు సంగ్రహించాడని భావించినారు. థెసియస్ అమెజాన్ల నాయకురాలు, హిప్పొలైటా సోదరి ఏంటియాపె (Antiope)ను తీసుకువెళ్లి ఆమెతో హిప్పొలైటస్‌కు జన్మనిచ్చాడని, తన సోదరి పేరుగా ఆతనికి హిప్పొలైటస్ పేరు ఏంటియాపె పెట్టిందని వాళ్ల అభిప్రాయం. కొందరు హిప్పొలైటాను పెంథెసిలియా పొరపాటున గాయపరచగా ఆమె చనిపోయిందని, దానికి ప్రాయశ్చిత్తంగానే పెంథెసిలియా ట్రోజన్ యుద్ధంలో పాల్గొన్నదని అంటారు.

ఫీడ్రా, థెసియస్‌లకు వివాహమై వారికి డిమొఫొన్ (Demophon), అకమాస్ (Acamas)లనే పుత్రులు కలిగారు. ఫీడ్రా అందగాడైన హిప్పొలైటస్‌ను ప్రేమించింది. అతడు అంగీకరించకపోవడంతో థెసియస్‌కు మాయమాటలు చెప్పి హిప్పొలైటస్ తనను బలాత్కరించాడని ఫిర్యాదు చేస్తుంది. దానిని నమ్మిన థెసియస్ తనకు పొజిడాన్ ఇచ్చిన వరంతో హిప్పొలైటస్ అశ్వాలు ఓ మహావృషభాన్ని చూసి బెదరగా రథంలోంచి క్రిందపడి హిప్పొలైటస్ మరణించేట్లు చేస్తాడు. తరువాత నిజం తెలిసేసరికి ఫీడ్రా ఆత్మహత్య చేసుకుంటుంది.

థెసియస్ పుత్రుడు అకమాస్ తరువాత ట్రోజన్ యుద్ధంలో పాల్గొని కొయ్యగుర్రంలో దాగిన వీరుల్లో ఒకడు. అంధుడై తిరుగుతున్న ఇడిపస్‌కు రక్షణనిచ్చి, ఎడ్రెస్టస్‌కు సహాయం చేసినవాడు (Seven against Thebes) థెసియస్. చివరకు థెసియస్ ప్రఖ్యాతులు క్షీణదశకు వచ్చిన స్థితిలో స్కైరాస్ (Skyros) రాజైన లైకొమెడిస్ ఆతడిని కొండశిఖరంపై నుంచి నేలపైకి తోసివేసాడని జనులు విశ్వసిస్తారు.

# 5. హెరాక్లిస్
## (Heracles)

హెరాక్లిస్ (Hera+Kleos=Hera's glory) అసలు పేరు ఆల్కియస్ (Alcaeus). ఆల్కెమెనె (Alcamene) జ్యూస్ (Zeus)లు తల్లిదండ్రులు. మగటిమికి, వీరత్వానికి సాటిలేనివాడై దేవతలకు సాయం చేసిన మానవుడిగా ఖ్యాతి గాంచినాడు. తెలివికన్నా బలం ఎక్కువ దానితో కోరి కష్టాలు తెచ్చుకుని మరల వాటిని అధిగమించడంలో కృతకృత్యుడయ్యేవాడని కొందరు విమర్శకుల అభిప్రాయం. స్నేహితులకు సహాయపడడంలో మృత్యువుతోనే ఢీకొన్న సాహసికుడిగా, వ్యాయామ శాలలకు అధిదేవతగా, శత్రుభయంకరుడిగా పేరుపొందినాడు.

ఆల్కెమెనె అసలు భర్త ఏంఫిట్రియాన్, ఒకేరోజు జ్యూస్ దేవుని వలన, ఏంఫిట్రియాన్ వలన గర్భందాల్చిన ఆల్కెమెనె హెరాదేవత దృష్టిలో పడింది. తన భర్త పరస్త్రీలతో నడిపే వ్యవహారాల్ని తీవ్రంగా వ్యతిరేకించే హెరా ఆ కోపాన్ని అక్రమ సంతానంపై చూపడం రివాజుగా మారింది. జ్యూస్ దగ్గర ఆ రాత్రి పెర్సియస్ కుటుంబంలో జన్మించే పుత్ర సంతానం రాజాధిరాజు అవుతాడని వరం తీసుకుని, కాన్పుల దేవత ఇలీథియా (Ilithiya) సాయంతో ఆల్కెమెనె ప్రసవ సమయాన్ని ఆలస్యం చేయగా పెర్సియస్ (Perseus) మనవడు, స్థెనెలాస్ + నిసిప్పె (Sthenelus + Nicippe)ల సంతానంగా యురెస్థియస్ (Eurystheus) ముందుగా జన్మిస్తాడు. తరువాత ఆల్కెమెనె కవలలు ఆల్కియస్, ఇఫిక్లెస్‌లకు (Alcaeus, Iphicles) జన్మనిస్తుంది.

హెరా పగ చల్లారలేదు. ఆల్కియస్‌ను చంపడానికి రెండు సర్పాలను పంపగా ఆతడు వాటిని తన చేతులతో నలిపి చచ్చిన పాములతో ఆడుకోసాగినాడు. హెరా ప్రయత్నాన్ని వమ్ముచేసి హెరాక్లిస్‌గా పేరు తెచ్చుకున్నాడు.

చిన్నతనంలో తనకు సంగీతం నేర్పడానికి వచ్చిన లీనస్ (Linus)ను వీణావాయిద్యంతో కొట్టి ఆతని మృతికి కారణమైనందుకు ఏంఫిట్రియాన్ హెరాక్లిస్‌ను పశువులకాపరిగా శిక్ష విధించి కొండలలోకి పంపుతాడు. అక్కడ వనకన్యలిద్దరు ఆతనికి సుఖం (Pleasure) కావాలా! సాహసం (Virtue) కావాలా! వరంగా కోరుకోమనగా హెరాక్లిస్ సాహసజీవితాన్ని కోరుకుంటాడు. (The Choice of Heracles)

ఆ తరువాత థెబెస్ (Thebes) వెళ్లి, రాకుమారి మెగారాను (Megara)ను వివాహమాడగా కలిగిన సంతానాన్ని హెరా ప్రేరేపణతో ఉన్మత్తుడై తన చేతుల్తో

తానే చంపివేస్తాడు. ఉన్మాదస్థితి నుంచి కోలుకున్నాక డెల్ఫి (Delphi) దివ్యవాణి వద్దకు వెళ్లిన హెరాక్లిస్ ప్రాయశ్చిత్తంగా యురెస్థియస్ వద్ద బానిసగా పదేళ్లపాటు జీవితం గడపాల్సి వస్తుంది. హెరాదేవత హెరాక్లిస్ జీవితాన్ని దుర్భరం చేయదలుచుకున్నది. అందుకని యురెస్థియస్‌ను ప్రేరేపించి హెరాక్లిస్‌కు పది అసాధ్యమైన పనులు అప్పగించగా ఆతడు వాటిని విజయవంతంగా నెరవేరుస్తాడు. మాటతప్పిన యురెస్థియస్ మరో రెండు పనులను పురమాయిస్తాడు. ఈ పన్నెండు అసాధ్యమైన పనులే "The Twelve labours of Heracles" గా ప్రసిద్ధికెక్కినవి.

1) నిమియన్ సింహాన్ని సంహరించుట (To kill the Nemean lion)

2) లెర్నియన్ హైడ్రాను అంతమొందించడం (To destroy the Lernean Hydra)

3) సెరెనియన్ జింకను బంధించుట (To capture the Cerynian Hind)

4) ఎరిమాంథియన్ వరాహాన్ని బంధించుట (To capture the Erymanthian Boar)

5) ఆగియన్ పశువులశాలను శుభ్రం చేయుట (To clean the Augean stables)

6) స్టింఫాలియన్ పక్షులను చంపుట (To kill the Stymphalian Birds)

7) క్రెటన్ గిత్తను బంధించుట (To Capture the Cretan Bull)

8) డయొమెడిస్ అశ్వాలను బంధించుట (To round up the Mares of Dimedes)

9) హిప్పొలైట్ పటకాను దొంగిలించుట (To steal the girdle of Hippolyte)

10) గెర్యాన్ పశువులను మందపెట్టుట (To herd the cattle of Geryon)

11) హెస్పెరెడిస్ ఏపిల్స్‌ను తెచ్చుట (To fetch the apples of Hesperedes)

12) సెర్బెరస్‌ను బంధించుట (To capture Cerberus)

మొదటి పది పనుల్ని పూర్తి చేసుకుని వచ్చినాక, యురెస్థియస్ ఆగియన్ పశువుల శాలను శుభ్రంచేసి దానికి ప్రతిఫలం స్వీకరిస్తున్నందుకు, లెర్నెనియన్ హైడ్రాను చంపే సమయంలో ఆతనికి రధసారథి అయోలస్ (Iolaus) హైడ్రా తలలను భస్మం గావించి సాయం చేసాడు కాబట్టి ఈ రెండు పనులు లెక్కించనవసరం లేదని స్పష్టం చేసి మరో రెండు పనులు అప్పగిస్తాడు.

వీటిలో ఆరు పనులు పెలొపొన్నెసె రాజ్యాల్లోనూ, మిగతావి వేర్వేరు ప్రాంతాల్లో జరిగినా ఆ ప్రదేశాలన్నీ 'హెరా' అధిదేవతగా ఉన్నవే కావడం గమనార్హం.

ఇవన్నీ విజయవంతంగా సాధించినందుకు జ్యూస్ దేవుడు హెరాక్లిస్‌కు అమరత్వాన్ని ప్రసాదిస్తాడు. హెరా ఆతనిని క్షమించి తన కుమార్తె 'హెబె' (Hebe) నిచ్చి వివాహం చేస్తుంది.

పన్నెండు క్లిష్టమైన పనులను పూర్తిచేసాక హెరాక్లెస్, ఆర్గోనాట్లతో కలిసి బంగారు ఉన్ని (Golden fleece) తేవడానికి బయల్దేరుతాడు. ట్రాయ్ నగరాన్ని జయించి, తరువాత దేవతలకు జైగాంట్స్‌కు మధ్య జరిగిన యుద్ధంలో దేవతల తరఫున పాల్గొంటాడు. ఈఖేలియా రాకుమార్తె అయొలె (Iole) ప్రేమలో పడి విలువిద్యా ప్రదర్శనలో ఆమె సోదరులను ఓడించినా తన వాగ్దానాన్ని నిలబెట్టుకోని ఆమె తండ్రి యురెటిస్ (Eurytes)ను సోదరుల్ని చంపుతాడు, ఒక్క ఇఫిటస్ (Iphitus) మినహా. ఇఫిటస్ ఆతనికి స్నేహితుడవుతాడు. మరొక్కసారి 'హెరా' కలిగించిన ఉన్మాదంతో తన స్నేహితుడైన ఇఫిటస్‌ను కోటగోడపై నుంచి విసిరి చంపిన హెరాక్లిస్ దానికి ప్రాయశ్చిత్తంగా మూడేళ్లపాటు రాణి ఓంఫాలె (Omphale) కు దాస్యం చేయవలసి వస్తుంది. ఓంఫాలె లిడియాదేశపు రాణి. అక్కడ స్త్రీ దుస్తులను ధరించి, స్త్రీలు చేసే ఇంటిపనులన్నీ హెరాక్లిస్ చేయవలసి వస్తుంది. కొన్నాళ్ల తరువాత హెరాక్లిస్‌తో ప్రేమలోపడిన ఓంఫాలె ఆతడిని పరిణయమాడగా వాళ్లకో కుమారుడు జన్మిస్తాడు.

డ్రయోపియన్ల (Dryopians) తో జరిగిన యుద్ధంలో వాళ్ల రాజు థియోడామస్ (Theiodamas) ను చంపి రాకుమారుడు హైలాస్ (Hylas) ను అనుచరుడిగా స్వీకరిస్తాడు. తరువాత హైలాస్‌ను మైసియాలోని ఓ అప్సరస మోహించి తనతో తీసుకుని వెళ్తుంది. హెరాక్లిస్ హృదయం గాయపడగా ఆతడు హైలాస్ జాడకోసం అనేక ప్రదేశాలు తిరిగినా ఆతని జాడ దొరకదు.

ప్రొమెథియస్ కాలేయాన్ని తింటూ ప్రతిరోజూ ఆతనికి ఎనలేని బాధకు గురిచేస్తున్న గరుడపక్షిని తన బాణంతో హెరాక్లిస్ చంపి జ్యూస్ శిక్షనుంచి ప్రొమెథియస్‌ను విముక్తి గావిస్తాడు.

ట్రోజన్ యుద్ధానికి ముందు పొజిడాన్ ట్రాయ్‌నగరాన్ని ధ్వంసం చేయడానికి ఓ సముద్ర రాకాసిని పంపుతాడు. పొజిడాన్‌ను ప్రసన్నం చేసుకోడానికి రాజు లావొమెడాన్ తన కుమార్తె హెసియోనె (Hesione) ను బలియివ్వడానికి నిశ్చయించు కున్నప్పుడు అటువచ్చిన హెరాక్లిస్ రాకాసి మృగాన్ని చంపుతాడు. కాని లావొమెడాన్ అతనికి బహుమతిగా ఇస్తానన్న గుర్రాలను ఇవ్వడు. హెరాక్లిస్ ట్రాయ్ నగరాన్ని ధ్వంసం చేసి, రాకుమారులను చంపగా, పొడార్క్రస్ ఆతనికి హెసియోనె నేసిన బంగారు మేలిముసుగును బహుమతిగా యిచ్చి ప్రాణాలు దక్కించుకుంటాడు. ఆ పొడార్క్రస్ తరువాత ప్రియామ్ రాజుగా పేరుగాంచాడు. హెరాక్లిస్ తన మిత్రుడు టెలమాన్‌కు (Telemon) హెసియోనెను ఇవ్వగా వారిద్దరికి ధనుర్విద్యా ప్రవీణుడు ట్యూసర్ జన్మిస్తాడు.

ఆతని భార్యలు మెగారా (Megara), ఓంఫాలె (Omphale), డియానిరా (Deianira), హెబె (Hebe). సహచర మిత్రులుగా అయోలస్ (Iolaus), హైలాస్ (Hylas), ఎలాకటాస్ (Elacatas), ఎబ్డెరస్ (Abderus), ఇఫిటస్ (Iphitus)లు.

టెలెఫస్, హైల్లస్, అలెక్జియారస్, ఎనిసెటస్‌లు ఆతని పుత్రులు.

ఆతని వీరత్వాన్ని, మగటిమిని తెలిపే అనేక సాహసకార్యాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఎఖియోలస్ అనే నదీదేవతను ఓడించి డియానిరాను గెలుచుకున్నాక, దారిలో తటస్థించిన నెస్సస్ (Nessus) అనే సెంటార్‌ను హెరాక్లిస్, లెర్నియన్ హైడ్రా రక్తంలో ముంచిన బాణంతో హతమారుస్తాడు. చనిపోయేముందు నెస్సస్, డియానిరాకు రక్తంతో తడిచిన వస్త్రాన్నిచ్చి ఎప్పుడైనా హెరాక్లిస్ ఇతర స్త్రీలతో తిరుగుతుంటే ఈ వస్త్రాన్ని ధరింపజేస్తే ఆతడు డియానిరాను విడిచిపోడని చెబుతాడు. చాలా సంవత్సరాలు గడిచిన తరువాత హెరాక్లిస్‌పై అనుమానం వచ్చిన డియానిరా లెర్నియన్ హైడ్రా రక్తం, సెంటార్ రక్తం ఉన్న ఆ వస్త్రాన్ని హెరాక్లిస్‌తో ధరింపచేయగా ఆ వస్త్రం హెరాక్లిస్ రక్తమాంసాల్ని పీల్చి ఎముకల్ని కనబడేలా చేస్తుంది.

ఆ బాధతో అతడు అక్కడే ఉన్న అనేక వృక్షాలను పెకలించి చితిని ఏర్పాటు చేసుకుని ప్రాణాలు విడుస్తాడు. ఆతని చితికి ఫిలోక్టెటిస్ నిప్పును అంటిస్తాడు. అందుకు ఫిలోక్టెటిస్‌కు హెరాక్లిస్ విల్లమ్ములు బహుమతిగా ఇవ్వబడతాయి. ఆ బాణంతోనే పారిస్ మరణం సంభవిస్తుంది.

జ్యూస్ దేవుడు హెరాక్లిస్‌ను అనుగ్రహించి ఆతనిని దేవతలలో ఒకడిగా అమరత్వాన్నిస్తాడు. హెరా దేవత ఆతనికి 'హెబె'నిచ్చి వివాహం చేస్తుంది. హెరాక్లిస్ పేరుమీదుగా ఎంగోనాసిన్ (Engonasin - on his knees) – మోకాళ్లపై కూర్చున్న హెరాక్లిస్ రూపంలో నక్షత్రమండలం ఏర్పడింది.

# 6. ఇడిపస్
## (Oedipus)

థెబెస్‌ను పరిపాలిస్తున్న లెయస్ (Laius) రాజు, జొకాస్టా (Jocasta) రాణిల కుమారుడు ఇడిపస్ (Oedipus). చాలా కాలం సంతానం కలగనప్పుడు రాజు, రాణి డెల్ఫిలోని అపోలో దేవాలయంలో దివ్యవాణి సలహా కోరినారు. ఆ దివ్యవాణి వాక్కు ప్రకారం జొకాస్టాకు మగపిల్లవాడు కలిగితే ఆతడు తండ్రిని చంపి తల్లిని వివాహమాడ్తాడు. అంత ఘోరం జరగడం యిష్టంలేక, జొకాస్టాకు మగశిశువు పుట్టగానే, లెయస్ రాజు ఆతని చీలమండలను కలిపి కట్టి, సేవకుడికిచ్చి కొండపై పారవేయమని ఆజ్ఞాపించాడు. దయగల ఆ సేవకుడు ఆ పసికందును ఓ గొర్రెల కాపరికివ్వగా, చేతులు మారి మరో గొర్రెల కాపరికి చేరి, ఆ తరువాత కోరింథ్ రాజదంపతులైన పాలిబస్, మెరొపే ఒడికి చేరతాడు, కాళ్లు కట్టివేయడం వలన పాదాలు ఉబ్బడం (Oedema-Swelling)తో అతడిని 'ఇడిపస్' అని పిలవసాగారు.

ఒకరోజున ఎవడో తాగుబోతు 'పాలిబస్ నీ తండ్రి కాదు' అని హేళన చేయగా గాయపడ్డ మనసుతో తల్లిదండ్రులు అది నిజం కాదని చెప్పినా వినకుండా 'డెల్ఫి' దివ్యవాణిని ఆశ్రయిస్తాడు. దివ్యవాణి తల్లిదండ్రుల గురించి చెప్పదు కాని ఇడిపస్ తండ్రిని చంపి తల్లిని పెండ్లాడుతాడన్న విషయాన్ని ధృవీకరిస్తుంది. దానితో ఆతడు కోరింథ్‌ను వదిలి 'థెబెస్' నగరానికి వెళ్లడానికి నిశ్చయించుకుంటాడు.

థెబెస్‌కు వెళ్లేదారిలో మూడు దారులు కలిసే డావ్లియా (Davlia) వద్ద ఓ రథికుడితో ముందు ఎవరు వెళ్లాలీ అనే విషయంపై పోట్లాట ముదిరి బాహాబాహీ యుద్ధంలో ఇడిపస్ చేతిలో రథికుడు మరణిస్తాడు. ఆతడు ఇడిపస్‌కు జన్మనిచ్చిన తండ్రి థెబెస్ రాజు లెయస్ (Laius). ఆ రకంగా జోస్యంలో మొదటి భాగం నిజమవుతుంది.

డావ్లియా నుంచి ఇడిపస్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ 'స్ఫింక్స్' అనే విచిత్ర జంతువు (సింహపు శరీరం, పక్షి రెక్కలు, స్త్రీ రొమ్ము ముఖంతో ఉండి, తన ప్రశ్నకు సరైన సమాధానం చెప్పనివాళ్లను ఆత్రంగా పీక్కుతినే రాకాసి) ఉండే ప్రదేశానికి చేరుకున్నాడు. ఆ స్ఫింక్స్ కారణంగా ప్రజలు థెబెస్‌కు రాకపోకలు తగ్గించారు. ఇడిపస్‌ను అడ్డుకుని స్ఫింక్స్ తన పొడుపు కథ (Riddle)ను విప్పమని అడిగింది – "ఉదయాన్నే నాలుగు కాళ్లతో, మధ్యాహ్నం రెండు కాళ్లతో, సాయంకాలం, రాత్రి మూడుకాళ్లతో నడిచే జంతువు ఏది?" – ఇడిపస్ 'మనిషి' – అని సమాధాన మివ్వగానే స్ఫింక్స్ సముద్రంలోకి దూకి మరణించింది.

థెబెస్ ప్రజలు స్ఫింక్స్ పీడ విరగడైనందుకు చాలా సంతోషించినారు. రాజు మరణించగా విధవరాలైన రాణి జొకాస్టానిచ్చి ఇడిపస్‌కు వివాహం చేసినారు. ఆ రకంగా జోస్యంలో రెండో భాగం నిజమైంది. ఇడిపస్, జోకాస్టాలకు ఇద్దరు మగపిల్లలు ఎటియొక్లిస్ (Eteocles), పాలినైసిస్ (Polynices) ఇద్దరు ఆడపిల్లలు – ఏంటిగొనె (Antigone), ఇస్మెనె (Ismene) కలిగినారు.

కొన్ని సంవత్సరాల తరువాత థెబెస్‌కు తీవ్రమైన పీడ చుట్టుముట్టింది. ఆడవాళ్లకు సంతానం కలగడం లేదు. పంటలు పండడం లేదు. చెట్లు పుష్పఫల హీనాలైనాయి. వంధ్యత్వం ఎల్లెడలా వ్యాపించి వృక్ష జంతు సంతతి లేకుండా చేయసాగింది. ఇడిపస్ దుఃఖితుడై జోకాస్టా సోదరుడు క్రియాన్ (Creon)ను డెల్ఫి దేవాలయంలోని దివ్యవాణి వద్దకు పంపుతాడు. క్రియాన్ వచ్చి లెయాస్ రాజు హంతకుణ్ణి పట్టుకుని దేశబహిష్కారం గాని, చంపడం గాని చేస్తేనే పీడ విరగడవు తుందని తెలియజేస్తాడు.

హంతకుణ్ణి పట్టుకోవాలనే సదుద్దేశంతో ఇడిపస్ కాలజ్ఞాని అంధుడైన టిరెసియాస్ (Tiresias)కు కబురంపుతాడు. టిరెసియాస్ హంతకుడి గురించి తెలుసుకోవడం మంచిదికాదని హెచ్చరిస్తున్నా వినకుండా నిందించినందుకు ఉగ్రుడైన టిరెసియాస్ – 'హంతకుడు ఇడిపస్' అని పేర్కొంటాడు. క్రియాన్, టిరెసియాస్‌లు తనపై బురదజల్లుతున్నారని భావించిన ఇడిపస్‌తో జోకాస్టా తన మొదటి కుమారుడు చనిపోయాడని చెబుతుంది. దానితో ఇడిపస్‌లో ఝంఝూటన మొదలై తానే ఈ ప్రస్తుత పీడకు కారణమని అనుమానపడతాడు. ఇంతలో కోరింథ్ నుంచి వచ్చిన దూత ఇడిపస్ తండ్రి పాలిబస్ మరణించాడన్న వార్త తెచ్చినాడు. ఇంకా తన తల్లిదండ్రులు పాలిబస్, మెరొపెలేనని భావిస్తున్న ఇడిపస్ తన తండ్రి చావుకు తాను కారణం కానందుకు సంతోషించి కోరింథ్ వెళ్లాడు. ఇడిపస్‌కు తండ్రి మరణవార్త తెచ్చిన దూత ఇడిపస్ పాలిబస్ పెంపుడు కొడుకు అన్న విషయాన్ని కూడ ధృవీకరిస్తాడు. జోకాస్టా ఇక ఆ విషయాన్ని అంతటితో వదిలేయమని కోరినా వినకుండా ఇడిపస్ తన పుట్టుపూర్వోత్తరాల్ని గొర్రెల కాపరుల ద్వారా తెలుసుకుని, తాను డాల్లియాలో చంపింది తన తండ్రి లెయస్ (Laius)గా గ్రహించి, జొకాస్టా వద్దకు వెళ్లేసరికే ఆమె ఉరివేసుకుని మరణించి ఉంటుంది. ఎనలేని దుఃఖంతో ఇడిపస్ ఆమె దుస్తులకున్న పిన్నుతో కండ్లు పొడుచుకుని గుడ్డివాడవుతాడు. క్రియాన్‌ను పిలిచి తను పిల్లలను అప్పగించి దేశ బహిష్కారపు శిక్ష విధించుకుని, తన కుమార్తె ఏంటిగొనె సాయం రాగా, ఏథెన్స్ రాజు థెసియస్ ఆశ్రయం పొంది కొలొనస్ (Colonus)లో తనువు చాలిస్తాడు.

కుమారులు ఎటియోక్లిస్ (Eteocles), పాలినైసిస్ (Polynices)లు ఏడాదికొకరు రాజ్యపాలన చేసే ఒప్పందం చేసుకున్నారు. ఏడాది గడచినాక ఎటియోక్లిస్ రాజ్యాన్ని పాలినైసిస్‌కు ఇవ్వడానికి నిరాకరించడంతో ఇద్దరి మధ్య యుద్ధం మొదలై ఒకరినొకరు చంపుకోవడంతో అంతమవుతుంది. క్రియాన్ సింహాసనాన్ని అధిష్ఠించి పాలినైసిస్‌ను దేశద్రోహిగా చిత్రించి అంతిమ సంస్కారార్హత లేకుండా ఆజ్ఞ జారీచేస్తాడు. ఏంటిగొనె ఆ ఆజ్ఞను ధిక్కరించి తన సోదరుడికి అంత్యక్రియలు జరపడంతో ఆగ్రహించిన క్రియాన్ ఆమెను సజీవంగా సమాధి చేయాలని నిర్ణయించడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంటుంది. ఇస్మెనె తన సోదరితోపాటు తనను కూడా చంపివేయమని వేడుకోగా మనసు కరిగిన క్రియాన్ ఏంటిగొనె శిక్షను రద్దుపరచి ఆమె సజీవసమాధి వద్దకు వస్తాడు. ఏంటిగొనెతో వివాహం నిర్ణయించబడిన క్రియాన్ కుమారుడు హీమన్ (Haemon) తండ్రిని చంపి తాను ఆత్మహత్య చేసుకోగా ఈ దుర్వార్తలు విన్న క్రియాన్ భార్య యురిడైస్ (Eurydice) కూడ తనువు చాలిస్తుంది.

**ఇడిపస్ కాంప్లెక్స్ :** సిగ్మండ్ ఫ్రాయిడ్ మగపిల్లల్లో కలిగే తల్లిపై ప్రేమ, తండ్రిపై ద్వేషాన్ని 'ఇడిపస్ కాంప్లెక్స్'గా వర్ణించినాడు.

**ఇడిపిజమ్ :** తనకు తానే కన్ను పొడుచుకుని గుడ్డివాడవడం

**ఇడిపెయస్** (Oedipais = Child of the swollen sea) **:** తల్లిదండ్రులు పిల్లవాణ్ణి వదిలించుకోవడం (abandoning) – పెట్టెలో పెట్టి నీళ్లలో వదిలేయడం. కొండలపై విడిచిపెట్టిరావడం – ఇటువంటి సంఘటనలు పెర్సియస్, టెలిఫస్, డయొనిసస్, రోములస్, రెమస్, మోజెస్, ఇడిపస్, కుంతీపుత్రుడు కర్ణుడు – లాంటి వీరులకు జరిగినవే.

# 7. ఎఖిల్లిస్
## (Achilles)

సముద్రపు దేవుడు (The old man of the sea) నెరియస్ (Nereus) కుమార్తె థెటిస్ (Thetis)కు జన్మించబోయే కుమారుడు తండ్రికన్నా గొప్పవాడవుతాడని ప్రొమెథియస్ (Prometheus) జోస్యం చెబుతాడు. అప్పటివరకు థెటిస్‌ను వివాహ మాడదామని ఉవ్విళ్లూరిన జ్యూస్, పొజిడాన్‌లు తమ ప్రయత్నాల్ని విరమించుకుని థెటిస్ దేవతను మర్త్యుడైన పెలియస్‌కు ఇచ్చి వివాహం చేస్తారు.

ఎఖిల్లిస్ జన్మించినపుడు ఆతని తల్లి థెటిస్ ఆ పసికందును చీలమండ దగ్గర (Achilles heel) పట్టుకుని స్టిక్స్ (Styx) నదిలో ముంచుతుంది. అందువలన ఎఖిల్లిస్ శరీరంలోని చీలమండ భాగం తప్ప మిగతాది ఆయుధాలకు దుర్భేద్యమై వజ్రసమానమవుతుంది. (స్టాటియస్ వ్రాసిన ఎఖిల్లీడ్ (Achellied) ఈ విషయాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది.

పెలియస్ తన కుమారుడికి విద్యాబుద్ధులు నేర్పమని చిరాన్ (Chiron) అనే సెంటార్‌కు (Centaur) బాధ్యతలు అప్పచెబుతాడు. ఈలోగా కాల్కాస్ అనే కాలజ్ఞాని గ్రీకులకు ట్రాయ్‌నగరంపై విజయం లభించాలంటే ఎఖిల్లిస్ సహాయం తప్పనిసరి అని జోస్యం చెబుతాడు. సమరానికి వెళితే ఎఖిల్లిస్ తిరిగిరాడని తెలిసిన థెటిస్ ఆతనికి ఆడపిల్ల వేషం వేసి స్కిరాస్ రాకుమార్తెల మధ్య ఉంచుతుంది. ఆ విషయం పసిగట్టిన ఒడెసిస్ (Odysseus) ఆడపిల్లల వద్ద ఆభరణాలు, ఆయుధాలు ఉంచగా ఎఖిల్లిస్ దృష్టి అంతా ఆయుధాలపైననే ఉంటుంది. ఇంతలో ఒడెసిస్ సలహాతో యుద్ధభేరి మోగగానే ఎఖిల్లిస్ ఆయుధాన్ని దొరకబుచ్చుకుని యుద్ధానికి సిద్ధమవుతాడు తను ఆడపిల్లవేషంలో ఉన్నానన్న విషయం మరచిపోయి. ఆ తరువాత యాభై నౌకలతో మిర్మిడాన్లను తీసుకుని తన ఆంతరంగిక మిత్రుడు పాట్రొక్లస్‌తో సహా యుద్ధానికి బయల్దేరుతాడు. ఒక్కోనౌకలో యాభైమంది మిర్మిడాన్లు, ప్రతి అయిదువందల మందికి ఒక నాయకుడు చొప్పున అయిదుగురు వీరులు – మెనెస్థెస్, యుడోరస్, పీసాండర్, ఫీనిక్స్, ఆల్సిమెడాన్‌లు–మిర్మిడాన్ల సైన్యం శతృభయంకరంగా యుద్ధానికి సన్నద్ధమైనది.

దారితప్పిన ఆర్గీవులు మొదట మైసియా (Mysia) నగరాన్ని చేరుకుని అక్కడి రాజుపై దండెత్తగా రాజు టెలెఫస్ (Telephus) గాయపడ్డాడు. ఆ గాయం ఎంతకీ నయం కాకపోయేసరికి దైవజ్ఞానుల సలహాతో (ఎవడివల్ల గాయమయ్యిందో అతడే నయం చేయగలడు – He that wounded shall heal) ఆర్గాస్ నగరం చేరుకుని ఎఖిల్లిస్ వైద్యంతో కోలుకుంటాడు టెలిఫస్.

ఆ తరువాత ఎఖియన్లు ట్రాయ్ నగర తీరానికి చేరి సముద్ర తీరాన విడిది చేసి రాయబార ప్రయత్నాలు చేస్తారు. అవి విఫలం కాగా ట్రాయ్ నగరాన్ని ఒంటరి చేయడానికి చుట్టుపక్కల ట్రోజన్ పరిపాలనలో ఉన్న నగరాలపై దండెత్తి సంపదలను దోచుకోసాగినారు. అటువంటి ముట్టడులలో ఒకసారి ప్రియామ్ ఆఖరి కుమారుడు ట్రాయిలస్ (Troilus) ఎఖిల్లిస్ చేజిక్కి ప్రాణాలు కోల్పోతాడు. ట్రాస్, ఇలియస్ (Tros, Ilius) పేర్ల వలన ట్రాయ్, ఇలియమ్‌గా ట్రాయ్‌నగరం ప్రసిద్ధికెక్కింది. ట్రాయ్ నగర నిర్మాతలైన ఇద్దరు వీరుల పేర్లు కలిసి ఉన్న ట్రాయిలస్ జీవించి ఉన్నంత కాలం ట్రాయ్‌నగర పతనం సంభవించదన్న జోస్యాన్ని నమ్మి, ఎఖిల్లిస్ అత్యంత సుందరుడైన ట్రాయిలస్‌ను శిరచ్ఛేదం చేస్తాడు.

ఎఖిల్లిస్ లిర్నెస్సస్‌పై దండయాత్రచేసి బ్రిసిస్ రాకుమార్తె భర్తను, సోదరులను హతమారుస్తాడు. అదే యుద్ధంలో పట్టుబడ్డ క్రైసిస్‌ను ఆగమెమ్నాన్‌కు, బ్రిసిస్‌ను ఎఖిల్లిస్‌కు ఆర్గీవులు బహుమతిగా యిస్తారు. క్రైసిస్ తండ్రి అపోలో దేవాలయ పూజారి. అతడు ఎంత బతిమిలాడినా ఆగమెమ్నాన్ క్రైసిస్‌ను ఇవ్వడానికి ఇష్టపడక పోవడంతో, ఆతడు అపోలోను ప్రార్థించగా ఆర్గీవు సైనికులకు ఒక వింత వ్యాధి సోకి అనేకమంది మృత్యువాత పడసాగినారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆగమెమ్నాన్ క్రైసిస్‌ను ఆమె తండ్రి వద్దకు పంపి దానికి బదులుగా బ్రిసిస్‌ను తన స్వాధీనం చేసుకుని ఎఖిల్లిస్‌తో విరోధాన్ని కొనితెచ్చుకుంటాడు. మండిపడిన ఎఖిల్లిస్ ఇక తాను యుద్ధంలో పాల్గొనని భీష్మించుకుని, జ్యూస్ దేవుని సాయంతో ట్రోజన్లు విజృంభించి ఆర్గీవులను చావుదెబ్బకొట్టి తన కాళ్లబేరానికి ఆగమెమ్నాన్ వచ్చేలా చేయమని తన తల్లి థెటిస్‌ను ప్రార్థిస్తాడు.

ట్రోజన్ల ఆర్గీవుల మధ్య పోరు తీవ్రమై హెక్టార్ నాయకత్వాన ట్రోజన్లు ఆర్గీవుల నౌకల చుట్టూ నిర్మించుకున్న కందకాన్ని ప్రాకారాన్ని దాటి నౌకల వద్దకు చేరుకుంటారు. నెస్టర్ సలహాతో ఆగమెమ్నాన్ విధిలేని పరిస్థితుల్లో ఒడెసిస్, పెద్ద అజాక్స్, ఫీనిక్స్‌లను రాయబారానికి పంపుతాడు. రాయబారం విఫలమవుతుంది.

ట్రోజన్లు మరింత చెలరేగి నౌకల వద్దకు చొచ్చుకుని వచ్చి నిప్పు పెడ్తారు. ఆర్గీవుల వీరులందరూ గాయాలపాలై సర్వనాశనం తప్పదనుకున్న సమయంలో ఎఖిల్లిస్ ఆంతరంగిక మిత్రుడైన పాట్రొక్లస్, ఎఖిల్లిస్ అనుమతితో ఆతని కవచాన్ని ఆయుధాల్ని తీసుకుని ట్రోజన్లను తిప్పికొడ్తాడు. కాని హెక్టార్ చేతిలో ప్రాణాలు కోల్పోతాడు. ఆతని మృతికి మనస్తాపం చెందిన ఎఖిల్లిస్ తల్లిసాయంతో హెఫాస్టస్ ఇచ్చిన ఆయుధ సామాగ్రి, కవచాన్ని ధరించి అనేకమంది ట్రోజన్లను సంహరించి, స్కమాండర్ నదితో కలబడి, ఎట్టకేలకు హెరా, హెఫాస్టస్ దయవల్ల బయటపడ్తాడు. ఆ తరువాత హెక్టార్‌ను

ద్వంద్వయుద్ధంలో చంపి ఆతని శవాన్ని తన రథానికి కట్టి ఈడ్చుకుంటూ వెళ్లి పాట్రొక్లస్‌కు అంత్యక్రియలు నిర్వహిస్తాడు. పాట్రొక్లస్ స్మృతిచిహ్నంగా అనేక క్రీడా ప్రదర్శనలను నిర్వహించి విజేతలకు బహుమతుల్నిస్తాడు.

హెక్టార్ తండ్రి ప్రియామ్‌రాజు అర్థరాత్రి ఎఖిల్లిస్ శిబిరానికి చేరుకుని ఆతని మనసు కరిగించి శుల్కాన్ని చెల్లించి హెక్టార్ శవాన్ని తీసుకునివెళ్లి ట్రాయ్ నగరంలో అంత్యక్రియలు జరిపిస్తాడు. ఎఖిల్లిస్ ఆ తరువాత ట్రోజన్లకు సాయంగా వచ్చిన అమెజాన్ రాణి పెంథెసిలియాను, ఇథియోపియన్ల నాయకుడు మెమ్నాన్‌ను చంపుతాడు. చివరకు స్కిమియన్ ద్వారాల వద్ద పారిస్, స్తంభం వెనక దాగి తన విషపూరితమైన బాణంతో ఎఖిల్లిస్ చీలమండను గాయపరచి ఆతని ప్రాణాలు తీస్తాడు. ఎఖిల్లిస్ ఆయుధాల కోసం జరిగిన అంత్యక్రియల క్రీడలలో ఒడెసిస్, అజాక్స్‌ల మధ్య తీవ్రమైన పోటీ జరిగాక అవి ఒడెసిస్‌కు ఇవ్వబడతాయి. ఎఖిల్లిస్ అస్థికల్ని, పాట్రొక్లస్ అస్థికలతో కలిపి సమాధి గావిస్తారు.

స్వచ్ఛమైన ఉద్రేకం, కర్కశత్వం, కోపం, వీరత్వం, ప్రేమ, మూర్తీభవించిన సౌందర్యం, దేవతాంశ మానవ శరీరంతో ఎఖిల్లిస్ గ్రీకు వీరులలో ముఖ్యుడిగా కొనియాడబడినాడు.

# 8. ఒడెసిస్
## (Odysseus)

ఇథాకా రాజు, లియార్టెస్ (Laertes), ఏంటిక్లియాల కుమారుడు, పెనెలోప్ (Penelope) భర్త అయిన ఒడెసిస్ గ్రీకు వీరులలో మహావీరుడు, మాయోపాయ చతురుడు – మహావక్తగా ప్రసిద్ధికెక్కినాడు.

ఒలెసిస్, ఒలెక్సియస్, యులిసెస్ (రోమన్), యులిక్సెస్‌గా నామాంతరాలున్నా ఒడుస్సోమాయి (Odussomai = hate or the one who is wrathful / hated) అనగా అందరిచే ద్వేషింపబడేవాడు లేక ఇతరులలో ఈర్ష్య కలిగించేవాడుగా చెప్పుకోవచ్చును.

రోమన్లు 'యులిసెస్'ను ఒక ప్రతినాయకుడిగా, దుర్లక్షణాలున్న క్రూరుడిగా (Cruel - dirus Ulixes), మోసగాడిగా అభివర్ణించారు. వర్జిల్ (Virgil) ఎయినీడ్ (Aenead) కావ్యంలో ఈ భావనల్ని గమనించవచ్చును.

మెనెలాస్, హెలెన్‌ల వివాహ సమయంలో వచ్చిన రాజులందరు హెలెన్ తండ్రి టిండారియస్ (Tyndareus) తో ఒక ఒప్పందానికి వచ్చేలా చేసిన ఒడెసిస్ (హెలెన్ ఎవర్ని ఎన్నుకున్నా మిగతావాళ్లు ఆ నిర్ణయాన్ని ఆమోదించి, ఆ వివాహాన్ని బలపరచాలని) తీరా తనకు పెనెలోప్‌తో వివాహమై టెలెమాఖస్ జన్మించాక ఆ బంధాలలో చిక్కుకున్నాడు. అక్కడ హెలెన్, పారిస్‌తో కలిసి ట్రాయ్ నగరానికి ఉడాయించగానే మెనెలాస్, ఆగమెమ్నాన్‌లు ట్రాయ్‌నగరంపై యుద్ధానికి నిర్ణయించుకుని ఆనాడు హెలెన్, మెనెలాస్‌ల వివాహానికి విచ్చేసి ఒప్పందానికి బద్ధులైన వీరులందరి వద్దకు తమకు సాయం రమ్మని రాయబారుల్ని పంపుతారు. యుద్ధానికి వెళ్లడం యిష్టంలేని ఒడెసిస్ పిచ్చివాడిగా నటిస్తూ నాగలికి ఒకపక్కన ఎద్దును, రెండో పక్క గాడిదను కట్టి, ఇసుకను నాటుతూ రాయబారానికి వచ్చిన పలామెడిస్ దృష్టిలో పడినాడు. పలామెడిస్ పసివాడైన టెలెమాఖస్ (Telemachus) ను తీసుకువచ్చి నాగలి ముందు ఉంచగా ఒడెసిస్ తన వ్యూహాన్ని విరమించి ఎఖియన్లతో కలిసి యుద్ధానికి రావడానికి అంగీకరిస్తాడు. కాని పలామెడిస్‌పై కసి పెంచుకుని తరువాత కాలంలో ఆతడిని దేశద్రోహిగా ఋజువు కావించి రాళ్లతో కొట్టించి చంపుతాడు.

తరువాత ఒడెసిస్, ఆగమెమ్నాన్ (Agamemnon) పంపగా ఎఖిల్లిస్ (Achilles) ను తీసుకురావడానికి స్కిరాస్ (Scyros) వెళతాడు. ఎఖిల్లిస్ తల్లి థెటిస్ (Thetis) ఆతడికి ఆడవేషం వేయించినా ఒడెసిస్ ఆడపిల్లల ముందు ఆభరణాల్ని, ఆయుధాల్ని చూపిస్తూ యుద్ధ హెచ్చరికలు చేయగానే, ఎఖిల్లిస్ క్షణం ఆలస్యం చేయకుండా ఆయుధాన్ని చేబట్టి ముందుకు దూకుతాడు. రహస్యం బట్టబయలు

కాగా, ఇష్టపూర్తిగానే ఎఖిల్లిస్ తన మిత్రుడు పాట్రొక్లస్ (Patroclus), గురువు ఫీనిక్స్ (Phoenix) లతో కలిసి మిర్మిడాన్ల (Myrmidons) ను వెంటబెట్టుకుని యుద్ధానికి బయల్దేరుతాడు.

ఎఖియన్ల నౌకలు ట్రాయ్ నగర తీరానికి చేరగానే తెలివిగా ఒడెసిస్ తన డాలును నేలపై విసిరి దానిపై నిలబడతాడు. ఎందుకంటే ఎవరైతే ముందుగా ట్రాయ్ తీరంలో నేలనంటుతారో ఆతడు మరణిస్తాడని జ్యోతిష్కులు చెప్పడంతో ఎవరూ ముందుకు రారు. ఒడెసిస్ దూకగానే వెంటనే ప్రొటెసిలాస్ దూకుతాడు కాని నేలపై దూకడం వలన హెక్టార్ వదిలిన బాణం ఆతనికి తగిలి మరణించగా జోస్యం నిజమవుతుంది.

ట్రాయ్ యుద్ధంలో ఎఖియన్ల విజయానికి ఒడెసిస్ చతురత, వీరత్వం, పోరాటపటిమ ముఖ్య కారణాలవుతాయి. యుద్ధవిరమణ చేద్దామన్న ఆగమెమ్నాన్‌ను ఆపి ఆర్గీవులలో ధైర్యాన్ని, ఉత్సాహాన్ని నింపుతాడు. హెక్టార్‌తో ద్వంద్వ యుద్ధానికి సాహసించి ముందుకు వచ్చిన వీరులలో ఒడెసిస్ కూడా ఉన్నాడు. రీసస్ (Rhesus) అశ్వాల్ని ఆర్గీవుల పరం చేసింది డయొమెడిస్‌తో కలిసి అతడే! పాట్రొక్లస్ మరణం తరువాత జరిగిన క్రీడాప్రదర్శనలలో పరుగుపందెం, మల్లయుద్ధంలో పాల్గొని బహుమతులు పొందుతాడు ఒడెసిస్.

ఎఖిల్లిస్ మరణం తరువాత ఆతని కవచం, ఆయుధాల కోసం జరిగిన పోటీలలో ఒడెసిస్, పెద్ద అజాక్స్‌ల మధ్య తీవ్రమైన ఘర్షణ జరుగుతుంది. ఎట్టకేలకు ట్రోజన్ ఖైదీల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ఒడెసిస్‌ను విజేతగా నిర్ణయించగా, పెద్ద అజాక్స్ ఉన్మత్తుడై వీరంగం చేస్తూ మెనెలాస్, ఆగమెమ్నాన్ లనుకొని పక్కనే ఉన్న గొర్రెలను చంపుతాడు. తెల్లవారినాక తాను చేసిన తప్పును గ్రహించి తన కత్తిపై పడి ఆత్మహత్య చేసుకుంటాడు.

ఒడెసిస్ ఆ ఆయుధాలను, కవచాన్ని తరువాత ఆర్గీవుల తరపున యుద్ధంలో పాల్గొనడానికి వచ్చిన ఎఖిల్లిస్ కుమారుడు నియోటాలమస్‌కు అప్పగిస్తాడు. ఫిలోక్టెటిస్‌ను అతని దగ్గర ఉన్న హెరాక్లిస్ విల్లమ్ముల్ని తీసుకురావడం, ఎథెనా పల్లాడియంను ట్రాయ్‌నగరం నుంచి బిచ్చగాడి వేషంలో దొంగిలించుకురావడం, ట్రోజన్ గుర్రం (Trojan Horse) వ్యూహాన్ని అమలుపరచి, ఆగమెమ్నాన్‌కు ఆర్గీవులకు మహత్తరమైన విజయాన్ని అందించినవాడు ఒడెసిస్.

శత్రుశేషం, ఋణశేషం ఉండరాదని, హెక్టార్ కుమారుడు ఏస్టియానక్స్ (Astyanax) ను కోటపై నుంచి విసిరి చంపుతాడు. అంతటితో ట్రాయ్ నగర ధ్వంసం కూడా పూర్తవుతుంది.

అక్కడి నుంచి తిరుగు ప్రయాణం (Odyssey= ఒడెస్సీ) మొదలవుతుంది. పొజిడాన్ వ్యతిరేకతతో అది పదేళ్లు సాగి చివరకు దేవతలు కరుణించగా అనేక కష్టనష్టాలు పడి ఇంటికి చేరుకుంటాడు. ఆ తిరుగు ప్రయాణంలో ఆతడెదుర్కొన్న చిత్రవిచిత్ర సంఘటనల సమాహారమే "ఒడెస్సీ".

సముద్రపు దొంగల బారి నుంచి, తుఫాను ఒడిదుడుకుల్నుంచి బయటపడి పన్నెండు నౌకలతో ఒడెసిస్ ప్రయాణం అదృష్ట దురదృష్టాల మధ్య ఊగిసలాడుతూ సాగుతుంది. పద్మాలను భుజించేవాళ్ళ నుంచి (Lotus eaters) తప్పించుకుని, ఏకాక్షి, మహాకాయుడు సైక్లాప్స్ పాలిఫెమస్ (Cyclops - Polyphemus) కన్ను పొడిచి అంధుణ్ణి గావించి అక్కణ్ణుంచి బయటపడి, తుఫానుదెబ్బకు నరమాంసభక్షకులైన లీసెట్రైగోనస్ (Laesotrygones) బారిన పడతారు. పన్నెండు నౌకలలో ఒడెసిస్ నౌక ఒక్కటే ఇప్పుడు మిగిలింది. లీస్ట్రైగోనస్‌ల నుంచి తప్పించుకుని మంత్రగత్తె సిర్సె (Circe) చేతికి చిక్కుతాడు. ఆమె ఒడెసిస్ అనుచరులలో సగం మందిని పందులుగా మారుస్తుంది. ఒడెసిస్ తనకు హెర్మెస్ ఇచ్చిన మోలీ (Moly) అనే ఔషధం తాగి సిర్సె బారినుంచి తనను రక్షించుకుని ఆమెతో ఒక ఏడాది సంసారం చేసి, ఆమె అనుమతి తీసుకుని మరల ప్రయాణం ప్రారంభిస్తాడు. ఈసారి సైరెన్లను తప్పించుకుని, స్కిల్లా రాక్షసి, ఛారిబ్డిస్ సుడిగుండాల గండాలనుంచి బయటపడి థిర్నెసియా (Thirnacia) ద్వీపాన్ని చేరుకుంటారు. టిరెషియాస్ (Tiresias) జ్ఞాని సలహాని పెడచెవినబెట్టిన ఒడెసిస్ అనుచరులు హెలియాస్ దేవునికి చెందిన పశువుల్ని వేటాడి ఆతని ఆగ్రహానికి గురై, తుఫాను చెలరేగగా, నౌక ధ్వంసమై ఒడెసిస్ ఒక్కడు ప్రాణాలతో బయటపడతాడు.

అక్కడ కాలిప్సో (Calypso) తో ఏడేళ్లు కాపురం చేసి, ఓనాడు ఫెయాసియన్ల నౌకలో అర్ధరాత్రి ఇథాకా తీరం చేరుకుంటాడు. అక్కడ తన కుమారుడు టెలిమాఖస్, పందుల కాపరి యుమియస్ (Eumaeus) పశువుల కాపరి ఫిలోషియస్ (Philoteus), ఎథెనా దేవతల సాయంతో తన భార్య పెనెలోప్ (Penelope) ను వేధిస్తూ ఆమెను వివాహమాడదలిచిన ఇథాకా వీరుల్ని హతమార్చి తన భార్యను కలుసుకుంటాడు. ఎథెనా దయవల్ల తమ కుమారుల్ని పోగొట్టుకున్న ఇథాకా ప్రజల్ని శాంతపరచి తన స్థానాన్ని పదిలపరుచుకుంటాడు ఒడెసిస్.

చరమాంకంలో తన పుత్రుడు, సిర్సె కుమారుడు టెలెగొనస్ తనను వెదుకుతూ రాగా, అనూహ్య పరిస్థితుల్లో ఇద్దరి మధ్య జరిగిన యుద్ధంలో కొడుకు చేతిలో గాయపడతాడు ఒడెసిస్. మరణావస్థలో తన పుత్రుణ్ణి గుర్తించి ఆతని చేతులలో కన్నుమూస్తాడు. సిర్సె ద్వీపంలో ఒడెసిస్ అంత్యక్రియల అనంతరం పెనెలోప్‌తో టెలిగోనస్‌కు, తాను టెలిమాఖస్‌ను పరిణయమాడి సిర్సె (Circe) తన మంత్రశక్తులతో అందరిని అమరుల్ని గావిస్తుంది.

# 9. హెక్టార్
# (Hector)

ప్రియామ్, హెకుబాల జ్యేష్ఠ కుమారుడు హెక్టార్. ట్రోజన్ సర్వసైన్యాధ్యక్షుడు, మహావీరుడు. పారిస్, హెలెనస్, కాసాం్రడాల సోదరుడు. థెబెస్ రాకుమారి ఈటియన్ (Eetion) కుమార్తె ఏండ్రొమాఖెను వివాహమాడినాడు. వారి కుమారుడు ఏస్టియానక్స్ (Astyanax or Scamandrius) ఆర్గీవులలో అతనికి సాటి లేదా మించిన వీరులు ఎఖిల్లిస్, పెద్ద అజాక్స్, డయొమెడిస్‌లు మాత్రమే. ట్రోజన్ యుద్ధం తొలిదశలో, ఎఖిల్లిస్ యుద్ధానికి దూరంగా ఉన్నపుడు, దేవతల ప్రేరేపణచే హెక్టార్ ఆర్గీవులను చెల్లాచెదరు చేస్తాడు. పెద్ద అజాక్స్‌తో జరిగిన ద్వంద్వయుద్ధంలో ఇద్దరు సమ ఉజ్జీలు అవుతారు.

దేవతలు ట్రోజన్ల వేపు మొగ్గుచూపగా ఆర్గీవుల రక్షణ శ్రేణులను నాశనం చేస్తూ హెక్టార్ అగడ్త, ప్రాకారాలను దాటి నౌకలవద్దకు చేరి ఒక నౌకకు నిప్పంటిస్తాడు. కాని అత్యుత్సాహం, వేచివుండే ధోరణి లేకపోవడంతో ట్రోజన్లకు కొన్ని కష్టాలు కూడా వాటిల్లుతాయి. ఎఖియన్ల నౌకలో మంటలు చెలరేగగానే ఎఖిల్లిస్ ప్రియమిత్రుడు పాట్రొక్లస్ మిత్రుని అనుమతితో ఆర్గీవుల శిబిరాల నుంచి ట్రోజన్లు పారిపోయేట్లు చేయ గలిగినాడు. కాని ఆ తరువాత జరిగిన యుద్ధంలో హెక్టార్ చేతిలో పాట్రొక్లస్ మరణిస్తాడు.

ఎఖిల్లిస్‌తో ఆ పరిస్థితుల్లో యుద్ధం మంచిదికాదన్న పాలిడామస్ సలహాను పెడచెవినబెట్టి హెక్టార్ తన ముఖ్య అనుచరులతోపాటు తాను కూడ ప్రాణాలు కోల్పోతాడు. ఎఖిల్లిస్‌కు శుల్కం చెల్లించి ప్రియామ్ రాజు తన కుమారుడి శవాన్ని ట్రాయ్‌కు తీసుకువెళ్లి అంత్యక్రియలు కావించినాడు. ట్రాయ్‌నగర పతనానంతరం ఆర్గీవులు హెక్టార్ కుమారుడు ఏస్టయానక్స్‌ను కోటపై నుంచి విసిరి చంపుతారు. ఎఖిల్లిస్ కుమారుడు నియోటాలమస్ హెక్టార్ తండ్రిని చంపుతాడు. ట్రాయ్‌నగర పతనానంతరం నియొటాలమస్‌కు హెక్టార్ భార్య ఏండ్రొమాఖె బానిసగా లభిస్తుంది. నియోటాలమస్, హెర్మియాన్‌ల వివాహానంతరం ఏండ్రొమాఖె హెక్టార్ సోదరుడు హెలెనస్‌కు ఇవ్వబడుతుంది.

# 10. పారిస్
## (Paris)

